

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 116

బుధవారం 17-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఒలింపిక్ పతకాల వేటలో..

భారత క్రీడాకారులకు ప్రభుత్వం అండ.. 'పారిస్' సన్నాహాలకు నిధులు - 14లో



శౌర్య సంచలనం


ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖరారు - 14లో



ఐరాసలో మోదీ ప్రసంగం

సెప్టెంబర్‌లో జరిగే ఐరాస 79వ సర్వ ప్రతినిధి సభ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు.

- వివరాలు 6లో



సుప్రీంకు మరో ఇద్దరు జడ్జీలు

సుప్రీంకోర్టు జడ్జీలుగా జస్టిస్ నాంగ్మేకపామ్ కొటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్ మంగళవారం నియమితులయ్యారు.

- వివరాలు 6లో



రత్న భండార్‌ను రేపు తెరుస్తాం

పూరీ ఆలయంలో అమూల్య సంపదను భద్రపరిచిన రత్న భండార్‌ను గురువారం మళ్లీ తెరుస్తామని ఆలయ వర్గాలు తెలిపాయి.

- వివరాలు 6లో



ట్రైనీ ఐఏఎస్‌పై కేంద్రం సీరియస్

వివాదాలకు కేంద్రబిందువైన ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ శిక్షణను నిలుపుదల చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కశ్మీర్‌లో ఉగ్రకాల్పులు... నలుగురు జవాన్ల వీరమరణం



జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో భద్రతా బలగాలపై ఉగ్రవాదులు సోమవారం రాత్రి జరిపిన కాల్పుల్లో శ్రీకాకుళానికి చెందిన నాయక్ డి.రాజేశ్ సహా నలుగురు జవాన్లు వీరమరణం పొందారు. గాయపడ్డ మరో సైనికుడిని ఆస్పత్రికి తరలించారు.

- వివరాలు 6లో

ఇంజనీరింగ్‌లో పెరిగిన సీట్లు 2,640



ఇంజనీరింగ్‌లో సీట్లు మరో 2,640 పెరిగాయి. ఇవన్నీ సీఎస్‌ఈ, ఏఐఎంఎల్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచీలకు చెందినవే కావడం గమనార్హం. కొత్త వాటితో కలుపుకొని 1,01,661 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

- వివరాలు 3లో

ఎస్సీ గురుకులాల్లో 'డిస్ లొకేటెడ్' లొల్లి!



సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ పరిధిలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. జీఓ 317 అమల్లో భాగంగా పలువురు ఉద్యోగులను డిస్‌లొకేట్ చేస్తూ కొత్తగా జోన్‌లు, మల్టీజోన్‌లు కేటాయిస్తూ జాబితా విడుదల చేయడాన్ని తప్పుబడుతూ ఉద్యోగులు ఆందోళనకు దిగారు.

- వివరాలు 3లో

కుక్కలు గుంపుగా వచ్చి.. బాలుడిని ఈడ్చుకెళ్లి ..



ఏడాదిన్నర బాలుడిపై వీధికుక్కలు దాడిచేసి నోటకరుచుకొని కొంతదూరం ఈడ్చుకెళ్లిన ఘటన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చోటుచేసుకుంది. కుక్కల దాడిలో బాలుడి తలపై కొంత భాగం ఊడిపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి



పాస్‌బుక్ రుణాలు మాఫీ

భూమి పాస్‌బుక్కుపై అప్పు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు

రేపు రూ. లక్షలోపు మాఫీ.. సాయంత్రం 4 గంటలకు రైతుల ఖాతాల్లో జమ

రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి కూడా వర్తింపు

కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం రేవంత్ స్పష్టీకరణ

- ప్రభుత్వ ప్రాధాన్యతలు అర్థం చేసుకుని పని చేయాలి
- ప్రభుత్వ పథకాలు చివరి లబ్ధిదారు వరకు చేర్చే బాధ్యత మీదే
- మీరు బదిలీ అయితే ప్రజలు కన్నీళ్లు పెట్టుకునేలా పనిచేయాలి
- ధరణి పెండింగ్ దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిష్కరించాలి
- మహిళలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలిప్పించాలి
- పోలీసులు రహదారులపై కనిపించాలి.. డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలి
- రేషన్‌కార్డులకు, ఆరోగ్యశ్రీకి లింకు పెట్టొద్దన్న ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: రైతుల పంట రుణాల మాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టతనిచ్చారు. భూమి పాస్‌బుక్కుపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. కేవలం కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే రైతు రుణ ఖాతాలు 70 లక్షలేనని చెప్పారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి రుణాలు ఉన్నాయని, వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకుని పని చేయాలంటూ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. రెవెన్యూ

మిగతా 2వ పేజీలో ▶

రేషన్‌కార్డు లేకపోయినా మాఫీ

వ్యవసాయ మంత్రి తుమ్మల స్పష్టీకరణ

- రైతుల ఇళ్లకు వెళ్లి అధికారులు అర్హుల ఎంపిక చేపడతారు
- గత ప్రభుత్వ మార్గదర్శకాలనే పాటించాలని నిర్ణయించాం

2లో

నాడు ఒకేసారి అని చెప్పి.. నేడు దశలవారీ చేసి!

- మాఫీపై మాట మార్చిన ప్రభుత్వం
- తదుపరి విడతపై కొరవడిన స్పష్టత
- వానాకాలం సీజన్‌లో కొత్త రుణాలు కష్టమేనన్న అభిప్రాయం

వివరాలు 2లో

'విద్యుత్' కమిషన్ చైర్మన్‌ను మార్చండి

రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

మీడియా సమావేశంలో కమిషన్ చైర్మన్ వ్యాఖ్యలు చేయడంపై అసహనం

ఆయన కేసు మెరిట్స్ జోలికి ఎలా వెళ్తారని సీజేఐ చంద్రచూడ్ ప్రశ్న

- విచారణ పూర్తికాకుండా అలా చేస్తే ఓ వ్యక్తి ఇమేజ్ దెబ్బతింటుందని వ్యాఖ్య
- కమిషన్‌లో మరో న్యాయమూర్తిని నియమించేందుకు అవకాశం ఇస్తున్నామని స్పష్టీకరణ
- కమిషన్ చైర్మన్ మార్పు కోసం సోమవారం పేర్లు ఇస్తామన్న రాష్ట్ర సర్కారు
- ఊహాజనిత కథనాలు వస్తుండటంతోనే మీడియా సమావేశం పెట్టానన్న జస్టిస్ నరసింహారెడ్డి
- కమిషన్ చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై నియమించిన కమిషన్ చైర్మన్‌ను మార్చాలని కాంగ్రెస్ సర్కారును సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చైర్మన్ బహిరంగంగా మీడియాతో ఎలా వ్యాఖ్యలు చేస్తారని అసహనం వ్యక్తం చేసింది. చైర్మన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అభిప్రాయపడింది. దీంతో కమిషన్ చైర్మన్‌ను మారుస్తామని, వచ్చే సోమవారంలోపు కొత్త చైర్మన్ పేరు వెల్లడిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సుప్రీం ధర్మాసనానికి విన్నవించారు. మరోవైపు 'విద్యుత్'పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్‌ను రద్దు చేయాలంటూ తాము పిటిషన్ దాఖలు చేశామని.. కానీ చైర్మన్ మార్చాలంటూ కోర్టు ఆదేశాలు ఇవ్వడం సరికాదని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తరఫు న్యాయవాది అభ్యంతరం

మిగతా 12వ పేజీలో ▶



"మీడియా సమావేశంలో కేసు మెరిట్‌పై కమిషన్ చైర్మన్ వ్యాఖ్యలు చేయకుండా ఉంటే పర్వాలేదు. కానీ కేసు మెరిట్స్‌లోకి వెళ్లారు. విచారణ కమిషన్ నివేదిక ఓ వ్యక్తి ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. అందుకే అభిప్రాయాలు తెలపాలంటూ ముందుగా నోటీసులు ఇస్తారు. నోటీసుల జారీ వరకే చైర్మన్ ప్రెస్‌మీట్ పెట్టి ఉంటే ఓకే. కానీ జరిగినది వేరు.."

– సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్



ట్రంప్ ఉపాధ్యక్ష అభ్యర్థి ఉషా'పతి'

ఆంధ్రా మూలాలున్న అమ్మాయి ఉషా చిలుకూరిని పెళ్లి చేసుకున్న జేమ్స్ డేవిడ్ వాన్స్

దశాబ్దాల కిందటే అమెరికాలో స్థిరపడ్డ ఉష తల్లిదండ్రులు

12లో

◀ అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో జరిగిన రిపబ్లిక్ పార్టీ కన్వెన్షన్‌లో భర్త జేడీ వాన్స్‌తో ఉషా చిలుకూరి

నాటి విమర్శకుడే... నేటి సహచరుడు

- ట్రంప్ రన్నింగ్ మేట్ వాన్స్‌ది ఆసక్తికర ప్రస్థానం
- నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన వైనం

6లో



న్యాయవ్యవస్థ గౌరవం కోసమే వైదొలిగా..

'విద్యుత్' కమిషన్ నుంచి తప్పుకున్న తర్వాత జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి

కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వలేదు.. లేఖ రూపంలోనే అభిప్రాయాలు కోరా

- ఊహాజనిత వార్తలకు అడ్డుకట్ట వేయడానికే ప్రెస్‌మీట్ పెట్టాను
- జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రెస్‌మీట్లు పెట్టడంపై అభ్యంతరాలు ఎందుకు లేవు
- తన నివేదిక పూర్తి దశకు చేరిందని.. సుప్రీంలో కేసు వల్ల ప్రభుత్వానికి ఇవ్వలేదని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు వందలాది కమిషన్లు నియమించాయని.. ఏ కమిషన్ ప్రెస్‌మీట్ పెట్టలేదో చెప్పాలని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం 'విద్యుత్' కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకొన్న అనంతరం ఆయన ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఊహాజనిత వార్తలకు అడ్డుకట్ట వేయడానికే తాను మీడియా సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని చెప్పారు. తాను మీడియా సమావేశం నిర్వహించకుండా ఉంటే బాగుండేదని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడిందన్నారు. ఏదైనా అంశంపై విచారణ అంటేనే బహిరంగ విచారణ అని అర్థమని చెప్పారు. ఈ విషయంపై తాను వాదనలు చేయొచ్చని, కానీ ఒక విశ్రాంత న్యాయమూర్తిగా న్యాయవ్యవస్థ గౌరవం కాపాడాలనే

మిగతా 12వ పేజీలో ▶

ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత



తిహార్ జైలు నుంచి దీన్‌దయాల్ ఆస్పత్రికి తరలించిన అధికారులు

కొంతకాలం నుంచి గైనిక్ సమస్యతో బాధపడుతున్న కవిత

తాజాగా జ్వరంతో ఇబ్బంది.. టెస్టుల అనంతరం జైలుకు తరలింపు 12లో

ప్రాణహిత-చేవెళ్లను పక్కనపెట్టడం పెద్ద తప్పిదం!

కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ ఆరోపణ



- కొందరి ప్రయోజనాల కోసమే రీ–ఇంజనీరింగ్!
- మేడిగడ్డ బరాజ్ స్థలం ఎంపిక తప్పే
- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పలేదు.. కాళేశ్వరం డిజైన్లు రాష్ట్ర ప్రభుత్వానివే
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ

వివరాలు 12లో

స్పీకర్ వేటు వేయకుంటే సుప్రీంకు..

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

- రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్
- రాష్ట్రంలో ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో?
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతి



స్పీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో కేటీఆర్, కేపీ వివేకానంద్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు ▶

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేయకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడతామని ఢిల్లీలో పోజులు కొడుతున్న కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రంలో మాత్రం దానిని తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో భేటీ అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులపై గగ్గోలు పెడుతున్న రాహుల్ గాంధీ తెలంగాణలో మాత్రం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ మారేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు వెంటనే పదవిని కోల్పోయేలా రాజ్యాంగాన్ని సవరించాలన్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

స్పీకర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారు

కర్ణాటకలో ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేను బీజేపీ రూ.50 కోట్ల చొప్పున కొనుగోలు చేస్తోందని

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు కాంగ్రెస్ కీలక భేటీ

రైతు రుణమాఫీపై పార్టీ పరంగా అనుసరించాల్సిన వైఖరిపై చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేడు కీలక భేటీ నిర్వహించనుంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాభవన్ వేదికగా జరగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు హాజరు కానున్నారు. ఈ మేరకు సమావేశానికి రావాలంటూ గాంధీభవన్ నుంచి నేతలందరికీ సమాచారం పంపారు. ఈ సమావేశంలో రైతు రుణమాఫీపైనే ప్రధానంగా చర్చించనున్నట్టు తెలుస్తోంది. పంద్రాగస్టు లోపు రైతులకు రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్ హామీ అమలు కానున్న నేపథ్యంలో పార్టీ పరంగా అనుసరించాల్సిన వైఖరిపై ఈ సమావేశంలో చర్చిస్తారని, రుణమాఫీ సందర్భంగా రైతుల సమక్షంలో నిర్వహించాల్సిన సంబురాలకు సంబంధించిన కార్యాచరణ గురించి సమావేశం పిలుపునిస్తుందని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. ఇటీవలి రాజకీయ పరిణామాలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, రైతు భరోసా అమలు, విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన కమిషన్ విషయంలో సుప్రీం ఆదేశాల పర్యవసానాలు తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది.

కేంద్రం వద్ద 31 అంశాలు పెండింగ్: చామల కిరణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద 31 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పెండింగ్ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కలిసి మాట్లాడారని వెల్లడించారు. పెండింగ్ అంశాలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని సూచించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, సైనిక్ స్కూల్, నేషనల్ డిజైనింగ్ సెంటర్, వరంగల్, కరీంనగర్ స్మార్ట్ సిటీలు, ఉమ్మడి సంస్థల విభజన తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పెండింగ్ అంశాల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలంతో తెలంగాణకు జీవనాడిగా ఉన్న సింగరేణి సంస్థను చంపే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. 22న ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాలను లోక్‌సభలో కేంద్ర మంత్రులు ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగానే స్పందిస్తున్నా అమలుకు మాత్రం నోచుకోవడం లేదని కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.

ఆ 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవు


బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి జోస్యం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం తథ్యమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరడమే కాకుండా సికింద్రాబాద్ ఎంపీ స్థానం నుంచి ఆ పార్టీ బీఫామ్‌పై పోటీచేసిన నాగేందర్ అసెంబ్లీ సెగ్మెంట్లో 200 శాతం ఉప ఎన్నిక జరుగుతుందన్నారు. పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టులో తుది తీర్పు వెలువడటానికి ముందే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో మూడింట రెండువంతుల మందిని విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు.

రుణమాఫీపై మాకు పాఠాలు చెప్తారా?

ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు రుణమాఫీ చేసే కార్యక్రమాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి చెప్పారు. రుణమాఫీ గురించి బీఆర్‌ఎస్ నేతలు తమకు పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు ఇందిరాశోభన్, బి.లింగంయాదవ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రుణమాఫీ పారదర్శకంగా అమలు జరగాలన్న ఆలోచనతోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో తీసుకొచ్చిందని చెప్పారు. ఈ జీవోలో పేర్కొన్న అంశాల్లో, అమలు విధానంలో ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్టు కూడా జీవోలో పొందుపరిచామని తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావులు కావాలనే ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏకకాలంలో రుణ మాఫీ చేయాలన్న విధానానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

రేషన్‌కార్డు లేకపోయినా రుణమాఫీ

వ్యవసాయ మంత్రి తుమ్మల స్పష్టీకరణ

- కుటుంబాల గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రాతిపదిక
- రేషన్‌కార్డు లేని రుణ ఖాతాలు 6 లక్షలు ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డు లేకపోయినా బ్యాంకుల నుంచి స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రేషన్‌కార్డు కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమేనని చెప్పారు. ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డి 11.50 లక్షల మందికి సంబంధించిన లక్షలోపు రుణాలు దాదాపు రూ.6,800 కోట్లు ఒకేసారి మాఫీ చేస్తారని తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

గత ప్రభుత్వ మార్గదర్శకాలే..

'రుణమాఫీకి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన మార్గదర్శకాలనే పాటించాలని నిర్ణయించాం. కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నారని నిర్ధారించేందుకు రేషన్ కార్డు ఒక్కటే ప్రామాణికం. ఒక కుటుంబంలో ఎంతమంది వ్యవసాయ రుణాలు తీసుకున్నారో గుర్తించేందుకే ఇది తప్పనిసరి. రేషన్‌కార్డులు లేని రుణ ఖాతాలు 6 లక్షల వరకు ఉన్నాయి. ఇలాంటి రైతుల ఇళ్లకు అధికారులు వెళ్లి పరిశీలించిన తర్వాత అర్హులను ఎంపిక చేసి రుణమాఫీ చేస్తారు. రేషన్ కార్డులు లేనివారికి రుణమాఫీ జరగదని చేస్తున్న ప్రచారం తప్పు. రేషన్‌కార్డు లేకున్నా రుణమాఫీ జరుగుతుంది..' అని తుమ్మల వివరణ ఇచ్చారు.

ఆ రుణాలు మాఫీ కావు: 'బ్యాంకుల్లో బంగారంతో పాటు పాస్‌బుక్ తాకట్టుపెట్టి తీసుకున్న స్వల్పకాలిక రుణాలను కూడా మాఫీ చేస్తాం. కానీ కేవలం బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాల మాఫీ కావు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని ఆదాయం పన్ను చెల్లించే బడా వ్యక్తులను గుర్తించేందుకు వినియోగించుకుంటాం. ఆదాయపు పన్ను చెల్లించే వ్యాపారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1,2,3 ఉద్యోగాల్లో ఉన్న అధికారులకు రుణమాఫీ ఉండదు. నెలకు లక్ష రూపాయలకు పైన వేతనం పొందేవారికి రుణమాఫీ వర్తించదు. ఇలాంటివి 17 వేల అకౌంట్లను గుర్తించాం. మహిళా గ్రూపు అప్పులకు మాఫీ వర్తించదు'అని మంత్రి చెప్పారు.

రీషెడ్యూల్డ్ రుణాలు కూడా ..

'గత ప్రభుత్వంలో తొలి విడత లక్ష రూపాయల రుణమాఫీని నాలుగు విడతల్లో చేశారు. రెండో విడత ప్రభుత్వంలో ఎన్నికల ముందు సగం మందికే మాఫీ చేశారు. వివిధ కారణాల వల్ల రూ.1,400 కోట్లు రైతుల ఖాతాల్లో పడకుండా వెనక్కు వచ్చాయి. రుణమాఫీ కాని రైతులు బ్యాంకుల్లోని తమ అప్పును రీషెడ్యూల్ చేసుకున్నారు. ఇలాంటి వారు కూడా ఈసారి రుణమాఫీ పొందనున్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది రుణం తీసుకున్నా రూ.2 లక్షల వరకు మాఫీ అవుతాయి. రూ. 2 లక్షల కన్నా ఎక్కువ రుణాలు పొందితే కేవలం రూ.2 లక్షలు మాత్రమే మాఫీ అవుతుంది. అందులో మహిళలకు తొలి ప్రాధాన్యతనిస్తాం. రాష్ట్రంలో 39 లక్షల కుటుంబాలకు సంబంధించి 60 లక్షల రుణ ఖాతాలు ఉన్నాయి..'అని తుమ్మల తెలిపారు.

పాస్‌బుక్ రుణాలు మాఫీ

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. 9 గంటలకు పైగా సాగిన సుదీర్ఘ సమావేశానంతరం సీఎం మాట్లాడారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు భట్టి, సీతక్క, తుమ్మల, జూపల్లి, దామోదర, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి తదితరులు

ప్రభుత్వ నిధులు రుణమాఫీకే వాడాలి

'18వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలి. రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలి. వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించొద్దని సూచించాలి. గతంలో కొందరు బ్యాంకర్లు అలా చేస్తే కేంద్రం చర్యలు తీసుకుంది. ఇప్పుడు మేం కూడా అలాగే చేస్తాం. రుణమాఫీ జరిగే రైతులను 18వ తేదీ రైతు వేదికల వద్దకు తీసుకురావాలి. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధ్యులు రైతులతో ఆ సంతోషాన్ని పంచుకోవాలి. రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒక ఉన్నతాధికారి చొప్పున అందుబాటులో ఉంచుతాం. కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రభుత్వానికి కళ్లు, చెవులు కలెక్టర్లు, ఎస్పీలే

'ప్రభుత్వానికి కళ్లు, చెవులు .. కలెక్టర్లు, ఎస్పీలే. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు, సారథులు మీరే. ఐఏఎస్‌ల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే కీలకం. కలెక్టర్లుగా ఉన్నప్పుడే అన్ని అంశాలపై అవగాహన వస్తుంది. ప్రతి పథకం చివరి లబ్ధిదారు వరకు చేరవేసే బాధ్యత మీదే. ఇటీవల రాష్ట్రంలో కొందరు టీచర్లు బదిలీపై వెళుతున్నప్పుడు విద్యార్థులు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు చూశా. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా మీ పనితీరు ఉండాలి. ఇక్కడి భాషతో పాటు సంస్కృతిలో కూడా కలెక్టర్లు మమేకం కావాలి. మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. కలెక్టర్లు ఏసీ గదులకే పరిమితమైతే పనిలో సంతృప్తి ఉండదు. ఒక శంకరన్, ఒక శ్రీధరన్ లాగా సామాన్య ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా పనిచేయాలి. కలెక్టర్లందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను పర్యవేక్షించే బాధ్యతలు తీసుకోవాలి. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడి చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి.

10 మంది చేసిన పని 33 మంది చేయలేరా?

గతంలో ఉమ్మడి జిల్లాలను 10 మంది కలెక్టర్లే అద్భుతంగా నడిపించారు. ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గింది. కానీ అధికారాలు, బాధ్యతల్లో తేడా లేదు. అప్పుడు 10 మంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది చేయలేరా? పనితీరుతో సమర్థతను చాటుకోవాలి. ప్రజల్లో విశ్వాసం కల్పించే బాధ్యత కలెక్టర్లదే. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత మీదే..' అని రేవంత్ చెప్పారు.

ధరణి దరఖాస్తు తిరస్కరిస్తే కారణం చెప్పాలి

'పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. కొత్తగా 1,15,308 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిష్కరించండి. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను చెప్పాలి. మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుంది. ప్రస్తుతం ఈ సంఘాల్లో ఉన్న 64 లక్షల మంది సభ్యులను కోటి మందిని చేసేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. ఐదేళ్లలో లక్ష కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలిప్పించే లక్ష్యంతో పనిచేయాలి. ఆర్టీసీ అద్దె బస్సులను కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి. అవసరాన్ని బట్టి జియో ట్యాగింగ్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి నిఘా ఉంచాలి..' అని సీఎం సూచించారు.

ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

'రేషన్‌కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి. ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్ ఇచ్చే అంశాన్ని పరిశీలించండి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ప్రతి బెడ్‌కు సీరియల్ నంబర్ ఇవ్వాలి. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల నిర్వహణపై దృష్టి సారించాలి.

మీ ముద్ర ఉండాలి..

జిల్లాల్లో ఉన్న వనరులు, అక్కడి పరిస్థితుల ఆధారంగా ప్రతి కలెక్టర్ ఒక ఫ్లాగ్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేయాలి. ఆయా కార్యక్రమాలపై కలెక్టర్ల ముద్ర స్పష్టంగా ఉండాలి. గిరిజనులకు పండ్ల మొక్కలతో ఆదాయం వచ్చేలా చేయాలి. అటవీ ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ ఖాళీగా ఉన్న భూమిని డ్రోన్ల ద్వారా సర్వే చేయించాలి. వికారాబాద్ అటవీ ప్రాంతంలో గతంలో మాదిరి ఔషధ మొక్కలు నాటాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లు ఒకేచోట ఉండేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం ప్రతి నియోజకవర్గంలో 20–25 ఎకరాల భూమి ఎంపిక చేయాలి. రహదారుల పక్కనే ఉండే గ్రామాలు, పట్టణాల్లో ఎవరు ముందు స్థలాలు ఎంపిక చేస్తే వారికే నిధులిస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

'రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు రాజీపడొద్దు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే కానీ నేరస్తులతో కాదు. పబ్బుల విషయంలో టైమింగ్ పెట్టండి. స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి. ఐటీ రంగ ఉద్యోగులు రాత్రివేళల్లో పనిచేస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోండి. పోలీసులు రహదారులపై కనిపించాలి. క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలి. తనిఖీలు చేపట్టాలి. డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపండి. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న విదేశీయులపై దృష్టి సారించండి. కొల్లాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో అవసరమైతే ప్రత్యేక బృందం వేయాలి..' అని సీఎం ఆదేశించారు.

'కల్తీ'పై కఠినంగా వ్యవహరించాలి: తుమ్మల


వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రానికి ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని, సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కలెక్టర్లు జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారితో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వంలోని అన్ని శాఖల అధిపతులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పథకాలు కిందివరకు వెళ్లడం లేదు: డిప్యూటీ సీఎం

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య కలెక్టర్లు వారధి లాంటివారని అన్నారు. కొత్త ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు సంక్షేమ పథకాలు కొన్ని జిల్లాల్లో కింది స్థాయి వరకు వెళ్లడం లేదన్నారు. ఇటీవల రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఇది తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు అర్హులందరికీ అవి అందేలా చూడాలని ఆదేశించారు.

అవి రైతుల పాలిట ఉరితాళ్లు

- రైతు రుణమాఫీ నిబంధనలపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి విధించిన షరతులు రైతుల పాలిట ఉరితాళ్లుగా బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అభివర్ణించారు. ఈ నిబంధనలు రైతాంగాన్ని వంచనకు, మోసానికి గురిచేసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల శాపనార్థాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగలడం ఖాయమన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గతంలో షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మాదిరిగా రేవంత్ రెడ్డి కూడా అద్దాల మేడలో కూర్చొని, తనకు ఐదేళ్లపాటు అధికారం ఇచ్చారనే అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రూ.34 వేల కోట్ల రైతుల రుణమాఫీని బేషరతుగా చేస్తామన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు నిబంధనల పేరుతో హల్లికి హల్లి సున్నకు సున్నా అన్నట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అతి తక్కువ కాలంలో ప్రజాక్షేత్రంలో రేవంత్ ప్రభుత్వం నమ్మకం కోల్పోయిందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై సీఎం రేవంత్‌కు ఉన్న ధ్యాస రైతు రుణమాఫీ, రూ.500 బోనస్, ఆడబిడ్డలకు రూ.2500, రూ.4వేల పెన్షన్, ఉద్యోగ నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, కాలేజీ పిల్లలకు స్కూటీలు.. వంటి హామీలను అమలు చేయడంపై లేదన్నారు. ఫిరాయింపుల పర్వం చూస్తుంటే కేసీఆర్ జుట్టు నుంచి రేవంత్‌రెడ్డి పుట్టినట్టు ఉందని ఎద్దేవాచేశారు.

రేవంత్‌రెడ్డి చదువుకున్నారా? లేదా?

'తెల్లరేషన్ కార్డు ఎవరికి ఇస్తారు. రేవంత్‌రెడ్డి చదువుకున్నాడా? లేదా? మూడున్నర ఎకరాల తరిపొలం, ఏడు ఎకరాల కుష్కి పొలం ఉన్నవారికి మాత్రమే తెల్లరేషన్ కార్డు వస్తుంది. తెల్ల రేషన్ కార్డులు ఇవ్వక పదేళ్లు అవుతుంది. మీరు వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఒక్క కార్డు ఇవ్వలేదు. రేషన్ కార్డు పేరుతో సగం మందికి, ఆదాయపన్ను పేరుతో 20%మందికి, రీ షెడ్యూల్ పేరుతో ఇంకొంత మందికి రుణమాఫీ ఎగ్గొడుతున్నారు. పొమ్మనక పొగబెట్టడం, ఎగబెట్టుడు తప్ప ఇంకొకటి లేదు' అని ఈటల ధ్వజమెత్తారు.

బ్యాంకులకు లేని షరతులు ప్రభుత్వానికెందుకు?

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రైతులకు బ్యాంకులు పాస్ పుస్తకాలు చూసి రుణాలు ఇచ్చాయే తప్ప రేషన్ కార్డులు చూసి కాదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ మార్గదర్శకాలపై మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, వివేకానంద, చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి అసెంబ్లీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు కుటుంబానికి ఒక్కరికే రుణమాఫీ అని, రేషన్ కార్డు ఉన్న వాళ్లకే అని రేవంత్‌రెడ్డి చెప్పలేదని గుర్తుచేశారు. ఎన్నికల ముందు అందరూ బ్యాంకుకు వెళ్లి రుణాలు తెచ్చుకోమని ఎగదోసి, ఇప్పుడు కొందరికే రుణమాఫీ చేస్తానని చెప్పడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. రుణాలిచ్చిన బ్యాంకులకు లేని షరతులు ప్రభుత్వానికి ఎందుకని, రుణమాఫీ గైడ్ లైన్స్ గోల్డ్ లోన్ ఇచ్చే వాటి కంటే దారుణంగా ఉన్నాయన్నారు. రేషన్ కార్డు షరతు తొలగించి, రుణాలు తెచ్చుకున్న వారందరికి రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న సబితారెడ్డి. చిత్రంలో సునీతా లక్ష్మారెడ్డి, కేటీఆర్, పద్మారావుగౌడ్ తదితరులు

ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు

- రేవంత్‌పై ఓడిన అభ్యర్థిని వేదిక మీద కూర్చోబెడతారా?
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో తమపై ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులకు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో భేటీ తర్వాత అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరునెలలుగా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ తనపై పోటీచేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా బీఆర్‌ఎస్ తరపున ఓడిన అభ్యర్థులను వేదిక మీదకు పిలవాలన్నారు. సీఎం రేవంత్ కూడా కొడంగల్‌లో ఓడిన బీఆర్‌ఎస్ అభ్యర్థిని వేదిక మీద కూర్చోబెట్టాలని చెప్పారు. హుజూరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, ఆసిఫాబాద్, మహేశ్వరం తదితర నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై పోలీసులు కేసులు పెడుతున్నారని సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

ఎర్రబుగ్గలు వేసుకొని తిరుగుతున్నారు: సునీతా లక్ష్మారెడ్డి

ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులను అతిథులుగా పిలుస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు వాహనాలపై ఎర్రబుగ్గలు వేసుకొని తిరుగుతున్నారని, స్పీకర్‌కు తెలియకుండా ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు.

అసెంబ్లీకి కూడా అనుమతించండి : పద్మారావుగౌడ్

తమపై ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను ప్రభుత్వ కార్యక్రమాలకు అనుమతి ఇస్తున్నారని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను కూడా శాసనసభకు అనుమతించాలని స్పీకర్‌కు సూచించానని చెప్పారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు ఇలాగే కొనసాగితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

స్పీకర్ వేటు వేయకుంటే సుప్రీంకు..

▶ మొదటి పేజీ తరువాయి

అక్కడి సీఎం సిద్దరామయ్య ఆరోపించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో చూడాల్సిందిగా అసెంబ్లీ స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు. హరియాణా, హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఫిర్యాదు మేరకు అక్కడి స్పీకర్లు అనర్హత వేటు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర స్పీకర్‌ను ప్రభుత్వంతో పాటు కొందరు అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకున్నా ఎలాంటి కళంకం రాదంటూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారని, వారికి ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బెదిరింపులు

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారకుంటే ప్రాణహాని పేరిట బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను డీఎస్పీ స్థాయి అధికారులు బెదిరించారని చెప్పారు. బీజేపీని వాషింగ్ మెషీన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ తెలంగాణలో అదే పని చేస్తోందన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆస్తులు, భవనాలపై ప్రభుత్వ సంస్థలతో దాడులు చేయిస్తోందని చెప్పారు. మరికొందరు ఎమ్మెల్యేల వ్యాపారాలపై విజిలెన్స్ విభాగాన్ని, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారిపై జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టౌన్ ప్లానింగ్ విభాగాలను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు.

స్పీకర్‌తో భేటీ

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ మేరకు వేర్వేరుగా లేఖలు అందజేసింది. కేటీఆర్ నేతృత్వంలో 14 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు వీరిలో ఉన్నారు. కాగా నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు.

కొత్త జడ్జి వచ్చి కేసీఆర్ అవినీతి బయటకు తీస్తారు

సుప్రీంకోర్టు సాంకేతిక కారణాలతోనే జడ్జిని మార్చమని చెప్పింది: మధుయాష్కీ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కొనుగోళ్ల విచారణ కమిషన్ విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయాలను బీఆర్‌ఎస్ నేతలు పూర్తిగా తెలుసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ హితవు పలికారు. కొన్ని సాంకేతిక కారణాలతో జడ్జిని మార్చి కొత్త జడ్జితో విచారణ జరిపించాలని మాత్రమే సుప్రీంకోర్టు చెప్పిందని మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. దీని గురించి బీఆర్‌ఎస్ భుజాలు తడుముకోవాల్సిన అవసరం లేదని, నిజంగా విద్యుత్ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడకుండా ఉంటే విచారణ కమిషన్ ముందు హాజరై నిజం చెప్పాలని సూచించారు. విచారణపై కల్వకుంట్ల కుటుంబంలో కలవరపాటు ఎందుకని ప్రశ్నించారు. పదేళ్లలో రూ.80 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, కేటీఆర్, హరీశ్‌రావులు రూ.138 కోట్ల కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు విచారణను అడ్డుకోవాలని కేసీఆర్ చూశారని, అయితే, సుప్రీంకోర్టు మాత్రం కేసీఆర్ అవినీతిపై విచారణను అడ్డుకోలేదని మధుయాష్కీ చెప్పారు.

నాపై ఓడిపోయిన వ్యక్తితో శంకుస్థాపనలు చేయించలేదా?

ప్రొటోకాల్ గురించి కేటీఆర్, హరీశ్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి పాఠాలు చెప్పే వయసు కేటీఆర్, హరీశ్‌రావులకు లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి అన్నారు. ప్రొటోకాల్ గురించి బీఆర్‌ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని హితవు పలికారు. 2019లో తాను సంగారెడ్డి ఎమ్మెల్యేనని, అప్పుడు తనపై ఓడిపోయిన వ్యక్తితో శంకుస్థాపనలు చేయించినప్పుడు వారికి ప్రొటోకాల్ గుర్తు రాలేదా అని నిలదీశారు. నాడు చిలిపి చేష్టలు చేసి ఇప్పుడు వగలాడి మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ సీనియర్ నేత అల్లం భాస్కర్, అధికార ప్రతినిధులు బి.లింగం యాదవ్, భవానిరెడ్డి, పద్మలతో కలిసి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులు, పార్టీలకు కూడా ప్రొటోకాల్ ఇచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ నేతలు ప్రొటోకాల్ పాటించారా అని ప్రశ్నించారు.

ఒకేసారి అన్నారు.. ఇప్పుడు దశలవారీ!

- రుణమాఫీపై మాట మార్చిన ప్రభుత్వం
- రేపు మొదటి విడత లక్ష లోపు రుణాల మాఫీ
- తదుపరి విడతపై కొరవడిన స్పష్టత
- వానాకాలం సీజన్‌లో కొత్త రుణాలు కష్టమేనన్న అభిప్రాయం



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ సొమ్మును ఒకేసారి రైతుల ఖాతాల్లో వేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చింది. దశలవారీగా జమ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈనెల 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల లోపు రుణాలున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రకటించింది. కానీ తదుపరి విడత ఎప్పుడు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. దశలవారీగా రుణమాఫీ చేయడం వలన ఇతర రైతులు ఆ సొమ్ము కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాదు కీలకమైన వానాకాలం సీజన్లో రైతులు కొత్తగా బ్యాంకు రుణాలు తీసుకోవడానికి కష్టం అవుతుందని అంటున్నారు. ఒకేసారి రుణమాఫీ చేస్తే కొత్త రుణాలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది.

లక్షకు పైన ఉంటే ఎదురుచూపులే..!

రుణమాఫీని గతంలో మాదిరిగా కాకుండా ఈసారి మరో పద్ధతిలో చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు ఒక రైతుకు లక్షన్నర రూపాయల రుణం ఉంటే... 18వ తేదీన ఆ రైతుకు లక్ష వరకు మాఫీ చేయరు. కేవలం లక్ష రూపాయలలోపు ఉన్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తారు. అంటే లక్షకు పైగా రుణాలున్నవారు ఆ తర్వాత ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం ఎదురుచూడాల్సిందేనన్న మాట. గతంలో రుణం ఎంతున్నా ప్రభుత్వం నిర్ధారించిన మేరకు అందరికీ రుణమాఫీ జరిగేది. గత ప్రభుత్వం లక్షరూపాయల లోపు రుణాలు మాఫీ చేసిన సంగతి తెలిసిందే. ఆ డేటా ఆధారంగానే ఈసారి 18వ తేదీన రైతులకు రుణమాఫీ చేస్తారని అంటున్నారు. మరోవైపు రేషన్ కార్డు వెరిఫికేషన్, పీఎం కిసాన్ నిబంధన ప్రకారం అనర్హులను 18వ తేదీ రుణమాఫీ సందర్భంగా ఎలా గుర్తిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. గురువారం ఒక్క రోజులోనే లక్ష లోపు రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుంది. కాబట్టి బుధవారం సెలవు అయినప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే బ్యాంకర్లు కూడా పూర్తిస్థాయిలో పని చేయాల్సి ఉంటుంది.

2,640



ఇంజనీరింగ్‌లో పెరిగిన సీట్లు..

పెరిగిన సీట్లన్నీ కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లోనే..

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సీట్ల తగ్గింపునకు సర్కారు విముఖత

అందుబాటులో మొత్తం 1,01,661 సీట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో సీట్లు మరో 2,640 పెరిగాయి. ఇవన్నీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఏఐఎంఎల్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచీలకు సంబంధించినవే కావడం గమనార్హం. కాగా కొత్త వాటితో కలుపుకొని మొత్తం 1,01,661 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో 72,741 సీట్లు కన్వీనర్ కోటా కింద ఉంటాయి. వాస్తవానికి కొత్తగా 20 వేల సీట్ల పెంపునకు కాలేజీలు దరఖాస్తు చేశాయి. అయితే ఇంత పెద్ద సంఖ్యలో సీట్లు పెంచడాన్ని అధికారులు వ్యతిరేకించారు. అన్ని సదుపాయాలు, ఫ్యాకల్టీ ఉన్న 20 కాలేజీల్లో కూడా ప్రతీ బ్రాంచిలో 120 సీట్లకు మించి పెంచడం సరికాదని ప్రభుత్వానికి సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేవలం 2,640 సీట్లకు మాత్రమే అనుమతి తెలిపింది. సీట్ల పెరుగుదల నేపథ్యంలో ఈ నెల 17 వరకు ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించినట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన తెలిపారు. ఇప్పటివరకు 95,383 మంది ఆప్షన్లు ఇచ్చారని వెల్లడించారు.

మరో 4 వేల సీట్లకు చాన్స్..

కొత్త కంప్యూటర్ కోర్సులు వచ్చిన నేపథ్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) వంటి బ్రాంచీలకు ఆదరణ తగ్గింది. దీంతో ఈ కోర్సుల స్థానంలో సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సులకు అనుమతించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదే జరిగితే మరో 4 వేల సీట్లు వచ్చే అవకాశం ఉంది. మరో విడత కౌన్సెలింగ్‌కు ఈ సీట్లు అందుబాటులోకి వచ్చే వీలుంది. కాగా ఈ ఏడాది సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీలు రద్దు చేయాలని పలు కాలేజీలు దరఖాస్తు పెట్టుకున్నాయి. ఈ సీట్లు 3 వేల వరకూ ఉన్నాయి. అయితే యూనివర్సిటీలు గుర్తించిన సీట్లు మాత్రం 1,770 సీట్లు మాత్రమే. వీటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీట్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం విముఖతతో ఉంది. సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ నాన్ కోర్ గ్రూపులు కలిపి 48 వేల కన్వీనర్ కోటా సీట్లుండగా, మెకానికల్‌లో 2,979, సివిల్‌లో 3,132, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 4,202 సీట్లు మాత్రమే ఉన్నాయి. వాస్తవానికి ఈ సీట్లలో కూడా ఏటా 40 శాతం మించి ప్రవేశాలు ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే ఉన్న ఆ కొన్ని సీట్లను తగ్గించేందుకు ప్రభుత్వం అంగీకరించడం లేదు.

కొత్త సీట్లపై తర్జనభర్జన..

వాస్తవానికి కొత్త సీట్ల విషయంలో ప్రభుత్వం తర్జనభర్జన పడింది. సీట్లు పెంచడం వల్ల పడే ఆర్థిక భారంపై ఆరా తీసింది. కన్వీనర్ కోటా కింద కేటాయించే ప్రతి సీటుకు రూ.35 వేల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి. 10 వేల లోపు ర్యాంకు వస్తే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం సగటున ఏడాదికి రూ.35 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేశారు. నాలుగేళ్లకు రూ. 100 కోట్ల భారం పడుతుందని లెక్కగట్టారు.

కొత్త మెడికల్ కాలేజీలకు 872 పోస్టులు

కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయబోయే ఎనిమిది మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ జనరల్ ఆస్పత్రుల్లో 872 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలో భర్తీ చేయబోయే ఈ పోస్టులను వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు కాంట్రాక్టు పద్ధతిలో తీసుకుంటారు. జోగుళాంబగద్వాల, నారాయణపేట, ములుగు, నర్సంపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీల్లోని పోస్టులను భర్తీ చేస్తారు. ఒక్కో కాలేజీలో ప్రొఫెసర్ పోస్టులు 25, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 28, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 56 చొప్పున మొత్తం 109 పోస్టులు భర్తీ చేస్తారు. ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1.90 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనం రూ.లక్షన్నర, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం రూ.1.25 లక్షలు ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులు రావాలంటే తక్షణమే పోస్టుల భర్తీ అవసరం. అందుకే ఆగమేఘాల మీద కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ ఢిల్లీ వదలం

జంతర్‌మంతర్ వద్ద నిరుద్యోగ జేఏసీ నేతల దీక్ష


జంతర్ మంతర్ వద్ద నిరుద్యోగ నేతల ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను, నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించే వరకూ తాము ఢిల్లీ వదిలి వెళ్లేది లేదని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ తెలిపారు. హైదరాబాద్ వేదికగా ఎన్ని ఉద్యమాలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే ఢిల్లీకి రావాల్సి వచ్చిందని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరుద్యోగ జేఏసీ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మోతీలాల్ మాట్లాడుతూ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా వారిపై లాఠీచార్జీలు చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

'టీ-శాట్ నెట్‌వర్క్ సేవలను పునరుద్ధరించాలి'

సాక్షి, హైదరాబాద్: టీ-శాట్ నెట్‌వర్క్ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని 'ఎక్స్'వేదికగా మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాల్సిన టీ-శాట్ చానళ్లు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూగపోయాయని, దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

త్యాగనిరతికి మొహర్రం ప్రతీక: సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: త్యాగనిరతికి, అనిర్వచనీయ సహనానికి మొహర్రం పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి సంస్మరణగా జరుపుకునే ఈ పండుగ సందర్భంగా తరతరాలుగా తెలంగాణ గ్రామాల్లో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపు చేస్తారని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన గుర్తు చేశారు. మొహర్రం పర్వదినం త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

కొత్త జీపీలకు శాఖలు

ఉత్తర్వులు జారీ చేసిన ఏజీ



సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు ఇటీవల కొత్తగా నియమించిన 19 మంది ప్రభుత్వ న్యాయవాదులకు శాఖలను కేటాయిస్తూ, పాత వారి శాఖల్లో మార్పులు చేస్తూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఉత్త ర్వులు జారీ చేశారు. కొత్తగా నియమితులైన వారితో కలిసి మొత్తం ప్రభుత్వ న్యాయవాదుల సంఖ్య 30కి చేరింది. వీరితో పాటు అదనంగా ఇద్దరు ఏఏజీలు, ఐదుగురు స్పెషల్ జీపీలు నియమితులయ్యారు. కొత్త జీపీలు రావడంతో పాత వారి వద్ద నుంచి కొన్ని శాఖలను తొలగించారు. అలాగే ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వని శాఖలను కొత్త జీపీలకు కేటాయించారు. కొత్త జీపీల నియామకంతో ఆయా శాఖలకు సంబంధించిన కేసుల విచారణలు వేగవంతం కానున్నాయి.

నిరుద్యోగ సమస్యపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్: గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగుల డిమాండ్‌లను గుర్తించి వాటిని పరిష్కరించడానికి అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఈ మేరకు లేఖ రాశారు. నిరుద్యోగుల ఉద్యమాలపై నిర్బంధం సరికాద ని నిరుద్యోగులపై లాఠీచార్జ్, అణచివేతను తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగ జేఏసీ అధ్య క్షుడు నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవా రం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సమావే శమై ప్రభుత్వానికి పలు డిమాండ్‌లు చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 1:100 పిలవాల ని, గ్రూప్-1లో 563 నుంచి 1600 పోస్టులను పెంచాలని, గ్రూప్-2లో 780 నుంచి రెండు వేల పోస్టులకు పెంచాలని, గ్రూప్-3లో 1100 నుంచి మూడు వేల పోస్టులకు పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ రెండు నెలలు వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు వేముల రామకృష్ణ, మోడీరాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో 'డిస్ లొకేటెడ్' లొల్లి!


డీఎస్ఎస్ భవన్ వద్ద గురుకుల ఉపాధ్యాయులు

- జీఓ 317 అమల్లో భాగంగా ఉద్యోగుల కేటాయింపులు
- సాధారణ బదిలీలతోపాటు డిస్‌లొకేటెడ్ ఉద్యోగులకూ ట్రాన్స్‌ఫర్
- జాబితాపై ఉద్యోగుల అభ్యంతరం
- దీంతో బదిలీల ప్రక్రియకు బ్రేకులు
- ఇప్పటికే ప్రకటించిన ట్రాన్స్‌ఫర్ షెడ్యూల్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ (టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ ఈఐఎస్) పరిధిలో జరుగుతున్న ఉద్యోగుల బదిలీలు.. పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈ సొసైటీ పరిధిలోని పలు కేడర్‌లలోని ఉద్యోగులకు ఓవైపు పదోన్న తులు కల్పిస్తూనే.. మరోవైపు బదిలీల ప్రక్రియ నిర్వహించేలా సొసైటీ కార్యాచరణ రూపొందించి అమలుకు ఉపక్రమించింది. ఈ క్రమంలో బదిలీలు, పదోన్నతులకు అర్హత పొందిన ఉద్యోగుల జాబి తాను ప్రకటించారు. జీఓ 317 అమలులో భాగంగా పలు వురు ఉద్యోగులను వారు పని చేస్తున్న పరిధిని డిస్‌లొకేట్ చేస్తూ కొత్తగా జోన్‌లు, మల్టీజోన్‌లు కేటాయిస్తూ జాబితా విడుదల చేసింది. డిస్‌లొకేటెడ్ జాబితాలో ఉన్న ఉద్యోగులు తక్షణమే బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరుకావా లని, లేకుంటే ఖాళీ ల లభ్యతను బట్టి పోస్టింగ్ ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో డిస్‌లొకేటెడ్ జాబితాలో ఉన్న ఉద్యోగులు సొసైటీ కార్యాయానికి చేరుకోవడం.. వారిని డిస్‌లొకేటెడ్ జాబితా లోకి తీసుకురావడంపై ఆందోళనకు దిగడంతో అక్కడ తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. సోమవారం నుంచి మొదలైన ఈ పరిస్థితి మంగళవారం కూడా కొనసాగడంతో డీఎస్ఎస్ భవన్ గురుకుల టీచర్లతో కిక్కిరిసిపోయింది.

తారుమారుపై గరంగరం..

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి రావడంతో ఆ దిశగా అన్ని ప్రభుత్వ శాఖలు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ చేపట్టాయి. గురుకుల సొసైటీలు కూడా ఆ దిశగా కసరత్తు చేసి 2022 సంవత్సరంలో ఉద్యోగులకు జోన్‌లు, మల్టీ జోన్‌ల కేటాయింపు చేపట్టాయి. కానీ విద్యాసంవత్సరం మధ్యలో బోధన, అభ్యసన కార్య క్రమాలకు ఇబ్బందులు తలెత్తు తాయనే భావనతో కేటాయింపుల ప్రక్రియను తాత్కాలికంగా పక్కన పెట్టాయి. ప్రస్తుతం గురుకులాలకు కొత్త ఉద్యోగులు వస్తుండడంతో సీనియర్ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు చేపడుతుండగా... జీఓ 317 కింద డిస్ లొకేటెడ్ అయిన ఉద్యోగులకు కూడా బదిలీలు చేపట్టేందుకు సొసైటీ చర్యలు మొదలుపెట్టింది. కానీ డిస్‌లొకేటెడ్ జాబితాలో ఉన్న ఉద్యోగులు తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఉద్యోగుల కేటాయింపు సమయంలో తామిచ్చిన ఆప్షన్లకు భిన్నంగా తాజాగా కేటాయింపులు జరిపారని, మరోవైపు సంబంధం లేని జోన్లు ఇవ్వడంతో తమతోపాటు పిల్లల భవిష్యత్ తారు మారు అవుతుందని ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వారికి మినహాయింపు ఇచ్చిన సొసైటీ మిగతా ఉద్యోగులకు స్థానచలనం కల్పించింది. ప్రిన్స్‌పాల్, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ కేటగిరీలో దాదాపు పదోన్నతులు పూర్తి కాగా, ఆయా కేటగిరీల్లో బదిలీలు సైతం దాదాపు పూర్తి చేసినట్టు టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ అధికారులు చెబుతున్నారు.

మూడు రోజుల్లో మిగతా కేటగిరీల్లో

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో ప్రిన్సిపాల్, జేఎల్, పీజీటీ కేటగిరీల్లో మెజారిటీ శాతం బది లీలు పూర్తి చేసిన సొసైటీ... టీజీటీ, లైబ్రేరియన్, డిగ్రీ కాలేజీ టీచింగ్ స్టాఫ్‌తోపాటు సొసైటీ పరిధిలోని నాన్ టీచింగ్ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాల్సి ఉంది. బదిలీల ప్రక్రియ ఈనెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. కానీ ఆలోపు అన్ని కేట గిరీల్లో బదిలీల ప్రక్రియ పూర్తవుతుందా అన్న సందేహం అధికారుల్లో నెలకొంది. ఎక్కువ కేటగిరీలు ఉండడంతో రాత్రింబవళ్లు పూర్తి చేసేందుకు సైతం అధికారులు సిద్ధమవుతున్నారు. గతవారం రోజులుగా పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి పొద్దు పోయేవరకు కూడా సొసైటీ అధికారులు బదిలీలు, పదోన్నతుల కసరత్తు సాగిస్తుండడం గమనార్హం.

మర్యాదతో మన్నన పొందండి

- ఆకస్మిక తనిఖీలు చేయండి.. త్వరలో నేనూ జిల్లాల్లో పర్యటిస్తా
- పోలీస్ ఉన్నతాధికారుల సమావేశంలో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: పోలీస్‌స్టేషన్లలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని డీజీపీ జితేందర్ పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. పోలీసు కమిషనర్లు, ఎస్పీలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీల చేయాలని, తాను సైతం త్వరలోనే జిల్లాల వారీగా తనిఖీలు చేపడతానని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ జితేందర్ పోలీస్ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రంలోని అన్నియూనిట్ల ఉన్నతాధికారు లతో నిర్వ హించిన ఈ సమీక్షలో జితేందర్ పలు కీలక సూచనలు ఇచ్చారు. ప్రజావాణి దరఖాస్తుల్లోని ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన డీజీపీ, అవసరమైతే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. ఆయుధాల లైసెన్స్‌ల జారీపై జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, అదనపు డీజీలు శిఖా గోయెల్, అభిలాష బిస్త్, వీవీ శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్‌బాబుతో పాటు జోనల్ ఐజీలు, జిల్లా ఎస్పీలు పాల్గొన్నారు.



రూ.300 కోట్లతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

ఐఎస్ఎఫ్, స్టార్టప్ రన్‌వే సంస్థల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యయంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రపంచంలోని పది ప్రఖ్యాత యూనివర్సిటీలు ముందుకొచ్చినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా 25 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్), టెక్సాస్ కేంద్రంగా ఉన్న 'స్టార్టప్ రన్ వే' సంస్థల ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. అంతర్జాతీయంగా స్టార్టప్‌లను ప్రోత్సహించే ఈ రెండు సంస్థలకు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, యూకేలోని లండన్ బిజినెస్ స్కూల్ లాంటి పది ప్రఖ్యాత స్కిల్ యూనివర్సిటీలతో శిక్షణకు సంబంధించిన ఒప్పందాలున్నాయి. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు 3 రోజులపాటు హైదరాబాద్ నగరంలో జరిగే ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ సదస్సులో ఈ యూనివర్సిటీల ప్రతినిధులు కూడా పాల్గొంటారని శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా ఐఎస్ఎఫ్ చైర్మన్ డా. జె.ఎ.చౌదరి, డైరెక్టర్ శేషాద్రి వంగల ఆధ్వర్యంలో టెక్సాస్ రిచర్డ్ సన్ సిటీ, ఫ్రిస్కో సిటీల ప్రతినిధులు తనను కలిసి తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ'లో సంయుక్తంగా కార్యకలాపాలు చేపట్టడానికి ఆసక్తి వ్యక్తం చేశారని మంత్రి వెల్లడించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ప్రతినిధి బృందంలో టెక్సాస్‌లోని ఫ్రిస్కో నగరం మాజీ మేయర్ మహెర్ మేసో, రిచర్డ్ సన్ సిటీకి చెందిన ప్రతినిధులు క్రిష్ షాక్లెట్, గ్రెగ్ సోవెల్, స్టార్టప్ రన్‌వే వ్యవస్థాపకుడు మహేశ్ నంద్యాల, సీవోవో రవీంద్ర రెడ్డి, చిన్మయ్ దాస్, జ్యోత్స్న కొండపులి, అర్చన చిందం, ఐఎస్ఎఫ్ తరపున వేణుమాధవ్ గొట్టుపుల్ల తదితరులు ఉన్నారు.

'గ్యారెంటీ' గుదిబండ రూ.5,200 కోట్లు

పౌరసరఫరాల సంస్థ, మార్క్‌ఫెడ్ ద్వారా రుణాలకు కూటమి సర్కారు హామీ

ధాన్యం బకాయిలతోపాటు ఖరీఫ్‌లో సేకరణ కోసమే ఈ అప్పులని ప్రకటన



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ గ్యారెంటీతో రూ.5,200 కోట్ల రుణం పొందేందుకు పౌరసరఫరాల సంస్థ, ఏపీ మార్క్‌ఫెడ్‌లకు అనుమతినిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రైతుల మేలు కోసమే అప్పులు చేయాల్సి వస్తోందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గత రబీలో ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపులతో పాటు 2024-25 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ రుణాన్ని వినియోగిస్తామని తెలిపింది. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

అప్పులు మినహా మరో మార్గం లేదు..

రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఇటీవలే రూ.1,000 కోట్లు విడుదల చేశాం. మరో రూ.600 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల చెల్లింపు కోసం వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రూ.2 వేల కోట్ల రుణం పొందేందుకు పౌరసరఫరాల సంస్థను అనుమతిస్తూ గత నెల 28వ తేదీన ప్రభుత్వం జీవో నెం.6 జారీ చేసింది. ఈ రుణం కోసం ప్రభుత్వ హామీ కోరుతూ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2024-25లో ధాన్యం కొనుగోలు కోసం వర్కింగ్ క్యాపిటల్ అసిస్టెన్స్ కింద జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ప్రభుత్వ హామీతో రూ.3,200 కోట్ల కొత్త రుణం కోసం ఏపీ మార్క్‌ఫెడ్‌కు కేబినెట్ అనుమతి ఇచ్చింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లోపాలను సవరించి మెరుగైన విధానం రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు మేలు చేసేందుకు అప్పులు చేయడం మినహా మరో మార్గం లేదు. ఉచిత పంటల బీమా స్థానంలో మెరుగైన పంటల బీమా పథకాన్ని తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఏర్పాటయ్యే కమిటీ నెల రోజుల్లోగా నివేదిక సమర్పిస్తుంది.

మరిన్ని వివరాలు, వార్తలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కౌన్సిల్‌లో బలం లేదు.. నిజమే

"కౌన్సిల్‌లో మాకు బలంలేని మాట వాస్తవమే. అయితే అసెంబ్లీలో చేసిన చట్టాలను కౌన్సిల్ అడ్డగించే అవకాశం లేదు కదా?" అని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కి మద్దతిచ్చిన టీడీపీ ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించగా నాడు విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఎక్కడ ఇచ్చారని ఎదురు ప్రశ్నించారు. హౌసింగ్‌లో అక్రమాలపై విచారణకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సంపద సృష్టి విషయంలో కట్టుబడి ఉన్నామని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాజిటివ్ వైబ్రేషన్ మొదలైందని మంత్రి చెప్పారు. కేవలం నెల రోజుల్లో రాష్ట్రంలో ప్రజల ఆస్తులు, భూముల విలువ గణనీయంగా పెరిగిందన్నారు. భూముల ధరలు కనీసం రూ.ఐదారు లక్షలకు పైగా పెరిగాయన్నారు. ఎయిర్, రైల్ ట్రాఫిక్ 30 శాతం పెరిగిందన్నారు. కాగా ఈ నెల 22 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మంత్రులకు చంద్రబాబు తెలిపారు.





అకుశలమైన ఆరాటాన్ని వదిలెయ్యటం
బౌద్ధ ధర్మాచరణకు కీలకమైనది.
– బుద్ధదాన భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 17 జూలై 2024

అంతులేని అనిశ్చితి!

అయిదేళ్ళలో అయిదో ప్రధానమంత్రి వచ్చారు. పొరుగున నేపాల్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి ఇదే దర్పణం. అనుభవజ్ఞుడైన కమ్యూనిస్టు రాజకీయ నేత ఖడ్గ ప్రసాద్ (కె.పి) శర్మ ఓలీ నూతన ప్రధానిగా సోమవారం ప్రమాణస్వీకారం చేయడంతో... కష్టాల్లో ఉన్న తమ దేశానికి మంచి రోజులు రావచ్చేమో అని నేపాలీయులు ఆశగా చూస్తున్నారు. దేశంలోకి పెట్టుబడులు, దరిమిలా కొత్తగా ఉద్యోగాలొస్తాయని నిరీక్షిస్తున్నారు. అయితే ఓలీకి ఇది కత్తి మీద సామే. 2018లో లాగా ఆయనేమీ శక్తిమంతమైన కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి సారథ్యం వహించట్లేదు. ఇప్పుడాయన సంకీర్ణ ప్రభుత్వ సారథి. పైగా, సంకీర్ణంలో ఆయన పార్టీ మైనారిటీ. అది మరో బలహీనత. సైద్ధాంతికంగా పరస్పర విరుద్ధ భావాలున్న నేపాలీ కాంగ్రెస్ (ఎన్సీ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్–యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్–యూఎంఎల్)లు రెండూ 2027లో ఎన్నికల వరకు ప్రధాని పదవిని సమాన కాలం పంచుకోవాలన్న అవగాహనతో అనైతికంగా జట్టు కట్టాయి. ఇది ఏ మేరకు ఫలిస్తుందో తెలీదు. అది నేపాల్ సమస్యనుకున్నా, చైనా అనుకూల ఓలీ గద్దెనెక్కడం భారత్‌కు ఇబ్బందికరమే!

నేపాల్‌లో 239 ఏళ్ళ రాచరికాన్ని 2008లో రద్దు చేశారు. అదేమి శాపమో రాజరిక వ్యవస్థ రద్దయి రిపబ్లిక్‌గా మారినప్పటి నుంచి దేశం రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటూనే ఉంది. ఇప్పటికి 13 ప్రభుత్వాలు మారాయి. ఏణ్ణర్థ కాలంలో నాలుగుసార్లు సభలో బలపరీక్షను తట్టుకొని బయట పడ్డ ప్రధాని, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ – మావోయిస్ట్ సెంటర్ (సీపీఎన్–ఎంసీ) నేత పుష్ప కమల్ దహల్ ప్రచండ శుక్రవారం జూలై 12న మాత్రం ఓడిపోయారు. అధికార సంకీర్ణ భాగస్వామి అయిన మితవాద సీపీఎన్– యూఎంఎల్ మద్దతు ఉపసంహరణతో ఆయనకు ఓటమి తప్పలేదు. 72 ఏళ్ళ ఓలీ నాయకత్వంలో కొత్త సంకీర్ణ సర్కార్ గద్దెనెక్కింది. ఇప్పుడొచ్చింది 14వ ప్రభుత్వం. ప్రధాని పదవి ఓలీకి కొత్త కాదు. ఆయన పగ్గాలు పట్టడం ఇది నాలుగోసారి. ఏ ప్రభుత్వం వచ్చినా నేపాల్‌లో వెంటాడే పాత సమస్యలు ఓలీకీ తప్పవు. మరో రెండు నెలల్లో పార్లమెంట్‌లో మెజారిటీ నిరూపించుకోవాల్సిన ఆయన పరస్పర విరుద్ధ సిద్ధాంతాలతో నిండిన కూటమితో ప్రభుత్వాన్ని ఎలా నడపగలరో చూడాలి. ప్రచండ ప్రభుత్వాన్ని కూల్చి, కొత్త కూటమి కట్టి దేశంలోని రెండు పెద్ద పార్టీలు ఎన్సీ, యూఎంఎల్ సాహసమే చేశాయి. సుపరిపాలన, రాజకీయ సుస్థిరతలో ఈ సంకీర్ణం విఫలమైతే అది మొత్తం రాజ్యాంగం, వ్యవస్థల వైఫల్యమేనని ప్రజలు భావించే ప్రమాదం ఉంది.

నిజానికి, ప్రపంచంలోని అత్యంత నిరుపేద దేశాల్లో నేపాల్ ఒకటి. రాజకీయ అనిశ్చితి కారణంగా అక్కడ పెట్టుబడులు పెట్టేవారు కరవయ్యారు. ఫలితంగా ఆర్థికాభివృద్ధి కుంటుపడింది. లక్షలాది యువకులు ఉద్యోగం, ఉపాధి నిమిత్తం మలేసియా, దక్షిణ కొరియా, మధ్యప్రాచ్యం దారి పట్టారు. పరిస్థితి ఎంతదాకా వెళ్ళిందంటే, గద్దెనెక్కిన ప్రభుత్వాలేవీ దేశాభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు గనక మళ్ళీ రాచరికాన్నే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జనం అడపాదడపా నిరసన ప్రదర్శనలు కూడా చేశారు. భారత్‌తో పాటు పొరుగున ఉన్న మరో పెద్ద దేశం చైనా సైతం నేపాల్‌లోని రాజకీయ పరిణామాలను ఆది నుంచి ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నాయి. ఈ హిమాలయ దేశాభివృద్ధికి ఆర్థిక సాయం అందించి, ప్రాథమిక వసతి సౌకర్యాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో ప్రాబల్యం సంపాదించాలని సహజంగానే ఢిల్లీ, బీజింగ్‌ల యత్నం.

భౌగోళికంగా భారత, చైనాల మధ్య చిక్కుకుపోయిన నేపాల్‌కు మొదటి నుంచి మనతో స్నేహ సంబంధాలు ఎక్కువే. కానీ గత దశాబ్ద కాలంలో ఆ పరిస్థితి మారుతూ వచ్చింది. కమ్యూనిస్ట్ నేత ఓలీ తొలివిడత నేపాల్ ప్రధానిగా వ్యవహరించినప్పుడు 2015–16లో చైనాతో ప్రయాణ, సరుకు రవాణామార్గ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫలితంగా, నేపాల్ విదేశీ వాణిజ్యంపై అప్పటి దాకా భారత్‌కు ఉన్న ఆధిపత్యానికి తెర పడింది. తాజాగా పడిపోయిన ప్రచండ సర్కార్ సైతం చైనా వైపు మొగ్గింది. నిన్న గాక మొన్న పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనే ముందు ఆయన నేపాల్‌తో చైనాను కలిపే రైలు మార్గానికి పచ్చజెండా ఊపడం గమనార్హం. ఇది అనేక వందల కోట్ల డాలర్లతో డ్రాగన్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్ట్ కింద కొస్తుంది. దీంతో నేపాల్ – చైనా సరిహద్దు వెంట వసతులు పెరుగుతాయని పైకి అంటున్న మాట. నిజానికి సరిహద్దులో చైనాకు పట్టు పెంచే ఈ చర్య భారత్‌కు తలనొప్పి!

అసలు బీఆర్ఐ ప్రాజెక్టుల వెనక చైనా వ్యూహం వేరు. చిన్న చిన్న దేశాలకు పెద్దయెత్తున అప్పులిస్తూ, ఋణ దౌత్యం ద్వారా ఆ యా ప్రాంతాల్లో భౌగోళిక రాజకీయాల్లో పైచేయి సాధించడం డ్రాగన్ ఎత్తుగడ. అందుకే, ప్రపంచ దేశాలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీర్ఘకాలంలో ఈ ప్రాజెక్టులు సంబంధిత చిన్నదేశాలకు భరించలేని భారమవుతాయి. చివరకు ఆ దేశాలు చైనా మాటకు తలూపాల్సి వస్తుంది. గతంలో చైనా ఇలాగే శ్రీలంకలో హంబన్‌తోట పోర్ట్‌కు ఋణమిచ్చింది. బాకీలు తీర్చడంలో విఫలమైన సింహళం చివరకు బాకీకి బదులు ఈక్విటీలిచ్చి, 2017లో ఆ పోర్ట్‌ను 99 ఏళ్ళ లీజుకు చైనాకు అప్పగించింది. ఇలాంటి కారణాల వల్లే బీఆర్ఐ పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలున్నాయి. అలాగే బీఆర్ఐ కింద చైనా–పాక్ ఆర్థిక నడవా ప్రాజెక్ట్ అంటూ పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా దాన్ని చేపట్టడాన్ని భారత్ నిరసించింది. ఇప్పుడు భారత్ కన్నా చైనాకు మరింత సన్నిహితుడైన ఓలీ వల్ల నేపాల్ కూడా చైనా గుప్పిట్లోకి జారిపోవచ్చు. మనం తక్షణమే అప్రమత్తం కావాలి. మనతో సన్నిహిత సంబంధాలు కీలకమని ఓలీ గుర్తించేలా చేయాలి. ఓలీ సంకీర్ణంలో అధిక సంఖ్యాబలమున్న ఎన్సీ చిరకాలంగా భారత అనుకూల పార్టీ కావడం ఉన్నంతలో కొంత ఊరట.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: శు.ఏకాదశి సా.5.54 వరకు
తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** అనూరాధ రా.1.18 వరకు
తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.31 వరకు, **అమృత ఘడియలు:** ప.2.20 నుండి 4.01 వరకు, తొలి ఏకాదశి.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

అధ్యక్షుడిగా ట్రంప్ మళ్లీ గెలిస్తే?

అభిప్రాయం



ప్రశాంత్ రూహ

అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఊహించినట్టుగానే రిపబ్లికన్ పార్టీ తన అధికారిక అధ్యక్ష అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్‌ను ఎంచుకుంది. ఇప్పటికే ట్రంప్‌కు సానుకూల పవనాలు వీస్తుండగా, ఆయన మీద జరిగిన హత్యాయత్నం ఆయన విజయావకాశాలను మరింతగా పెంచేవుంటుంది. అయితే ఇంకోసారి ట్రంప్‌కు అధికార పగ్గాలు చిక్కితే రకరకాలుగా నష్టం జరిగే అవకాశాలు మెండు! ప్రజాస్వామ్యం, వాతావరణ మార్పు అంశాల్లో ట్రంప్ నిర్ణయాలు అమెరికాను బలహీనపరచడమే కాకుండా... భారత దేశానికీ ఆందోళన కలిగించేవే. ట్రంప్ తన పాత వైఖరినే కొనసాగిస్తే చైనా ఆధిపత్యం పెరుగుతుంది. అమెరికా అంతర్గతంగా బలహీనపడితే కూడా లాభపడేది చైనా మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా జరిగిన తొలి ముఖాముఖి చర్చ జో బైడెన్‌కు ఓ దుస్స్వప్నంలా మిగిలిపోయింది. తడబాటు, తత్తరపాటు, మతిమరపులతో బైడెన్‌పై అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగానూ వ్యతిరేకులు పెరిగిపోయారు. బైడెన్ వైఫల్యం కాస్తా ట్రంప్‌కు వరంగా మారిందని చెప్పాలి. అధ్యక్షుడిగా బైడెన్ రికార్డు బాగానే ఉంది. కానీ చర్చ కార్యక్రమం మాత్రం అతడి వయసు, మానసిక ఆరోగ్యంపై అనేక సందేహాలు లేవనెత్తింది. డెమోక్రాట్ల విశ్వసనీయతతోపాటు వైట్‌హౌస్‌పై కూడా నమ్మకం సడలించే వ్యవహారమిది. డెమోక్రాట్లకు ఓటేయాల్సిందిగా మద్దతుదారులు కూడా అడిగేందుకు సందేహించే పరిస్థితి వచ్చింది. బైడెన్ ఇవేవీ పట్టించుకునే పరిస్థితిలో లేరు. పోటీ నుంచి తప్పుకొమ్మని చాలామంది సలహా ఇస్తున్నా... అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధంగా లేరు. పైగా తాను మాత్రమే ట్రంప్‌ను ఓడించగలనని అంటున్నారు.

వాతావరణ మార్పును పట్టించుకోరు!

ఈ నేపథ్యంలోనే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఇంకోసారి ఎన్నికైతే ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానాలు వెతుక్కోవాల్సి వస్తోంది. చాలా రకాలుగా విధ్వంసం జరుగుతుందన్నది కచ్చితం. కాకపోతే భారతదేశం అంటే మనం ఆలోచించాల్సిన అంశాలు ప్రధానంగా రెండు ఉన్నాయి. శతాబ్దాలుగా... ఇప్పుడు కూడా అమెరికా వెలువరించే కర్బన ఉద్గారాలు భారీ స్థాయిలో ఉన్నాయన్నది తెలిసిందే. ఇందుకు బాధ్యత వహించే విషయంలో మాత్రం అగ్రరాజ్యం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు తన వంతు సాయం అందించేందుకు తిరస్కరిస్తోంది. వినియోగదారుల కేంద్రంగా నడిచే ఆర్థిక వ్యవస్థగానే మిగిలిపోయిన అమెరికా విచ్చలవిడి ఖర్చులు, వనరుల వృథాకు ప్రసిద్ధి. కపటత్వం కూడా ఎక్కువే. కోట్లాదిమందిని పేదరికం కోరల నుంచి తప్పించాల్సిన బాధ్యత ఉన్న దేశాలు అభివృద్ధి విషయంలో రాజీపడాల్సిందిగా కోరడం దీనికి నిదర్శనం. చారిత్రక బాధ్యతలను విస్మరించడం, తమ జీవనశైలిని మార్చుకునే ప్రయత్నాలు అస్సలు చేయకపోవడం అమెరికాకు మాత్రమే ప్రత్యేకం.

ఈ విషయమై అటు డెమోక్రాట్లనూ, ఇటు రిపబ్లికన్లనూ ఇద్దరినీ నిందించాల్సిందే. అయితే బైడెన్ గద్దెనెక్కిన తరువాత ప్యారిస్ ఒప్పందానికి ఊ కొట్టడం, వాతావరణ మార్పులకు సంబంధించి చట్టాన్ని ఆమోదించడం, స్థానికంగా కర్బన ఉద్గారాల తగ్గింపునకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. వాతావరణ సంక్షోభ నివారణ యత్నాలకు రుణసాయం ఇచ్చేలా బ్యాంకులను ప్రోత్సహించారు కూడా. ఈ చర్యలన్నీ నామమాత్రంగానైనా తానూ బాధ్యత తీసుకుంటున్న భావన కలిగించాయి. ఒకవేళ ట్రంప్ రెండోసారి పగ్గాలు



చేపడితే ఇవేవీ కొనసాగించడన్నది కచ్చితం. తొలి దఫా గద్దెనెక్కినప్పటి చందంగానే వాతావరణ మార్పులన్నవి అసలు సమస్యే కాదన్నట్టుగా నటిస్తారు.

ట్రంప్ అధ్యక్షుడైతే పాశ్చాత్య దేశాల నుంచి భారత్‌పై వస్తున్న ఒత్తిడి తగ్గుతుందని అనుకునేందుకు బాగానే ఉంటుంది కానీ... అది స్వల్పకాలికం మాత్రమే. వాతావరణ మార్పులనేవి ప్రపంచం మొత్తం సమస్య. ఈ సమస్య ముదిరిపోవడంలో అమెరికా పాత్ర పెద్దది. పరిష్కారం కూడా అమెరికా ప్రమేయంతో మాత్రమే సాధ్యమవుతుంది. ట్రంప్ తన పాత వైఖరినే కొనసాగిస్తే ఈ విషయంలో చైనా ఆధిపత్యం పెరుగుతుంది. వాతావరణ పరిరక్షణకు సంబంధించి టెక్నాలజీల అభివృద్ధిలోనూ ముందుకు దూసుకెళుతుంది. ఫలితంగా ఇప్పటివరకూ వాతావరణ మార్పుల అంశంపై పని చేస్తున్న ప్రపంచ బ్యాంకు వంటి ఆర్థిక సంస్థలు నిర్వీర్యమవుతాయి. అమెరికాకు చెందిన ప్రైవేట్ కంపెనీలు వాతావరణ మార్పులకు సంబంధించి పెట్టుబడులు పెట్టడం నిలిచిపోతుంది. దీనివల్ల వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న దేశాలు నష్టపోవాల్సి వస్తుంది.

వ్యవస్థలు దెబ్బతింటాయి!

రెండో విషయానికి వద్దాం. అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలో బోలెడన్ని లోటుపాట్లు ఉన్నాయి. న్యాయవ్యవస్థను ఉదాహరణగా తీసుకుంటే అక్కడ న్యాయమూర్తులు శాశ్వత ప్రాతిపదికన నియమితులవుతారు. ఫలితంగా వారికి బాధ్యత శూన్యం. పైగా న్యాయమూర్తుల నియామకాలు అధికార వర్గం ద్వారా జరుగుతాయి. ఫలితంగా వీరు పక్షపాతంగా ఉండేందుకూ, తాము నమ్మే భావజాలానికి అనుగుణంగా నడుచుకునేందుకూ అవకాశాలు ఎక్కువ. ఫలితంగా ప్రజాస్వామ్యంలో అతి కీలకమైన ఒక అంగం విపరీతమైన అధికారాలు కలిగి ఉండటమే కాకుండా... సైద్ధాంతిక అంశాలపై విభజితమై ఉంటుంది.

అంతెందుకు అమెరికా ఎన్నికల వ్యవస్థనే తీసుకుంటే... అధ్యక్ష తరహా ఎన్నికల వ్యవస్థ ఉంది. మెజారిటీ ప్రజల అభిప్రాయం, ఫలితాలతో నిమిత్తం లేదు. ఫలితంగా అవినీతిపరుడైన నేత... విరాళాలిచ్చే వారు కుమ్మక్కయ్యే అవకాశం ఉంటుంది. 2020 నాటి ఎన్నికలు ఎంతో మెరుగ్గానే జరిగాయని అనుకున్నా ఆ తరువాత అమెరికాలో సగం మంది ఎన్నికల ప్రక్రియను, అధికార మార్పిడి జరిగిన తీరును తప్పుపట్టడం గమనార్హం.

ఈ సమస్యలకు అమెరికా రాజ్యాంగ నిర్మాణం ఒక కారణమని చెప్పాలి. వ్యవస్థలు అధికారంలో ఎవరున్నారు అన్న అంశం ఆధారంగా ఒడుదొడుకులకు లోను కాకూడదు. ట్రంప్ అమెరికా సుప్రీం కోర్టుకు ముగ్గురు న్యాయమూర్తుల నియామకాలకు ప్రతిపాదించడం ఇప్పటికే మానవ, మహిళ హక్కుల విషయంలో ప్రతికూల పరిస్థితులు తెచ్చి పెట్టాయి. అబార్షన్ విషయంలో అధ్యక్షుడికి తిరుగులేని అధికారాలు దక్కిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ గద్దెనెక్కితే మరింత మంది న్యాయమూర్తులను ఆయన సుప్రీం కోర్టులో నియమించవచ్చు. ఎన్నికల ఫలితాలను సవాలు చేయడం మాత్రమే కాకుండా... నేరం రుజువైనా అధికారంలో కొనసాగేందుకు ప్రయత్నించడం వంటివి ఎక్కువ అవుతాయి. జాతి వివక్ష పెరగడం, క్రిస్టియన్ జాతీయతా భావజాలం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచి చేసే అంశాలు కాదు. ట్రంప్ గెలుపుతోపాటు సెనేట్‌లో కూడా రిపబ్లికన్లకు ఆధిక్యం దక్కితే గోరుచుట్టుపై రోకటిపోటు చందం కాక తప్పదు.

భారత్ ఆలోచించాలి!

భారతదేశ అధికార వర్గాలు ట్రంప్ మరోసారి గెలిస్తే ఏమిటన్న అంశంపై ఆలోచన మొదలుపెట్టాల్సిన అవసరం ఉంది. ట్రంప్ రాకతో ప్రజాస్వామ్యంలో మన లోటుపాట్లు పక్కకు వెళ్లిపోతాయిలే అనుకుంటే అది తప్పే అవుతుంది. వాస్తవానికి సమస్య మరింత పెరుగుతుంది. అమెరికా వ్యవస్థలు, సంస్థల పనితీరుపై చర్చ ఎంత పెరిగితే ఆ దేశ రాజకీయం అంత అస్థిరమవుతుంది. సమాజం కూడా రకరకాల అంశాలపై ముక్కలు అవుతుంది. ఈ పరిణామాలన్నీ చివరకు అంతర్గత కుమ్ములాటలకూ, సంఘర్షణలకూ తావిస్తాయి. అంతర్జాతీయ, దేశీ రాజకీయాలపై అమెరికాను ఎంత కఠినంగానైనా విమర్శించవచ్చు కానీ... ఆ దేశం అంతర్గతంగా బలహీనపడితే లాభపడేది చైనా మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి. అంతేకాదు... అమెరికాకు వలస వెళ్లిన, ఉద్యోగాలు చేసుకుంటున్న భారతీయులకూ, ఇతర దేశస్థులకూ అంత మంచిది కాదు. ట్రంప్ తిరిగి అధ్యక్షుడు కావడం ప్రపంచ రాజకీయాలు, వాతావరణ మార్పుల సమస్యలకు నిర్ణయాత్మకం కానుందన్నది నిస్సందేహం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రదర్శన కోసమే!



రెండు వేల చదరపు అడుగుల ఇంటిలో మనం కేవలం 200 చదరపు అడుగుల స్థలంలోనే నివసిస్తాం. "మిగతా స్థలంలో మన అహం జీవిస్తుంది."

– ఎస్.వై. ఖురేషీ, కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్

ఇండియా అదుర్స్



తక్కువ జనాభే ఉన్నప్పటికీ అమెరికా రాజకీయాల్లో భారతీయులు అదరగొడుతున్నారు. మరో పక్క చైనీయులు ఎంతమాత్రమూ తమ ముద్రను వేయడం లేదు. దీన్ని ఎలా చూడాలి?

– డేనియల్, వ్యాఖ్యాత

ఆధునిక అమెరికా



ఉపాధ్యక్ష పదవికి తన అభ్యర్థిగా జేడీ వాన్స్‌ను ట్రంప్ ఎంచుకోవడం పట్ల ప్రగతిశీల లెఫ్ట్, స్థానిక రైట్ ఇద్దైపోతున్నారు. వాన్స్ భక్తిగల క్యాథలిక్కు, భారత మూలాలున్న ఆయన భార్య ఉష భక్తిగల హిందువు. ఇది అమెరికా ఆధునిక కుటుంబం. సంప్రదాయ అమెరికా ఎలా ఉంటుందని జనాలు అనుకుంటారో ఆ మూసలో వాళ్లు ఇమడరు. అదే లెఫ్ట్, రైటును అయోమయానికి గురిచేస్తోంది. గాడ్ బ్లెస్ అమెరికా!

– రూపా సుబ్రహ్మణ్య, ఆర్థికవేత్త

సామాజిక విచారణ



యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) కుంభకోణాలను బహిర్గతం చేయడంలో ట్విట్టర్ వేదిక కొత్త సీజేఐలా అవతరించింది.

– జ్యోతి, కంటెంట్ క్రియేటర్

కాంగ్రెస్ వాటం



ప్రతిపక్ష పార్టీలను బీజేపీ చీల్చినప్పుడు దాన్ని మనం 'ఆపరేషన్ కమలం' అంటాం. మరి తెలంగాణలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ చీలుస్తుంటే దాన్ని ఏమనాలి? గత కొన్ని వారాల్లో పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకొంతమంది వరుసలో ఉన్నారు. 'ఆపరేషన్ చేతివాటం'?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

తిప్పి కొడతారా?



జమ్ము ప్రాంతంలోని దోడా జిల్లాలో పాకిస్తాన్ ప్రాయోజిత తీవ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు సైనికులు అమరులయ్యారు. ఇది పరోక్ష యుద్ధం కాదు. తన యుద్ధ చర్యలతో పాకిస్తాన్ మళ్లీ మళ్లీ ఇండియాను కవ్విస్తూనేవుంది. మరి దీనికి ఇండియా స్పందన ఏమిటి?

– ఆర్తీ టిక్కూ సింగ్, జర్నలిస్ట్

సాయానికి రారనా?



తర్వాతి ఉక్రెయిన్ శాంతి శిఖరాగ్ర సదస్సుకు రష్యాను తప్పకుండా ఆహ్వానించాలని (ఉక్రెయిన్ అధ్యక్షుడు) జెలెన్‌స్కీ అంటున్నారు. చూస్తుంటే ఆయన కూడా ట్రంప్ గెలుస్తారని అనుకుంటున్నట్టుగా ఉంది. (ఉక్రెయిన్‌కు అమెరికా సాయాన్ని ట్రంప్ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో.)

– స్టాన్లీ జానీ, కాలమిస్ట్

మనం చేయాల్సిన యుద్ధం

యువత మాదక ద్రవ్యాల బారిన పడటం ఇవ్వాళ ఒక సామాజిక సమస్య. ఈ సమస్య అంతానికి అందరూ కృషిచేయాలి. అయితే డ్రగ్స్ సరఫరాదారుల సమాచారం తెలిసినా దాన్ని రహస్యంగా సంబంధిత వర్గాలకు అందజేయడానికి మార్గాలు తెలియకపోవడం, గోప్యత విషయంలో కొన్ని భయాల కారణంగా డ్రగ్స్‌పై యుద్ధంలో అందరూ పాల్గొనలేకపోతున్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాపై '100' నంబర్‌కు సమాచారమివ్వమని ప్రభుత్వం ప్రజలను కోరుతోంది (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నంబర్ 8712671111; నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో 'మానస్ జాతీయ హెల్ప్ లైన్ 1933' ఇంకా ప్రతిపాదన దశలో ఉంది). ఉదాహరణకు ఒక విద్యార్థి తన కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసి హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయబోయే ముందు తన భద్రతపై సందేహాలు మనసులో మెదిలి ఆ ప్రయత్నం నుంచి విరమించుకుంటాడు. ఫోన్ చేస్తే తన నంబర్ ఎక్కడ గుర్తిస్తారో అనేది ప్రధానమైన భయం.

యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడే అవకాశం తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, మిత్రులకు ఉంటుంది. తొలి దశలోనే గుర్తించడం వల్ల పిల్లలను కాపాడుకోవచ్చనీ, అందుకు కొంత నైపుణ్యం ఉండాలనే అవగాహన కల్పించడం అవసరం. పిల్లల ప్రవర్తనలో ఈ మార్పులు గమనించాలి: డ్రగ్స్ కోసం డబ్బు, సమయం వృథా చేయడం, అప్పు, దొంగతనం చేయడం (ఇంట్లో డబ్బు, వస్తువులు మాయమవటం); చదువుపై ఆసక్తి తగ్గి, కళాశాలకు హాజరు కాకపోవటం, మార్కులు తగ్గిపోవటం; దుస్తులు, అలంకరణపై శ్రద్ధ లేకపోవడం; స్నేహితులు, కుటుంబంతో దూరంగా ఉండటం; రహస్యంగా కొత్త స్నేహితులతో బయటికి వెళ్ళడం, ఏ అనారోగ్యం లేకున్నా మందులు వాడటం, పెద్ద శబ్దానికి అసహనం చెందడం, ఆత్రుత, చికాకు, నిరుత్సాహం, ఆందోళన, విపరీతమైన అనుమానం, హింసాత్మక ప్రవర్తన, భ్రాంతికి గురవ్వడం.

పిల్లల్లో ఈ భౌతిక మార్పులు గమనించాలి: బరువు తగ్గడం లేదా పెరగడం, కళ్ళు ఎరుపెక్కడం, పొడిబారిన నోరు, చేతుల తడబాటు, చేతివేళ్లు పసుపుగా మారడం (గంజాయి), దగ్గు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, మగత, అస్పష్టమైన మాటలు, అసంకల్పిత కంటి కదలికలు, కనుపాపలు పెద్దగా మారడం, కళ్ల మధ్యలో నల్లటి వలయాలు (కొకైన్), వణుకు, పళ్ళు బిగించడం, కండరాల తిమ్మిరి, కనుపాపలు చిన్నగా మారడం (నల్లమందు), చర్మంపై సూది గుర్తులు. సాధ్యమైనంత త్వరగా డ్రగ్స్ ప్రభావాన్ని గుర్తించి తగిన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించడం ద్వారా పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు, మిత్రుల మద్దతు కీలకం.

– శ్రీనివాస్ మాధవ్, సమాచార హక్కు కార్యకర్త । హైదరాబాద్

చేసిన చట్టానికి... చేజేతులా తూట్లు!

భారతదేశం ప్రజాస్వామిక దేశం. ప్రజల హక్కులను కాపాడుతూ, ప్రజల కోణంలో పాలన సాగేందుకు దిక్సూచిగా రాజ్యాంగం ఉంది. అయితే ఇవాళ మహోన్నతమైన రాజ్యాంగ స్ఫూర్తి రాజకీయాల్లో కొరవడింది. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకు రాజ్యాంగాన్ని కేంద్ర బిందువుగా మార్చారు. అధికారమే పరమావధిగా ఎవరికి తోచిన విధంగా వారు 'మీరే రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారంటే... కాదు మీరే రాజ్యాంగానికి సమాధి కడుతున్నారని' పరస్పరారోపణలు చేసుకుంటున్నారు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతో పాటుగా కొన్ని ప్రాంతీయ పార్టీలు సైతం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూనే ఉన్నాయి. రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతిని చేత బూని ఎన్నికల ప్రచారంలో, పార్లమెంటు సమావేశాల్లో చూపుతూ 'రాజ్యాంగాన్ని కాపాడాలి' అనే నినాదం ఇచ్చారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో 'న్యాయపత్ర'లోని 13వ న్యాయ సూత్రంగా 'ప్రజాప్రతినిధులు గెలిచిన సొంత పార్టీని వీడి మరొక పార్టీలో చేరితే వెనువెంటనే అనర్హత వేటు పడే విధంగా 10వ షెడ్యూలును సవరించి పార్టీ ఫిరాయింపులను నిరోధిస్తా'మని హామీ ఇచ్చారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 63 స్థానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతీకార ధోరణితో 39 స్థానాలను గెలుచుకున్న భారత రాష్ట్ర సమితి శాసన సభ్యులను, శాసన మండలి సభ్యులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోంది. తాము ఎన్నికల హామీగా ఏమిచ్చారో దాన్నే వారు స్వయంగా అతిక్రమించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా కేంద్రంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాజ్యాంగాన్ని చేతబూని ప్రకటనలు ఇస్తుంటే... మరోవైపు తెలంగాణ రాష్ట్ర నాయకత్వం



అందుకు పూర్తి భిన్నంగా బీఆర్ఎస్ శాసన సభ్యులు ఆరుగురిని దఫదఫాలుగా, శాసన మండలి సభ్యులు పదిమందిని ఒకేసారి చేర్చుకుంది. కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ హయాంలో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లో 101, 102 (2), 190, 191 (2) అధికరణాల ద్వారా అమలులోకి తెచ్చిన పార్టీ ఫిరాయింపుల చట్టానికి ఈ చర్యతో కాంగ్రెస్ తూట్లు పొడిచినట్లే కదా!

బీజేపీ సైతం ఫిరాయింపులకు వ్యతిరేకం అంటూనే గతంలో దాదాపు ఎనిమిది నుండి పది రాష్ట్రాల ప్రజా ప్రభుత్వాలను పడగొట్టి, మిత్రపక్షాలతో కలిసి అనైతిక ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సంగతినీ మరువరాదు.

2014లో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా తొలుత బలం పెంచుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్, టీడీపీ శాసన సభ్యులను చేర్చుకున్నప్పటికీ న్యాయపరంగా చిక్కులు రావొచ్చనే ఆలోచనతో ఆ యా పార్టీల 'సభా పక్షాలను' విలీనం చేసుకుంది. అనాడు పలువురు రాజకీయ ప్రముఖులు, విశ్లేషకులు ఈ విలీనాలను తప్పు పట్టారు.

తెలంగాణలో పార్టీలు మారిన ప్రజా ప్రతినిధులు అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. పదేండ్లు కారు పార్టీలో అధికారాన్ని అనుభవించి, ఆ పార్టీ అధికారం కోల్పోగానే రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తూ గెలిచిన పార్టీ (కాంగ్రెస్)లోకి చేరడం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. వారిని నమ్ముకుని భుజానికెత్తుకొని గెలిపించిన కార్యకర్తలకు అండగా ఉండాల్సిన వీరు ఎన్నికైన పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారడాన్ని ప్రజలు గర్హిస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల పట్ల రెండు నాలుకల ధోరణితో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ప్రజా క్షేత్రంలో ఎదురుదెబ్బ తినక తప్పదు.

– పిన్నింటి విజయ్ కుమార్
పొలిటికల్ సైన్స్ విద్యార్థి । 90520 39109

విశ్వాసి కర్తవ్యం

ఇస్లాం చరిత్రలో 'మొహర్రం' నెలకు ఒక ప్రత్యేకత ఉంది. యావత్తు ముస్లిం జగత్తుకు ఇది కొత్త సంవత్సరం. ఇస్లామీయ క్యాలెండర్ మొహర్రం మాసంతో ప్రారంభమవుతుంది. ఈ మాసంలో ఒక విషాద సంఘటన జరిగినప్పటికీ, అది యాదృచ్ఛికమే తప్ప మరొకటి కాదు. అందుకని అపశకునంగా భావించి, ప్రత్యేకతలు ఆపాదించడం సరికాదు. ఈ నెల పదవ తేదీన ప్రవక్త (స) మనుమడు ఇమామె హుసైన్(ర) అమరులయ్యారు. ఆయన ప్రాణత్యాగం వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉంది. దాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అది అర్థం కావాలంటే, నేపథ్యాన్ని తెలుసు కోవాలి. ముహమ్మద్ ప్రవక్త (స) నిర్యాణం తరువాత ఖలీఫాల పాలన మొదలైంది. వారి పాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి సూత్రం, 'దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు'. అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభువులు ఎంతమాత్రం కాదు.

ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సత్ శీలత, జవాబుదారీతనం ప్రాణం



లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా ఉండేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను తుంగలో తొక్కాయి. కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర మొదలైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు కంకణ బద్ధులయ్యారు ఇమామె హుసైన్ (ర). లక్ష్యసాధన కోసం, విలువల పరిరక్షణ కోసం ఎలాంటి పరిణామాల నెదుర్కోడానికైనా, చివరికి ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యాన్నీ, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికీ 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు స్ఫూర్తిగా నిలిచారు. ఇందుకే ప్రతి యేటా 'మొహర్రం' పదవ తేదీన ఆయన త్యాగాన్ని స్మరించుకుంటారు.

– మదీహా అర్జుమంద్
(నేడు ఇమామె హుసైన్ వర్ధంతి 'మొహర్రం')

గుంపుగా వచ్చి.. బాలుడిని ఈడ్చుకెళ్లి..

- తల వెంట్రుకలు నోట్లో కరుచుకొని ఈడ్చుకెళ్లిన వీధికుక్కలు
- బాలుడికి తీవ్రగాయాలు... రక్తస్రావం.. గాంధీ ఆస్పత్రిలో మృతి
- ఇంకెన్ని ప్రాణాలు పోతే అధికారులు పట్టించుకుంటారని స్థానికుల ఆగ్రహం

జవహర్‌నగర్/గాంధీఆస్పత్రి: మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఏడాదిన్నర వయసున్న బాలుడు ఆరు బయట ఆడుకుంటున్నాడు...అదే సమయంలో వీధి కుక్కలు గుంపుగా అక్కడకు వచ్చాయి. ఒక్కసారిగా ఆ బాలుడిపై దాడి చేశాయి. తలభాగాన్ని నోట్లో కరుచుకొని కొంత దూరం ఈడ్చుకెళ్లాయి. అలా ఈడ్చుకుంటూ వెళుతున్న క్రమంలో ఆ బాలుడి తలవెంట్రుకలు, తలలోని కొంత భాగం ఆ పరిసరాల్లో ఊడి పడింది. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ హృదయ విదారక సంఘటన మల్కాజిగిరి–మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి గ్రామానికి చెందిన భరత్–లక్ష్మి దంపతులకు ఏడాదిన్నర కుమారుడు విహాన్ ఉన్నాడు. లక్ష్మి సోదరుడు వెంకట్ జవహర్‌నగర్‌లోని ఆదర్శనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. ఆయన ఇంటికి లక్ష్మి దంపతులు కుమారుడితో కలిసి చుట్టపుచూపుగా కొద్దిరోజుల క్రితం వచ్చారు. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో విహాన్ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. గుంపులుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా విహాన్‌పై దాడి చేశాయి. కొంతదూరం వరకు ఈడ్చుకెళ్లి పడేశాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అదే కాలనీలో ఉన్న ఓ వ్యక్తి ఆ కుక్కల గుంపు దగ్గరకు వెళ్లి చూడగా, బాలుడు తీవ్ర రక్తస్రావంతో కిందపడి ఉన్నాడు. ఒళ్లంతా రక్కడంతో కుక్కకాటు గుర్తులు ఉన్నాయి. ఆ పరిసరాల్లోనే విహాన్ తల వెంట్రుకలు, మెదడులోని కొంత భాగం కూడా మరో చోట పడింది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఆ బాలుడిని గాంధీ ఆస్పత్రిలోని అత్యవసర విభాగానికి తరలించారు. శరీరమంతా కుక్కకాట్లతో నిండిపోయి ఉండటంతో పరిస్థితి విషమించింది. అనస్థీషియా, పిడియాట్రిక్ తదితర విభాగాలకు చెందిన వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. రాత్రి 9:30 గంటలకు విహాన్ మృతి చెందాడు. తీవ్రమైన రక్తస్రావం కావడంతో కాపాడలేకపోయామని గాంధీ క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. జవహర్‌నగర్ పరిధిలో వీధికుక్కల బెడద ఎక్కువగానే ఉందని స్థానికులు వాపోయారు. ఇంకెన్ని ప్రాణాలు పోతే.. అధికారులు ఈ సమస్యను పట్టించుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



33 సన్నాల వెరైటీలకు బోనస్

వరి సన్నాల రకాలను వెల్లడించిన వ్యవసాయశాఖ



సాక్షి, హైదరాబాద్: వరి సన్నాలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆయా వెరైటీల వివరాలను వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏ వెరైటీలు వేస్తే బోనస్ లభిస్తుందో వెల్లడించారు. మొత్తం 33 వరి సన్నాల వెరైటీలను రైతులు వేసుకోవాలని వ్యవసాయశాఖ సూచించింది.

సన్నాల వెరైటీ వివరాలు...

సిద్ధి (డబ్ల్యూజీఎల్–44), కంపాసాగర్ వరి–1 (కేపీఎస్ 2874), సాంబ మసూరి (బీపీటీ 5204), జగిత్యాల వరి–3 (జేజీఎల్ 27356), జగిత్యాల వరి–2 (జేజీఎల్ 28545), వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100), జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470), పొలాస ప్రభ (జేజీఎల్ 384), క్రిష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోన (జేజీఎల్ 3828), తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి–1119, కూనారం వరి–2 (కేఎన్ఎం 1638), వరంగల్ వరి–2 (డబ్ల్యూజీఎల్ 962), రాజేంద్రనగర్ వరి– 4 (ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వరి–1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844), కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855), అంజన (జేజీఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రద్యుమ్న (జేజీఎల్ 17004), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని (ఆర్ఎన్ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యూజీఎల్ 347), ఆర్ఎన్ఆర్ 31479 (పీఆర్‌సీ), కేపీఎస్ 6251 (పీఆర్‌సీ), జేజీఎల్ 33124 (పీఆర్‌సీ), హెచ్ఎంటీ సోన, మారుటేరు సాంబ (ఎంటీయూ 1224), మారుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ 1271 .

వినియోగదారులు కాదు..
ప్రగతి భాగస్వాములు

- సింగరేణి బొగ్గు వినియోగదారులతో సీఎండీ ఎన్.బలరామ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యే పరిశ్రమలకు బొగ్గునందిస్తున్న సింగరేణి సంస్థ తన వినియోగదారులతో స్నేహపూరితంగా వ్యవహరిస్తుందని సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్ స్పష్టం చేశారు. వినియోగదారులుగా కాకుండా ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తున్నామని, వారి కోసం ప్రత్యేక సమన్వయ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని సింగరేణి భవన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ–వేలం (ఈ ఆక్షన్) వినియోగదారులు, వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి బొగ్గు సరఫరా చేస్తున్న సుమారు 80 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని కొన్ని సూచనలు చేయగా దీనిపై వెంటనే స్పందించిన సంస్థ చైర్మన్ బొగ్గు వినియోగదారులకు ఇబ్బంది, సమాచార లోపం లేకుండా ఉండడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ సెల్‌లో తాను కూడా ఉంటానని, ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఇతర బొగ్గు సంస్థల్లో లేనివిధంగా సింగరేణిలో ఈ–వేలం వినియోగదారులకు అనేక వెసులుబాట్లను కల్పించామన్నారు. కోల్ ఇండియాలో ఈ–వేలం సేల్ ఆర్డర్ కాలపరిమితి కేవలం 45 రోజులు ఉండగా సింగరేణిలో ఇది 90 రోజులుగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిమితి పెంచాలని సహేతుక కారణం చూపితే పెంచుతామన్నారు. సేల్ ఆర్డర్ రద్దు చేసుకుంటే వారికి డిపాజిట్ మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పారు. సమావేశంలో సంస్థ జనరల్ మేనేజర్ మార్కెటింగ్ జి.దేవేందర్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎస్.వి. రాజశేఖర్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవివాస్తవ పాల్గొన్నారు.

ఆ పిల్లల చదువు బాధ్యత నాదే

ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రుల్ని కోల్పోయినవారికి కేటీఆర్ భరోసా



పిల్లలు దీపిక, మదన్‌లను ఓదారుస్తున్న కేటీఆర్

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతల్ తండాలో ప్రేమోన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. నిందితుడు నాగరాజు దాడిలో తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణలు చనిపోవడంతో పిల్లలు దీపిక, మదన్‌లు అనాథలయ్యారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నలు మంగళవారం హైదరాబాద్‌లోని కేటీఆర్ వద్దకు పిల్లలను తీసుకెళ్లారు. వారితో మాట్లాడిన కేటీఆర్ జరిగిన విషయాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అనాథ పిల్లల చదువు బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త, గ్రామ పంచాయతీలో వార్డు సభ్యురాలు కావడంతో పార్టీ తరఫున కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. కుటుంబానికి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా నిందితుడు నాగరాజుకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కేటీఆర్ కోరినట్లు చెప్పారు.

అంగన్‌వాడి టీచర్లకు 2 లక్షలు.. ఆయాలకు లక్ష

రిటైర్మెంట్ ప్యాకేజీపై త్వరలో ఉత్తర్వులు: మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్, రహమత్‌నగర్: పదవీ విరమణ పొందే అంగన్ వాడీ టీచర్లకు రూ. రెండు లక్షలు, ఆయాలకు (హెల్పర్లు) రూ.లక్ష రిటైర్మెంట్ ప్యాకేజీని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ఫైల్ క్లియర్ చేసిందని, రెండు మూడు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయని చెప్పారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని రహమాత్ నగర్ డివిజన్‌లో అమ్మ మాట – అంగన్ వాడీ బాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల భాష బోధనా విధానం ప్రవేశపెడతామని వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు యూనిఫామ్స్, ఆట వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని తల్లి దండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత మంత్రి సీతక్క మొక్కలు నాటించారు. మై ప్లాంట్ మై ఫ్యూచర్ అని చిన్నారులతో పలికించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ. రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ చిన్నారులతో మంత్రి సీతక్క

మహిళా రైతులకు 50 శాతం రాయితీపై పరిశీలన: సీతక్క

సాగు భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీలో మహిళా రైతులకు 50 శాతం రాయితీ ఇచ్చే అంశాన్ని ప్రభు త్వం పరిశీలిస్తోందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. మంగళవారం ప్రజా భవన్‌లో మంత్రితో మహిళా రైతుల హక్కుల సాధనకు కృషిచేస్తున్న 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' (మకామ్) ప్రతినిధులు డా. ఉషా సీతా మహాలక్ష్మి, డా. వి రుక్మిణి రావు, ఎస్. ఆశాలత సమావేశమయ్యారు. మహిళలకు భూ యాజ మాన్య హక్కులు కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు సమర్పించిన వినతి పత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రైతు భరోసా పథకాన్ని పదెకరాల వరకే అమలు చేయాలన్న డిమాండ్ ఊపందుకున్న నేపథ్యంలో.. కుటుంబ సభ్యుల మధ్య భూ పంపకాలు జరిగే అవకాశా లున్నాయని 'మకాం' ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెళ్లికాని కుమార్తెలు, ఒంటరి మహిళలు, గృహిణుల పేర్లపై భూ రిజిస్ట్రేషన్లు పెంచేలా.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీలో మహిళలకి రాయితీ ఇవ్వాలని సూచించారు. ఈ అంశాలను సీఎం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాగు భూమి రిజిస్ట్రేషన్ల చార్జీలో 50 శాతం రాయితీలు ఇస్తూ విధాన పరమైన నిర్ణయం తీసుకునేందుకు ప్రయ త్నిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అభిషేక్ బోయినపల్లి కేసు మరో ధర్మాసనానికి బదిలీ

నాట్ బిఫోర్‌మి అన్న జస్టిస్ సంజయ్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసుకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్ విచారణ మరో ధర్మాసనానికి బదిలీ అయింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తాను సభ్యుడిగా లేని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించాలని జస్టిస్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దీంతో జస్టిస్ సంజయ్ కుమార్ సభ్యుడుగా లేని ధర్మాసనానికి ఈ పిటిషన్ బదిలీ చేయాలని సీజేఐకు సిఫార్సు చేస్తున్నట్లు జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొన్నారు. తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా వేస్తున్నామని అప్పటి వరకూ మధ్యంతర బెయిల్ కొనసాగుతుందని జస్టిస్ ఖన్నా స్పష్టం చేశారు.

'ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలు మార్చాలి'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలను సవరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కనక చంద్రం మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్పౌజ్, మెడికల్‌కు సంబంధించిన ముఖ్యమైన విషయాలను జీవో నంబర్ 80లో మరిచిపోయారని ఆయన తెలిపారు. స్పౌజ్ విషయంలో రెండేళ్ల నిబంధన తప్పనిసరి కాదని పేర్కొనడం వల్ల దీర్ఘకాలం ఒకేచోట పనిచేసే వారికి బదిలీ అవకాశం లేకుండా పోయిందన్నారు. మెడికల్ గ్రౌండ్‌లో ఏడాది పాటు ఇన్ సర్వీస్‌లో ఉన్నా బదిలీ అవకాశం ఇవ్వాలని కోరారు.

గంజాయి కోసం డబ్బు ఇవ్వలేదని..

అమ్మమ్మను హత్య చేసిన మనవడు



రాంబాయమ్మ (ఫైల్)

ఖమ్మం క్రైం: గంజాయి కోసం పింఛన్ డబ్బులు ఇవ్వలేదని పెంచి పెద్దచేసిన అమ్మమ్మను ఓ మనువడు హతమా ర్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మ(85) భర్త విశ్వనాథం కొన్నాళ్ల క్రితమే మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారు లు, ఒక కూతురు. ఒక కొడుకు మృతి చెందగా, మరో కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కూతురికి భర్త దూరం కావడంతో రెండో వివా హం చేశారు. ఆమెకు మొదటి భర్తతో కలిగిన సంతానమైన ఉదయ్‌ను రాంబాయమ్మే పెంచి పెద్ద చేసింది. పదోతరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. డిప్లొమాలో చేరినా, గంజాయి, మద్యానికి బానిసై చదువు మధ్యలోనే ఆపేశాడు. డబ్బు కోసం అమ్మమ్మను వేధిస్తూ వృద్ధాప్య పింఛన్ కూడా తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం డబ్బు ఇవ్వాలని ఉదయ్ అమ్మమ్మను అడిగాడు. రాత్రి వరకు ఇవ్వకపోతే అంతు చూస్తా నని బెదిరించి వెళ్లాడు. రాత్రి వచ్చి డబ్బు అడగ డంతో రాంబాయమ్మ లేవని చెప్పగా దాడికి దిగా డు. వృద్ధురాలు అని కూడా చూడకుండా చాతీ, చెవులపై పిడిగుద్దులు కొట్టడంతో రెండు చెవుల నుంచి రక్తం వచ్చి ఆమె మృతి చెందింది. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఉదయ్ మంగళ వారం ఉదయం వచ్చి ఏమీ తెలియనట్టుగా తన అమ్మమ్మ జారిపడి అపస్మారకస్థితిలో ఉందని స్థానికులకు చెబుతూ 108కు ఫోన్ చేశాడు. సిబ్బంది వచ్చి రాంబాయమ్మ మృతి చెందిందని చెప్పారు. అయితే, ఉదయ్‌పై అనుమానం ఉన్న స్థానికులు గట్టిగా నిలదీయడమే కాక దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసు విచారణలో అమ్మమ్మను తానే చంపినట్టు ఉదయ్ అంగీకరించడంతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

కులగణనకు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: కుల గణనకు తక్షణమే డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులగణనపై విధి, విధానాలను రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మంగళవారం బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్‌తో కలిసి జాజుల మీడియాతో మాట్లాడారు. మూడున్నర కోట్ల జనాభా కలిగిన తెలంగాణలో అతి తక్కువ సమయంలోనే సమగ్ర కులగణన చేపట్టడానికి చాలా అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వెంకటేష్, శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, శ్యాం, విజయ్, మణిమంజరి పాల్గొన్నారు.

జ్వరమా.. మరేదైనా కారణమా..?

- అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి
- కొట్టి చంపారా? ఏమైనా చేశారా అంటూ బంధువుల ఆందోళన
- ప్రిన్సిపాల్‌పై దాడి..
- సూర్యాపేట జిల్లా దోసపహాడ్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఘటన



సరస్వతి మృతి చెందడంతో రోదిస్తున్న తల్లిదండ్రులు, సోదరి



ప్రిన్సిపాల్‌పై దాడి చేస్తున్న మృతురాలి బంధువులు



సరస్వతి మృతదేహం

పెన్‌పహాడ్: గురుకుల పాఠశాల విద్యార్థిని అను మానాస్పద స్థితిలో మృతి చెందింది. అయితే జ్వరంతో విద్యార్థిని చనిపోయిందని ప్రిన్సిపాల్ చెబుతుండగా, రాత్రే చనిపోతే ఉదయం వరకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహంతో మృతురాలి బంధువులు ప్రిన్సి పాల్‌పై దాడి చేశారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివ రాల ప్రకారం... సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మాచినపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి సోమయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్నకూతురు సరస్వతి(10) పెన్ పహాడ్ మండలంలోని దోసపహాడ్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. సరస్వతికి సోమవారం రాత్రి జ్వరం వచ్చింది.గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న జీఎన్ఎం మంగళవారం తెల్లవారుజామున పరీక్షించి మరో ఉపాధ్యాయురాలితో కలిసి గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ఇంజక్షన్ వేయించారు. అయినా జ్వరం తీవ్రత తగ్గకపోగా సీరియస్‌గా ఉండటంతో 108 వాహనంలో సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సర స్వతిని పరీక్షించిన డాక్టర్ అప్పటికే చనిపోయిందని చెప్పారు. దీంతో ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి.. మీ పాపకు సీరియస్‌గా ఉందంటూ సర స్వతి తల్లి దండ్రులకు ఫోన్ చేశారు. వారు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా అప్పటికే మృతి చెందినట్టు తల్లిదండ్రులకు తెలియజేశారు. తమ కూతురు బాగానే ఉందని, అప్పుడే ఎలా చనిపోయిందని వారు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు.

ఆస్పత్రిలో బంధువులు, తల్లిదండ్రుల ఆందోళన

సరస్వతి మృతి చెందిన విషయం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది తమకు తెలియజే యకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని ఆస్పత్రిలోని మార్చురీ వద్ద కుటుంబసభ్యు లు ఆందోళన చేశారు. తమ కూతురు సోమ వారం రాత్రే చనిపోయిందని, ఆ విషయం చెప్పకుండా దాచిపెట్టి మంగళవారం ఫోన్ చేసి సీరియస్‌గా ఉందని చెప్పారని తల్లిదండ్రులు వాపోయారు. తమ కూతురుని కొట్టి చంపారా.. లేక ఏదైనా చేశారా మాకు చెప్పాలని తండ్రి సోమయ్య డిమాండ్ చేశాడు. న్యాయం చేసే వరకు పోస్టుమార్టం చేయొద్దని పట్టుబట్టారు.

మాట్లాడదామని చెప్పి...

ప్రిన్సిపాల్‌తో మాట్లాడించాలని రీజినల్ కోఆర్డినేటర్ షకీనాను బంధువులు కోరగా, ఆమెను తీసుకొస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. ప్రిన్సిపాల్‌పై సరస్వతి బంధువులు దాడి చేశారు. వెంటనే అక్కడే ఉన్న డీఎస్పీ రవి జోక్యం చేసుకొని ప్రిన్సిపాల్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న బీసీ గురుకుల అధికారులు మద్దిలేటి,వెంకటేశ్వర్లు ఆస్పత్రి వద్దకు వెళ్లి అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. మృతురాలి తండ్రి కొంపెల్లి సోమయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

నాటి విమర్శకుడే... నేటి వీరాభిమాని

ట్రంప్ రన్నింగ్ మేట్ వాన్స్‌ది ఆసక్తికర ప్రస్థానం

నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన వైనం

"దేవుడా! ఈ ట్రంప్ ఎంతటి మూర్ఖుడో!"

"నేనెప్పుడూ ట్రంప్ మనిషిని కాలేను"

"ఆయనంటే నాకస్సలు ఇష్టం లేదు"



రిపబ్లికన్ కన్వెన్షన్‌లో భార్య ఉష చిలుకూరితో పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జె.డి.వాన్స్

అమెరికా మాజీ అధ్యక్షుని గురించి ఆయన సొంత రిపబ్లికన్ పార్టీ నేత వాన్స్ గతంలో చేసిన వ్యాఖ్యలివి. ట్రంప్‌ను వాన్స్ ఎంతగా ద్వేషించారంటే, చివరికి ఆయనను అమెరికా హిట్లర్‌గా అభివర్ణించేదాకా వెళ్లారు! ట్రంప్‌ను బూతులు కూడా తిట్టేవారు. దేశ శ్రామిక వర్గానికి భవిష్యత్తుపై ఆశ, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించకపోతే స్వప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ట్రంప్ వంటి స్వార్థపూరిత నాయకులే పుట్టుకొస్తారంటూ రిపబ్లికన్ పార్టీ విధానాలపైనా విమర్శలు గుప్పించేవారు. అలాంటి వాన్స్ కొన్నేళ్లుగా రిపబ్లికన్ పార్టీలో ట్రంప్‌కు అత్యంత గట్టి మద్దతుదారుగా మారిపోయారు. అంతటితో ఆగకుండా తాజాగా ఏకంగా ట్రంప్‌కు రన్నింగ్ మేట్ కూడా అయిపోయారు! సోమవారం మొదలైన రిపబ్లికన్ల జాతీయ సదస్సులో పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్, ఉపాధ్యక్ష అభ్యర్థిగా వాన్స్ ఖరారయ్యారు!! అంతేనా... అన్నీ కుదిరితే 2028లో రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి వాన్సే అవుతారంటూ అమెరికా మీడియాలో ఇప్పటినుంచే విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి...

నిరుపేద నేపథ్యం

ట్రంప్ రన్నింగ్ మేట్ అయిన 39 ఏళ్ల జె.డి.వాన్స్‌ది ఆసక్తికర నేపథ్యం. మాజీ సైనికుడు. విజయవంతమైన వెంచర్ క్యాపిటలిస్టు. బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన పుస్తక రచయిత. రాజకీయ నాయకుడు. ఇలా ఆయన వ్యక్తిత్వానికి ఎన్నో పార్శ్వాలున్నాయి. వాన్స్ ఒహాయో మిడిల్ టౌన్లో అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టారు వాన్స్. ఆయన అసలు పేరు జేమ్స్ డొనాల్డ్ బోమన్. తల్లి డ్రగ్స్‌కు బానిస. వాన్స్ పసిపిల్లాడిగా ఉండగానే తండ్రి కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయారు. తాత, అమ్మమ్మే ఆయన్ను పెంచి పెద్ద చేశారు. దాంతో వాళ్లనే తల్లిదండ్రులుగా పిలిచేవారు. తన పుస్తకంలో కూడా వారి గురించి రాసుకున్నారు. ఆరేళ్ల వయసులో తల్లి మరొకతన్ని పెళ్లాడింది. ఆయన వాన్స్‌ను దత్తత తీసుకున్నారు. దాంతో తన పేరు నుంచి డొనాల్డ్‌ను తీసేసి మారు తండ్రి పేరులోని డేవిడ్‌ను కలుపుకున్నారు. ఇంటి పేరు కూడా హామెల్‌గా మారింది. పెళ్లయ్యాక తాత, అమ్మమ్మల గౌరవార్థం వారి ఇంటి పేరు వాన్స్‌ను స్వీకరించారు. అలా జేమ్స్ డేవిడ్ వాన్స్‌గా మారారు. తొలుత యూఎస్ మరైన్స్‌లో చేరి సైనికునిగా ఇరాక్‌లో విధులు నిర్వహించిన ఆయన తర్వాత పట్టుదలతో ఉన్నత చదువులు చదివారు. ఒహాయో స్టేట్ వర్సిటీ, యేల్ లా స్కూల్‌కు వెళ్లారు. అనంతరం కాలిఫోర్నియాలో వెంచర్ క్యాపిటలిస్టుగా చేశారు. తన అనుభవాలు, జ్ఞాపకాలకు హిల్‌బిలీ ఎలిజీ పేరిట 2016లో పుస్తక రూపమిచ్చారు. అమెరికాలోకెల్లా అత్యంత పేదరికం తాండవించే కొండ ప్రాంతానికి చెందిన తన కుటుంబ మూలాలను అందులో ఉన్నదున్నట్టు రాశారు. తమ ఇంట్లో పెద్దవాళ్లు కష్టించి పని చేయకుండా కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడి సమాజానికి భారంగా మారారని విమర్శించారు. అది బెస్ట్ సెల్లర్‌గా నిలవడమే గాక అదే పేరుతో హాలీవుడ్ సినిమాగా కూడా రూపొందింది. దానిపై ప్రశంసలతో పాటు వివాదాలూ వెల్లువెత్తాయి. ఆ పుస్తకంతో అమెరికా అంతటా వాన్స్ పేరు మారుమోగింది.

> మతిలేని వలస విధానాల కారణంగా బ్రిటన్ ఇప్పుడు ప్రపంచంలో మొట్టమొదటి అణ్వాయుధ ఇస్లామిక్ దేశంగా మారింది!
> \- జె.డి.వాన్స్

సెనేటర్‌గా నెగ్గేందుకు...

2022లో వాన్స్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఒహాయో నుంచి తొలిసారి సెనేటర్‌గా గెలుపొందారు. అదంత సులువుగా జరగలేదు. ట్రంప్ విమర్శకునిగా ఉన్న ఇమేజీ ఆయనకు పెద్ద అడ్డంకిగా మారింది. దాంతో ఆయనపై గతంలో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పేందుకు వాన్స్ ఏమాత్రం వెనకాడలేదు. అలా ట్రంప్ ఆమోదముద్ర పొంది సెనేటర్ అయ్యారు. యేల్ వర్సిటీ సహాధ్యాయి అయిన తెలుగు మూలాలున్న ఉషా చిలుకూరిని 2014లో పెళ్లాడారు. వర్సిటీ రోజుల నుంచి తన ఎదుగుదల క్రమంలో ప్రతి దశలోనూ ఆమెది అత్యంత కీలక పాత్ర అని వాన్స్ తరచూ చెబుతారు.

అంతర్జాతీయ వ్యవహారాలపై...

ట్రంప్ మాదిరిగానే వాన్స్‌కు కూడా అంతర్జాతీయ వ్యవహారాలపై దృఢమైన సొంత అభిప్రాయాలున్నాయి. 'అమెరికా ఫస్ట్' అన్న ట్రంప్ నినాదానికి ఆయన గట్టి మద్దతుదారు. వలసలు, వామపక్షవాదులే అమెరికాకు అతి పెద్ద ముప్పంటారు. గాజాతో యుద్ధం కోసం ఇజ్రాయెల్‌కు సైనిక సాయాన్ని బేషరతుగా కొనసాగించాలన్నది వాన్స్ వైఖరి. వ్యాపారపరంగా, ఇతరత్రా చైనాను అమెరికాకు గట్టి ప్రత్యర్థి దేశంగానే చూస్తారాయన. అంతర్జాతీయ వర్తక నిబంధనలను పాటించకపోతే అమెరికా క్యాపిటల్ మార్కెట్ నుంచి చైనాను దూరం పెట్టాలంటూ సెనేట్‌లో ఏకంగా బిల్లే ప్రవేశపెట్టారు! గాజాకు మద్దతు గా విద్యార్థులు ఆందోళనకు దిగిన కాలేజీలకు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని నిలిపేయాలంటూ కూడా సెనేట్లో బిల్లులు పెట్టారు. అలాగే ఉక్రెయిన్‌కు అమెరికా భారీగా నిధులు, సైనిక సాయం చేయడాన్ని వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ట్రంప్‌కు అపూర్వ స్వాగతం

డొనాల్డ్ ట్రంప్‌కు రిపబ్లికన్ పార్టీ జాతీయ కన్వెన్షన్‌లో అపూర్వ స్వాగతం లభించింది. హత్యా యత్నంలో గాయమైన కుడి చెవికి బ్యాండేజీతో వచ్చిన 78 ఏళ్ల ట్రంప్‌ను చూసి పార్టీ ప్రతినిధులంతా భావోద్వేగానికి లోనయ్యారు. హత్యాయత్నం తర్వాత ఆయన బయటి ప్రపంచానికి కన్పించడం ఇదే తొలిసారి. సమావేశ మందిరం గుండా నడుస్తూ పిడికిలి బిగించి పైకెత్తి 'ఫైట్' అంటూ ట్రంప్ బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రతినిధులంతా ఉత్సాహంగా ఆయనతో గొంతు కలిపారు. ట్రంప్ వేదికపైకి చేరుకోగానే ఆయన నామస్మరణతో హాలంతా మారుమోగిపోయింది. అనంతరం అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్‌ను లాంఛనంగా ఎన్నుకున్నారు. కన్వెన్షన్‌ను ఉద్దేశించి ఆయన గురువారం ప్రసంగించనున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రకాల్పులు... నలుగురు సైనికుల వీరమరణం

మృతుల్లో ఒక కెప్టెన్ కూడా ● రక్షణ మంత్రి, ఆర్మీ సంతాపం ● ముష్కరుల కోసం భారీ వేట

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలపై ముష్కర మూకల దాడులు పెరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి దోడా జిల్లాలో బలగాలపై భారీ ఆయుధాలతో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు వీరమరణం పొందారు. వారిని కెప్టెన్ బ్రిజేశ్ థాపా, నాయక్ డొక్కరి రాజేశ్, సిపాయిలు బిజేంద్రసింగ్, అజయ్‌కుమార్ సింగ్ నరుకాగా గుర్తించారు. గాయపడ్డ మరో సైనికున్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. కథువా జిల్లా మారుమూల మఛేడీ అటవీప్రాంతంలో సైన్యంపై ఉగ్రవాదులు మెరుపుదాడికి దిగి ఐదుగురు జవాన్లను పొట్టన పెట్టుకున్న వారం రోజులకే తాజా ఘటన చోటుచేసుకుంది. దోడాలో బలగాలు, ఉగ్రవాదుల మధ్య గత మూడు వారాల్లో ఇది మూడో ఎన్‌కౌంటర్. ఇది తమ పనేనని పాక్ దన్నుతో చెలరేగిపోతున్న ఉగ్ర సంస్థ జైషే మహ్మద్‌కు చెందిన 'కశ్మీర్ టైగర్స్' ప్రకటించుకుంది. ఉగ్రవాదులు నక్కారన్న నిఘా సమాచారంతో రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దేసా అటవీ ప్రాంత పరిధిలోని ధారీ గోటే ఉరర్‌బాగీ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 20 నిమిషాల ఎదురుకాల్పుల అనంతరం ఉగ్రవాదులు వెన్నుచూపారు. ప్రతికూల అటవీ ప్రాంతంలోనూ కెప్టెన్ సారథ్యంలో బలగాలు వారిని వెంటాడాయి. దాంతో సోమవారం రాత్రి 9 గంటల అనంతరం మరోసారి చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. కెప్టెన్‌తో పాటు మరో ముగ్గురు అసువులు బాశారని అధికారులు తెలిపారు. ఈ ముష్కరులు అక్రమంగా సరిహద్దు దాటి చొచ్చుకొచ్చి రెండు నెలలుగా అటవీ ప్రాంతంలో నక్కినట్టు భావిస్తున్నారు. వారికోసం అదనపు బలగాలతో సైన్యం, పోలీసులు భారీగా గాలిస్తున్నారు. ఎలైట్ పారా కమెండోలను కూడా రంగంలోకి దించారు.

బాధగా ఉంది: రాజ్‌నాథ్

ముష్కరులను ఏరేసే క్రమంలో నలుగురు వీర జవాన్లు అమరులు కావడం చాలా బాధగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆయనతో పాటు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సైనిక ఉన్నతాధికారులు వారికి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



కెప్టెన్ బ్రిజేశ్ థాపా



బిజేంద్ర సింగ్



అజయ్ నరుకా

నా కొడుకు త్యాగానికి గర్విస్తున్నా..

దేశ రక్షణలో అమరుడైన కొడుకును చూస్తే గర్వంగా ఉందని కెప్టెన్ బ్రిజేశ్ థాపా తల్లిదండ్రులు కల్నల్ (రిటైర్డ్) భువనేశ్ కె.థాపా, నీలిమ అన్నారు. ''నా కుమారుడు చిన్నతనం నుంచీ నన్నే స్ఫూర్తిగా తీసుకున్నాడు. సైన్యంలో చేరాలని ఉవ్విళ్లూరేవాడు. 27 ఏళ్ల వయసులో కల నెరవేర్చుకున్నాడు. రెండు రోజుల క్రితమే నాతో ఫోన్లో మాట్లాడాడు. నిత్యం ప్రాణాపాయం పొంచి ఉండే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లో నా కుమారుడు అమరుడైనందుకు గర్విస్తున్నా'' అని భువనేశ్ చెప్పారు.

ఆర్మీ డే రోజు పుట్టాడు

కెప్టెన్ థాపా ఆర్మీ డే అయిన జనవరి 15న జన్మించారని తల్లి తెలిపారు. తనకింకా పెళ్లి కూడా కాలేదని సుళ్లు తిరుగుతున్న బాధను అణచుకుంటూ చెప్పారామె. కుటుంబంలో ఆయన వరుసగా మూడో తరం సైనికుడు! థాపా తండ్రితో పాటు తాత కూడా సైన్యంలో సేవ చేశారు. ఆయన ఇంజనీరింగ్ చేసి కూడా పట్టుబట్టి ఆర్మీలోనే చేరారు. 145, ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్‌కు చెందిన థాపా రాష్ట్రీయ రైఫిల్స్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు.

బీజేపీ తప్పుడు విధానాల వల్లే...

జవాన్ల మృతిపై రాహుల్ నిప్పులు

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో 78 రోజుల్లో 11 ఉగ్రదాడులు జరిగినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. బీజేపీ తప్పుడు విధానాల ఫలితాన్ని వీర సైనికులు, వారి కుటుంబాలు అనుభవించాల్సి వస్తోందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ మేరకు మోదీ ప్రభుత్వానికి లేఖ రాశారు. 11 ఉగ్రదాడుల్లో 13 మంది ఆర్మీ, పోలీసు సిబ్బంది అమరులయ్యారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఈ దాడులను, సైనికుల బలిదానాలను ఆపడానికి ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుతో ఉగ్రవాదాన్ని నాశనం చేశామనే బూటకపు వాదనకు సైనికులు తమ ప్రాణాలతో మూల్యం చెల్లించుకుంటున్నారన్నారు. సీమాంతర ఉగ్రవాదంపై సమష్టిగా పోరాడాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు.

ఆ అమర సైనికునిది ఏపీ



సంతబొమ్మాళి: దోడాలో ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందిన డొక్కరి రాజేశ్ (25)ది ఆంధ్రప్రదేశ్. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర. రాజేశ్ ఐదేళ్ల కింద ఆర్మీలో చేరారు. వారిది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి కేవలం ఎకరం పొలం సాగు చేస్తూ రాజేశ్‌ను, ఆయన సోదరున్ని చదివించారు. సోదరుడు మధుసూదనరావు డిగ్రీ పూర్తి చేశాడు. రాజేశ్ మృతితో తల్లిదండ్రులు కంటికో ధారగా విలపిస్తున్నారు. గ్రామంలో కూడా విషాద ఛాయలు అలముకున్నాయి.

2024లో జమ్మూలో ఉగ్ర దాడులు...

ఈ ఏడాదే 12 మంది సైనికుల మృతి

ఏప్రిల్ 22: రాజౌరీ జిల్లాలో ప్రభుత్వోద్యోగిని ఉగ్రవాదులు కాల్చి చంపారు.

ఏప్రిల్ 28: ఉధంపూర్ జిల్లాలో ఉగ్రవాదులతో ఎదురు కాల్పుల్లో విలేజీ రక్షక దళ సభ్యుని మృతి.

మే 4: పూంచ్ జిల్లాలో ఉగ్ర దాడిలో ఐఏఎఫ్ సిబ్బంది మరణించగా ఐదుగురు గాయపడ్డారు.

జూన్ 9: రీసీ జిల్లాలో ఉగ్ర దాడిలో 9 మంది భక్తులు మరణించగా 42 మంది గాయపడ్డారు.

జూన్ 11, 12: కథువా జిల్లాలో ఎన్‌కౌంటర్లో ఇద్దరు విదేశీ ముష్కరులు హతమవగా ఒక సీఆర్పీఎఫ్ జవాను అమరుడయ్యాడు.

జూన్ 12: దోడా జిల్లాలో ఉగ్ర దాడిలో ఓ పోలీసుకు గాయాలు.

జూన్ 26: దోడా జిల్లాలో ముగ్గురు విదేశీ ముష్కరుల కాల్చివేత.

జూలై 7: రాజౌరీ జిల్లాలో ఉగ్ర దాడిలో సైనిక సిబ్బంది గాయపడ్డారు.

జూలై 8: కథువా జిల్లాలో ఉగ్రవాదుల ఉచ్చులో చిక్కి ఐదుగురు సైనికులు బలయ్యారు.

జూలై 15: దోడా ఎన్‌కౌంటర్‌లో కెప్టెన్‌తో పాటు మరో ముగ్గురు సైనికుల వీరమరణం

షెడ్యూల్డ్ కులాల జాబితాను రాష్ట్రాలు మార్చలేవు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాబితాలో మార్పుచేర్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. తంతి-తంత్వా కులాన్ని అత్యంత వెనుకబడిన కులాల (ఈబీసీ) జాబితా నుంచి తొలగించి, షెడ్యూల్డ్ కులాల జాబితాలోని 'పాన్/సవాసీ' కులంలో కలిపేస్తూ 2015లో బిహార్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ధర్మాసనం తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద పేర్కొన్న షెడ్యూల్డ్ కులాల జాబితాను మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం లేదని తెలిపింది. క్లాజ్-1 కింద పేర్కొన్న ఎస్సీ కులాల జాబితాను పార్లమెంటు మాత్రమే సవరించగలదని, ఆర్టికల్ 341 ప్రకారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతికి కూడా ఈ అధికారం లేదని స్పష్టం చేసింది.

మిలిటెంట్ల దాడిలో 72 మంది మృతి

కిన్షాసా(కాంగో): డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో పశ్చిమప్రాంతంలో జరిగిన జాతుల హింసలో 9 మంది సైనికులు సహా 72 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని కిన్షాసాకు 100 కిలోమీటర్ల దూరంలోని కిన్సెలెలో శనివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్వామౌత్ ప్రాంతంలో ఉంటున్న టెకె, యకా తెగల మధ్య భూ హక్కులు, సంప్రదాయాలపై తలెత్తిన వివాదాలు 2022 నుంచి హింసాత్మక రూపం దాల్చాయి. యకా వర్గానికి చెందిన మొబొండొ మిలీషియా సభ్యులు గ్రామంపై మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. వీరి దాడిలో 9 మంది సైనికులు, ఒక సైనికుడి భార్య సహా 72 మంది మృతి చెందారని ప్రావెన్షియల్ అధికారులు తెలిపారు.

వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ తండ్రి దారుణ హత్య

దర్భంగా(బిహార్): వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్, మాజీ మంత్రి ముకేశ్ సాహ్నీ తండ్రి జితన్ సాహ్నీ(70) దారుణ హత్యకు గురయ్యారు. దర్భంగా జిల్లాలోని బిరౌల్‌లో పూర్వీకుల ఇంట్లో విగతజీవిగా పడి ఉండగా మంగళవారం ఉదయం పొరుగువారు గుర్తించారు. జితన్ ఛాతీ, పొట్టపై లోతైన కత్తిపోట్లు, గాయాలున్నాయని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పూజా ఖేడ్కర్‌పై కేంద్రం సీరియస్

● ఐఏఎస్ శిక్షణ నిలిపివేత

● మళ్లీ ముస్సోరీ అకాడమీకి వెళ్లాలని కేంద్రం ఆదేశం

ముంబై: కంటిచూపు లోపాలు, మానసిక, శారీరక వైకల్యం ఉందంటూ యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్లు సమర్పించడం, నాన్ క్రీమీలేయర్ పత్రాల దుర్వినియోగం, ఎంబీబీఎస్‌లో చేరేందుకు తప్పుడు పత్రాల సృష్టి.. ఇలా పలు వివాదాలకు కేంద్రబిందువైన 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్ వ్యవహారంపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. తక్షణం మహారాష్ట్రలో ఆమెకు జిల్లా శిక్షణను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తిరిగి ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేషన్ అకాడమీలో రిపోర్ట్‌చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు పూజకు మహారాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నితిన్ గాద్రే లేఖ రాశారు. '' మహారాష్ట్రలో వాసిం జిల్లా సూపర్‌న్యూమరీ అసిస్టెంట్ కలెక్టర్ హోదాలో ఉన్న మిమ్మల్ని తక్షణం 'జిల్లా శిక్షణ' నుంచి పక్కనపెడుతున్నాం. 23వ తేదీలోపు మళ్లీ ముస్సోరీ ఐఏఎస్ అకాడమీలో రిపోర్ట్‌చేయండి. అకాడమీ తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉండండి'' అని ఆమెకు పంపిన లేఖలో నితిన్ పేర్కొన్నారు.

ప్రత్యేక వసతులతో వార్తల్లోకి..

ట్రైనీ అయినాసరే జిల్లా కలెక్టర్ స్థాయిలో తనకూ అధికారిక సదుపాయాలు, వసతులు కల్పించాలని డిమాండ్‌చేయడంతో పూజ వ్యవహార శైలి తొలిసారిగా వార్తల్లోకి ఎక్కింది. ప్రత్యేకంగా ఆఫీస్‌ను కేటాయించాలని, అధికారిక కారు ఇవ్వాలని డిమాండ్‌చేయడంతోపాటు సొంత ఖరీదైన కారుపై ఎర్ర బుగ్గను తగిలించుకుని తిరిగారు. దీంతో పుణెలో అసిస్టెంట్ కలెక్టర్ హోదా నుంచి ఆమెను వాసిమ్ జిల్లాలో సూపర్‌న్యూమరీ అసిస్టెంట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీచేసింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి సివిల్స్‌లో ఆమె ఆలిండియా 821వ ర్యాంక్ సాధించారని మీడియాలో వార్తలొచ్చాయి. దాంతో యూపీఎస్సీకి ఆమె సమర్పించిన వైకల్యం సర్టిఫికెట్లు, అఫిడవిట్ల విశ్వసనీయతపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఈ విషయంలో నిజానిజాలను నిగ్గుతేల్చాలని కేంద్రప్రభుత్వ ఏకసభ్య కమిటీని నియమించింది. రెండు వారాల్లోగా నివేదించాలని ఆదేశించింది. ఆదివారం పుణె పోలీసులు పూజ లగ్జరీకారును సీజ్‌చేశారు. తప్పుడు పత్రాలతో ఎంబీబీఎస్ సీటు సాధించారని విమర్శలు వెల్లువెత్తాయి.



సోమవారం అర్ధరాత్రి పూజ ఇంటికి మహిళా పోలీసులు వెళ్లారు. కొంచెం పని ఉందని చెప్పి ఆమే వారిని పిలిపించినట్లు తెలుస్తోంది. అయితే పుణె కలెక్టర్ సుహాస్ దివాసే తనను వేధిస్తున్నారని ఫిర్యాదు చేసేందుకే వారిని ఇంటికి పిలిపించిందని పోలీసు అధికారి ఒకరు మంగళవారం వెల్లడించారు. కాగా 2022 ఆగస్టులో పుణె జిల్లా పింప్రి ఆస్పత్రిలో ఎడమ మోకాలికి వైకల్యం ఉందని ఆమె వికలాంగ సర్టిఫికెట్ సంపాదించారని యశ్వంత్‌రావ్ చవాన్ స్మారక ప్రభుత్వాసుపత్రి డీన్ రాజేంద్ర వాబ్లే వెల్లడించారు. అయితే అదే నెలలో ఔధ్ ప్రభుత్వాసుపత్రిలో వైకల్య సరిఫికెట్ కోసం పెట్టుకున్న ఆమె దరఖాస్తు తిరస్కరణకు గురైందని తెలుస్తోంది. ''కమిషనర్ ఫర్ పర్సన్స్ విత్ డిజబిలిటీ ఆదేశాల మేరకు పూజ గతంలో సమర్పించిన వైకల్య సర్టిఫికెట్లు అన్నింటినీ పరిశీలిస్తాం. ఆమెకు కంటి, మానసిక, అంగ వైకల్యం ఉందని ధ్రువపరిచిన ఆస్పత్రులు, వైద్యులెవరో తేలుస్తాం' అని పుణె పోలీసు అధికారి వెల్లడించారు.

పరారీలో తల్లిదండ్రులు !

తల్లిదండ్రులకు కోట్ల రూపాయల ఆస్తులున్న విషయాన్ని దాచి పెట్టి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్‌ను సంపాదించారనీ పూజపై ఆరోపణలున్నాయి. పూజ తల్లిదండ్రుల వ్యవహార శైలిపైనా మీడియాలో వార్తలొచ్చాయి. గ్రామ సర్పంచ్ అయిన పూజ తల్లి మనోరమ ఒక భూవివాదంలో కొందరిని గన్‌తో బెదిరిస్తున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. క్రిమినల్ కేసులో తల్లిదండ్రుల జాడ కోసం పోలీసులు వెతుకుతున్నారు. వారిద్దరి మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. పుణెలోని మెట్రో రైల్ కార్మికులతో గొడవ పడుతున్న వీడియో కూడా సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది.

కొండచరియలు కూలి 9 మంది మరణం!

బనశంకరి: కర్ణాటకలో భారీ వర్షాల నేపథ్యంలో పెను ప్రమాదం సంభవించింది. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు గ్రామ సమీపంలోని 66వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కొండచరియలు విరిగిపడి తొమ్మిది మంది గల్లంతయ్యారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. గత 15 రోజులుగా ఉత్తరకన్నడ జిల్లాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ఎన్‌హెచ్ 66ను ఆనుకుని ఉన్న ఎర్రమట్టి కొండ మంగళవారం ఆకస్మాత్తుగా కుప్పకూలింది. పెద్ద మొత్తంలో మన్ను, భారీ బండరాళ్లు విరుచుకుపడ్డాయి. దీంతో రహదారి పక్కనే రెండు ఇళ్లలో ఉన్న ఐదు మంది, వాహనాల్లో వెళ్తున్న నలుగురు మట్టి కింద చిక్కుకున్నారు. ఇళ్లలోని ఐదుగురు సజీవ సమాధి అయ్యారు. రెండు భారీ గ్యాస్ ట్యాంకర్లు గంగావళి నదిలోకి పడ్డాయి. వాటిలోని నలుగురు డ్రైవర్లు, క్లీనర్ల జాడ లేదు. గల్లంతైన వారిలో 7 మంది చనిపోయారని కలెక్టర్ తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 62 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరో 62 మంది చనిపోయారు. ఖాన్ యూనిస్‌లో శరణార్థుల టెంట్లపై జరిగిన దాడుల్లో నలుగురు చిన్నారులు సహా 17 మంది చనిపోయారు. 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ హమాస్ మిలటరీ విభాగం చీఫ్ మహ్మద్ డెయిఫ్ లక్ష్యంగా శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో 90 మందికి పైగా చనిపోయింది ఈ ప్రాంతంలోనే. మంగళవారం వేకువజాము వరకు నుసెయిరత్, జవాయిదాల్లో 40 చోట్ల లక్షిత దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. నుసెయిరత్‌లో శరణార్థులు తలదాచుకుంటున్న స్కూల్ భవనం శిథిలాల దిబ్బగా మారింది. ఈ ఘటనలో 10 మంది మహిళలు, నలుగురు చిన్నారులు సహా 33 మంది ప్రాణాలు కోల్పోగా 73 మంది గాయాలపాలయ్యారు. ఖాన్ యూనిస్, రఫాల్లో జరిగిన దాడుల్లో 12 మంది మృతి చెందారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు నుసెయిరత్, జవాయిదాల్లోని హమాస్ స్థావరాలు, మౌలిక వనరులే లక్ష్యంగా 40 చోట్ల దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది.

రేపు మళ్లీ తెరుచుకోనున్న రత్న భండార్

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రత్న భండార్‌ను గురువారం మళ్లీ తెరుస్తామని అధికార వర్గాలు తెలిపాయి. జూలై 18వ తేదీ ఉదయం 9.51 గంటల నుంచి 12.15 గంటల మధ్యలో రత్న భండార్‌లోని లోపలి గదిని తెరిచి అమూల్యమైన వస్తువులను తాత్కాలిక ట్రెజరీ రూంకు తరలించనున్నారు. భారత పురావస్తు విభాగం(ఏఎస్‌ఐ) నిపుణులు వీటిని పరిశీలించనున్నారు. 46 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా జూలై 14న రత్న భండార్ తలుపులను తెరవడం తెల్సిందే.

మూడో తాళం తెరుచుకోలేదేం?

14న రత్న భండార్ లోపలి గది మూడు తాళాలను తెరిచేందుకు మూడు డూప్లికేట్ తాళం చెవిలతో ప్రయత్నించారు. రెండు తాళాలు తెరుచుకోగా మూడోది మొరాయించింది. దాన్ని పగలగొట్టాల్సి వచ్చింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. డూప్లికేట్ తాళం చెవులు మాయమైనట్లు గతంలో వార్తలొచ్చాయి.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల హింస ఆరుగురు మృతి

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాను రద్దు చేయాలంటూ బంగ్లాదేశ్‌లో విద్యార్థులు సాగిస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. యూనివర్సిటీల క్యాంపస్‌లలో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు విద్యార్థులు సహా ఆరుగురు చనిపోగా 400 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. స్కూళ్లు, కాలేజీలు, మదరసాలను మూసివేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం పారా మిలటరీ బలగాలను రంగంలోకి దించింది. రాజధాని ఢాకాకు సమీపంలోని జహంగీర్ నగర్ వర్సిటీ క్యాంపస్‌లో వైస్‌చాన్సెలర్ నివాసం వద్ద విద్యార్థులు గుమికూడారు. ప్రశాంతంగా నిరసన సాగిస్తున్న తమపై అధికార అవామీ లీగ్ అనుబంధ బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ కార్యకర్తలు పోలీసులతో కలిసి దాడికి పాల్పడినట్లు విద్యార్థులు ఆరోపించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. ఆందోళనకారులు రెండు బస్సులకు నిప్పుపెట్టారు. పెట్రోల్ బాంబులు విసిరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. సోమవారం నుంచి జరుగుతున్న ఆందోళనల్లో 400 మందికి పైగా గాయపడినట్లు చెబుతున్నారు.

సుప్రీంకు మరో ఇద్దరు జడ్జీలు

తొలిసారిగా మణిపూర్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం




జస్టిస్ కొటీశ్వర్ జస్టిస్ మహదేవన్

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ నాంగ్మేకపామ్ కొటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఆర్. మహదేవన్‌లు సుప్రీం జడ్జీలుగా మంగళవారం నియమితులయ్యారు. వీరిద్దరూ జడ్జీలుగా ప్రమాణం చేశాక సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య అనుమతించిన గరిష్ట సంఖ్యకు చేరుకోనుంది. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్‌తో కలుపుకుని గరిష్టంగా 34 మంది జడ్జీలు కొలువుతీరొచ్చు. జస్టిస్ కొటీశ్వర్‌ది మణిపూర్. '' ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జీగా ఎంపికవుతున్న మొట్టమొదటి జడ్జిగా ఆయన పేరు రికార్డుల్లో నిల్చిపోనుంది'' అని ఆయన పేరును జూలై 11న కేంద్రానికి సిఫార్సుచేసిన సందర్భంగా సుప్రీంకోర్టు కొలీజియం వ్యాఖ్యానించడం తెల్సిందే. గతంలో జస్టిస్ కొటీశ్వర్ 2011 అక్టోబర్‌లో గౌహతి హైకోర్టులో జడ్జిగా నియమితులయ్యారు. మణిపూర్ హైకోర్టు ఏర్పడ్డాక అక్కడికి బదిలీ అయ్యారు. 2023 ఫిబ్రవరిలో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. తమిళనాడులోని వెనకబడిన వర్గాలకు చెందిన జస్టిస్ మహదేవన్ మద్రాస్ హైకోర్టులో మూడో అత్యంత సీనియర్ జడ్జిగా ఉన్నారు. ''సీనియారిటీలో ఈయనకన్నా ముందున్న జడ్జీలు వేరే హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌లుగా పదోన్నతిపై వెళ్లడంతో సుప్రీంకోర్టు ధర్మాసనంలో వైవిధ్యం తీసుకొచ్చే లక్ష్యంతో ఈయనను సుప్రీం జడ్జిగా సిఫార్సు చేస్తున్నాం'' అని కొలీజియం వ్యాఖ్యానించింది.

21న అఖిలపక్ష సమావేశం

హాజరుకాబోమని సమాచారమిచ్చిన తృణమూల్ కాంగ్రెస్



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 21న ఉదయం 11గంటలకు ఢిల్లీలోని పార్లమెంటు అనుబంధ భవనంలోని ప్రధాన కమిటీ రూమ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. లోక్‌సభలో విపక్షనేత హోదాలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తొలిసారిగా అఖిలపక్షభేటీలో పాల్గొనబోతున్నారు. బెంగాల్లో అదే రోజు అమరుల దినోత్సవం ఉన్నందున తమ పార్టీ రావడం లేదని తృణమూల్ తెలిపింది. ఈమేరకు రిజిజుకు రాజ్యసభలో టీఎంసీ నేత డెరెక్ ఓబ్రియాన్ లేఖ రాశారు.

సెప్టెంబర్‌లో మోదీ 'ఐరాస' ప్రసంగం



ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి 79వ సర్వప్రతినిధి సభ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 26న మోదీ మాట్లాడే అవకాశం ఉందని ప్రసంగించబోయే నేతల జాబితాను మంగళవారం ఐరాస విడుదలచేసింది. జాబితాలో మార్పులుచేర్పులు ఉండొచ్చని తెలిపింది. సెప్టెంబర్ 24న సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ నేత తొలిసారిగా ప్రసంగిస్తారు. తర్వాత అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రసంగిస్తారు. మూడోసారి ప్రధానిగా పగ్గాలు అందుకున్న మోదీ 2021 సెప్టెంబర్ తర్వాత తొలిసారిగా ఐరాసలో ప్రసంగించనున్నారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం ၊ 17 ၊ జూలై ၊ 2024



నైజీరియన్లపై నజర్

మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీసు శాఖ నిఘా ఉంచింది. డ్రగ్స్ దందాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేకించి నైజీరియన్లపై నజర్ పెట్టింది. -8లో



టార్గెట్.. 2050

మహానగర విస్తరణకు అనుగుణంగా స్వల్ప, దీర్ఘకాలిక రవాణా అవసరాలపై హెచ్ఎండీఏ దృష్టి సారించింది. ఈ మేరకు ఉమ్టా ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టింది. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/24.0

నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.

బీబీ కా ఆలం.. సర్వం సిద్ధం

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని బుధవారం పాతబస్తీలో నిర్వహించనున్న బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపునకు అధికారులు అంతా సిద్ధం చేశారు. 'రూపవతి' అనే ఏనుగుపై బీబీ కా ఆలంను షియా ముస్లింలు ఊరేగించనున్నారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఊరేగింపు రూట్‌ను పరిశీలించింది. బందోబస్తు కోసం అదనపు పోలీస్ బలగాలను తరలించారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 76 మంది ఏఎస్ఐలు, 395 మంది పోలీసు కానిస్టేబుల్, 165 మంది హెడ్ కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. వీరితో పాటు తొమ్మిది ప్లాటూన్ల ఏఆర్ పోలీసు బలగాలు, 6 ప్లాటూన్ల టీజీఎస్పీ పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తెలిపారు. డబీర్‌పురాలోని బీబీ కా అలావా నుంచి బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపు బయలుదేరి చాదర్‌ఘాట్ వరకు కొనసాగుతుందన్నారు.

మీ సాహసానికి జోహార్

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ముషీరాబాద్: సమాజ సేవలో యువత ముందుండాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ముషీరాబాద్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్, బాప్టిస్ట్ చర్చి సమీపంలో ఆదివారం రాత్రి వరద నీటి ఉధృతిలో కొట్టుకుపోతున్న కారులోని నలుగురు వ్యక్తులను రక్షించిన యువకులను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ సత్కరించారు. ఈ సందర్భంగా నీటిలో మునిగిపోతున్న కారులో ఉన్న వారిని ఏ విధంగా రక్షించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులైన ప్రణీత్ యాదవ్, మోహన్ యాదవ్, నాగరాజుచారి, ఎం.మార్టిన్‌లు ధైర్య సాహసాలను ఆమె మెచ్చుకున్నారు. తనకేమిలే అని అనుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తోటి మనిషికి సహాయం అందించాలన్న తపన కలిగి ఉండాలన్నారు. ఎదుటి వారిని రక్షించడంతో పాటు తమ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమీషనర్ రవికిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ తీరుపై కేటీఆర్ ఆగ్రహం

సాక్షి, సిటీబ్యూరో: తమ కాలనీల్లో సమస్యలున్నాయంటూ ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించే విషయంలో జీహెచ్ఎంసీ ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. తమ కాలనీలో చెట్లు భారీగా పెరిగిపోవటం, చెత్తా చెదారం కారణంగా పాముల బెడద ఉందంటూ జీహెచ్ఎంసీ మేయర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ ఓ వ్యక్తి కేటీఆర్‌కు 'ఎక్స్' ద్వారా తెలిపారు. కాలనీలో 50 కుటుంబాలున్నాయని, సరైన రోడ్లు, నీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట దొంగతనాలు జరుగుతున్నాయని కేటీఆర్‌కు వివరించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. నెటిజన్ వివరించిన సమస్యను పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఏ సమస్య అయినా ఒక్క ట్వీట్తోనే పరిష్కరించేవాళ్లమని గుర్తు చేశారు. ప్రస్తుతం కార్పొరేటర్ల పార్టీ ఫిరాయింపులపై మాత్రమే ఈ ప్రభుత్వం దృష్టి పెట్టటంతో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇకనైనా ప్రజల సమస్యలపై మేయర్ సహా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. 48 గంటల్లో సమస్య పరిష్కారం కాకపోతే స్థానికులతో కలిసి తామే శ్రమదానం ద్వారా పరిష్కరిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

కుంగిన నేల.. జాతీయ రహదారిపై భారీ గొయ్యి



ఉప్పల్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఉప్పల్- వరంగల్ ప్రధాన రహదారిపై ఫ్లై ఓవర్ పిల్లర్ వద్ద మంగళవారం భారీ గొయ్యి ఏర్పడింది. పిల్లర్ చుట్టూ రెండు అడుగుల లోతు వరకు మట్టి కుంగిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాధవి, ఉప్పల్ ఈఈ నాగేందర్‌లు మట్టితో గొయ్యిని పూడ్చివేయించారు. ఫ్లైఓవర్ పనులు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ విమర్శించారు. గొయ్యిని కాంక్రీట్‌తో నింపుతామని, ఎవరూ ఆందోళన చెందవద్దని జీహెచ్ఎంసీ డీఈ రవీందర్ స్పష్టంచేశారు.



'ఐఫా' స్టార్స్

సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ 'ఐఫా అవార్డ్స్ 2024'కు సర్వం సిద్ధమైంది. మంగళవారం నగరంలోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రారంభ వేడుకల్లో పలువురు తెలుగు, తమిళ, మలయాళీ, కన్నడ సినీ తారలు తళుక్కుమన్నారు. - వివరాలు 'సిటీప్లస్'లో

హైడ్రా.. రాణా!

ఓఆర్ఆర్ లోపలి పరిధి వరకు ఏర్పాటు

- ఆక్రమణ సంబంధిత కేసుల దర్యాప్తు కోసం..
- చెరువుల పరిరక్షణకు పీడీపీపీ యాక్ట్ వినియోగం
- 2 నెలల్లో కొత్త వ్యవస్థ ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు తక్షణం కూల్చివేత



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ భూముల పరిరక్షణ, చెరువుల కబ్జాల నిరోధం, విపత్తు స్పందన తదితర లక్ష్యాలతో ఏర్పాటవుతున్న హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) కోసం ప్రత్యేకంగా ఓ పోలీసుస్టేషన్ ఏర్పాటు కానుంది. ఓఆర్ఆర్ లోపలి భాగం మొత్తం దీని పరిధిలోకి రానుంది. హైడ్రా చెరువుల పరిరక్షణ కోసం కీలక ప్రాధాన్యం ఇవ్వనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న జీహెచ్ఎంసీ పరిధి 605 చదరపు కిలోమీటర్లు కాగా.. హైడ్రాది దీనికి మూడు రెట్లకు పైగా ఉండనుంది. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాలతో పాటు బయట ఉన్న కొన్ని కీలక ప్రాంతాలను దీని పరిధిలోకి తీసుకువచ్చారు.

నోటీసులు అవసరం లేకుండా కూల్చివేత

హైడ్రా కీలక బాధ్యతల్లో ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారుల పరిరక్షణ ఒకటి. దీన్ని పక్కాగా అమలు చేయడం కోసం అధికారులు జీహెచ్ఎంసీ యాక్ట్‌లోని 405, 406 సెక్షన్లను పక్కాగా వినియోగించుకోనున్నారు. వీటి ప్రకారం ఎలాంటి వివాదం లేని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాలను నోటీసులు లేకుండానే కూల్చివేసే అవకాశం ఉంది. ఆక్రమణలు, కబ్జాలపై ప్రస్తుతం జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. వీటి దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం హైడ్రా పరిధిలో ఓ ఠాణా ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహితలను (బీఎన్ఎస్ఎస్) ఆధారంగా చేసుకుని పని చేయనుంది.


గడువు 45 రోజులు

అనుమతి తీసుకున్న అంతస్తుల కంటే ఎక్కువ ఎత్తు నిర్మాణాలపైనా హైడ్రా దృష్టి పెడుతుంది. ప్రాథమిక బాధ్యత మాత్రం స్థానిక మున్సిపల్, గ్రామ పంచాయితీలకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారుల పైనే ఉంటుంది. వారికి వచ్చిన ఫిర్యాదులపై గరిష్టంగా 45 రోజుల్లోగా స్పందించి చర్యలు తీసుకోవాలి. అలా కాని పక్షంలో ఫిర్యాదుదారులు హైడ్రాను ఆశ్రయించవచ్చు. హైడ్రాలో ప్రస్తుతం ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, సర్వేయింగ్, టౌన్ ప్లానింగ్, అటవీ, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన వాళ్లు డిప్యుటేషన్‌పై పని చేయనున్నారు. - ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్



స్థానిక సంస్థల అధికారాలు పదిలం

జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల- బయట ఉన్న ఏడు కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు హైడ్రా పరిధిలోకి వస్తున్నాయి. ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటుతో ఓఆర్ఆర్ లోపల ఉన్న స్థానిక సంస్థల నిర్వీర్యమవుతాయని, వాటి అధికారాలకు కోత పడుతుందని వస్తున్న వాదనను ప్రభుత్వం కొట్టిపారేస్తోంది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామ పంచాయితీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటుంది. కబ్జాలు నిరోధించడం, ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించడం చేయడం మినహా ఇతర అంశాల్లో దీని జోక్యం ఉండదని స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే బీఎన్ఎస్‌లోని 329 సెక్షన్ ప్రకారం కేసు నమోదవుతుంది. దీని కింద నేరం నిరూపణ అయితే గరిష్టంగా మూడు నెలలు మాత్రమే శిక్షకు అవకాశం ఉంది. దీన్ని సవరించడం ద్వారా 10 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది.



హైడ్రా పరిధిలోకి వచ్చే ప్రాంతాలు

- 2053.44 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండే హైడ్రా పరిధిలోకి వచ్చే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, ప్రత్యేక పాలనా సంస్థలు..
- **ప్రత్యేక పరిపాలన వ్యవస్థలు:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, ఐలాలు సహా 61 ఇండస్ట్రియల్ ఏరియాలు.
- **నగరపాలక సంస్థలు:** జీహెచ్ఎంసీ, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్.

పురపాలక సంస్థలు: పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిబట్ల, తుక్కుగూడ, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, దమ్మాయిగూడ, నాగారం, ఘట్కేసర్, గుండ్ల పోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, పోచారం.

- **గ్రామ పంచాయితీలు:**

మెదక్ జిల్లా పరిధిలో.. రామచంద్రాపురం, ఐలాపూర్, కర్ధనూర్, కిష్టారెడ్డిపేట్, ముత్తంగి, పోచారం, సుల్తాన్‌పూర్, పాటి.

- **ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో..** కాచవాని సింగారం, కొర్రెముల్, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట్, చేర్యాల్, గోధుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, మంఖాల్, గొడవెల్లి, పూడూర్, మంచిరేవుల, బొమ్మరాస్‌పేట్, గోల్కొండ కలాన్, గోల్కొండ ఖుర్ద్, హమీదుల్లానగర్, జన్వాడ.

చెరువు కబ్జా చేస్తే పీడీపీపీ యాక్ట్

జీహెచ్ఎంసీ పరిధిలో 180కి పైగా ఉన్న చెరువుల్లో అనేకం ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం హైడ్రా ద్వారా కొన్ని కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టం (పీడీపీపీ) కింద కేసు నమోదు చేయనుంది.

- అసెంబ్లీలో చర్చించి ఆమోదం పొందడం ద్వారా హైడ్రాకు పరిపూర్ణ రూపం ఇవ్వాలని భావిస్తున్న సర్కారు.. గరిష్టంగా రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోంది.

'ఎస్‌బీఆర్'తో ఎస్టీపీలు



ప్రారంభానికి సిద్ధంగా నాగోల్ ఎస్టీపీ

- మూసీ ఒడ్డున ఆధునిక సాంకేతికతతో ఐదింటి నిర్మాణం
- వీటి నిర్మాణ వ్యయం మొత్తం రూ.1,279 కోట్లు
- నాగోల్‌లో 320 ఎంఎల్‌డీ అతిపెద్ద సామర్థ్యంతో..
- ఇప్పటికే దీని ట్రయల్ రన్ షురూ
- ఈ నెలాఖరులోగా ప్రారంభానికి సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: నగరం నడిబొడ్డున ప్రవహించే మూసీ నది మురుగునీరు, కాలుష్యంతో నిండిపోయింది. జలమండలి వంద శాతం మురుగు నీటి శుద్ధిలో భాగంగా నదిని పునరుజ్జీవింపజేసేందుకు సుమారు 70 మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలను చేపట్టింది. మూసీ నది దక్షిణ ఒడ్డున 4 ప్రాంతాల్లో మాత్రం రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తన అనుబంధ సంస్థ హైదరాబాద్ ఎస్టీపీ లిమిటెడ్ భాగస్వామ్యంతో హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్‌లో 5 మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాలను చేపట్టింది. సరికొత్త అధునాతన సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) సాంకేతికతతో సుమారు 480.50 ఎమ్మెల్డీ సామర్థ్యం గల మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాలకు దాదాపు రూ. 1,297 కోట్ల వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చుతుండగా.. మిగతా 60 శాతం నిధులను హైదరాబాద్ ఎస్టీపీ లిమిటెడ్ భరిస్తోంది. మొత్తం వ్యయంలో నిర్మాణం కోసం రూ.908 కోట్లు, నిర్వహణ కోసం రూ. 389 కోట్లు ఖర్చు చేయనుంది. ఎస్టీపీలను నిర్మించడంతో పాటు పదిహేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది.

అత్యాధునిక సాంకేతికత..

మహా నగరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాల్లో వినియోగిస్తున్న సాంకేతికతతో పోలిస్తే 'సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్' సరికొత్తది. ఇది ఇప్పటి వరకు భారతదేశంలోనే అతిపెద్దదని చెప్పవచ్చు. ఎస్‌బీఆర్ సాంకేతికత తక్కువ విద్యుత్‌ని వినియోగిస్తుంది. ఖర్చు పరంగానూ అందుబాటులో చాలా తక్కువ. ఇప్పటి వరకు వినియోగిస్తున్న యూఆర్ఎస్‌బీఆర్ సాంకేతికతతో 60 ఎకరాల్లో 172 ఎమ్మెల్డీని శుద్ధి చేస్తే, ఎంబీబీఆర్ సాంకేతికతతో పది ఎకరాల్లో 38 ఎమ్మెల్డీని శుద్ధి చేస్తుంది. తాజా ఎస్‌బీఆర్ సాంకేతికతతో 15 ఎకరాల్లో 320 ఎమ్మెల్డీని శుద్ధి చేసే అవకాశం ఉంది. ఈ టెక్నాలజీతో మ్యాన్ పవర్ లేకుండా పూర్తిగా ఆటోమెటిక్ ప్రక్రియలో పని చేస్తుంది.

మూడింటి నిర్మాణం పూర్తి

- మూసీ నదీ దక్షిణ ఒడ్డున ఆధునిక సాంకేతికతను వినియోగించి మూడు మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేసినట్లు రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రూప్ సీఎఫ్ఓ ఎన్ఎస్ రావు వెల్లడించారు. మంగళవారం నాగోల్‌లో ఎస్టీపీల పనితీరును, వివరాలను వెల్లడించారు. ఇప్పటికే కోకాపేట, మీరాలం ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఈ రెండింటి ద్వారా రోజువారీగా 56.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నాగోలులో 320 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఎస్టీపీ నిర్మాణం పూర్తి కావడతో ఇటీవల ట్రయల్ రన్ ప్రారంభించామన్నారు. ఈ నెలాఖరులోగా పూర్తిగా ప్రారంభించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు.
- మరో రెండు ఎస్టీపీల నిర్మాణాలు పురోగతి దిశలు ఉన్నాయి. మురుగు నీరు, వ్యర్థాలను ఎస్టీపీలకు మళ్లించడం ద్వారా నది నీటి కాలుష్యం, దుర్వాసనను తగ్గించవచ్చన్నారు. రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హోల్-టైమ్ డైరెక్టర్ పి.రవి ప్రసాద్ మాట్లాడుతూ సరికొత్త ఎస్‌బీఆర్ టెక్నాలజీని విజయవంతంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దీంతో ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఫుట్ ప్రింట్, విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తుందన్నారు. పర్యావరణ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం పట్ల నిబద్ధతను ఈ ప్రాజెక్ట్ నిర్మాణం బహిర్గతం చేస్తుందన్నారు.

మహద్భాగ్యం!

- ఆన్‌లైన్‌లో ఆరోగ్య వివరాలు నిక్షిప్తం
- సమగ్ర సమాచారం డిజిటలీకరణ
- భారత్ ఆయుష్మాన్ హెల్త్ విధానం
- ప్రవేశపెట్టిన జాతీయ వైద్య మండలి
- ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాల సేకరణ
- మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో మొదలైన ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: ప్రతీ వ్యక్తి సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని డిజిటలీకరణ చేసేందుకు జాతీయ వైద్య మండలి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రజలకు పలు వైద్య పరీక్షలు చేసి ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద గుర్తింపు కార్డు జారీ చేస్తున్నారు. వైద్య మండలి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచి గుర్తింపు నంబర్ కేటాయించనుంది. దీంతో దేశంలో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా చికిత్స అందించే వెసులుబాటు ఉంటుంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డుతో పాటు ఆరోగ్య వివరాలు తెలుసుకుని పలు పరీక్షలు చేస్తున్నారు. ఈ వివరాలను ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ డేటా) పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

ఫిబ్రవరి నాటికి పూర్తి..

జిల్లాలో అభా కింద మొదటగా 30 ఏళ్లు పైబడిన 17 లక్షల మంది నుంచి ఆరోగ్య వివరాలు సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 3,76,477 మంది సమాచారాన్ని నమోదు చేసినట్లు ప్రోగ్రాం అధికారి డాక్టరు కౌశిక్ తెలిపారు. మిగతా వారి ఆరోగ్య సమాచానికి సంబంధించిన వివరాలను వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 30 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించిన అనంతరం సిబ్బంది ఎన్సీడీలో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ, పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీలు, యూపీ సీహెచ్‌సీలకు వివిధ ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారి ఆరోగ్య వివరాలు మాత్రం వయసుతో నిమిత్తం లేకుండా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

మెరుగైన ప్రయోజనం..

దేశంలోని ఆస్పత్రులన్నింటినీ అభా పరిధిలోకి తీసుకురావడంతో రోగులు ఏ ఆస్పత్రికి వెళ్లినా ఆరోగ్య పరీక్షల వివరాలు, ఎక్స్‌రేలు (పొందుపరిస్తే), ఇతర ఆరోగ్య సమాచారం మొత్తం మన అభా ఖాతాలో ఉంటుంది. ఈ ఆధారంగా వాళ్లు పరిశీలించి చికిత్స అందిస్తారు. ఇతర ఆస్పత్రులకు వెళ్లినప్పుడు రోగి వద్ద పాత మెడికల్ రిపోర్టులో లేకపోయినా అభా నంబర్ ద్వారా ఆరోగ్య పరిస్థితిని సదరు వైద్యుడు తెలుసుకుని చికిత్స చేస్తారు. ప్రభుత్వాలు కూడా ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు తలెత్తుతున్నాయో తెలుసుకోవటానికి అవకాశముంటుంది.

ఇంటింటికీ వెళ్లి నమోదు..

అభాలో వివరాల నమోదులో సాంకేతిక సమస్యలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పడంతో వందలాది మంది ఆన్‌లైన్‌లో కేంద్రాల్లో, సెల్‌ఫోన్లలో నేషనల్ హెల్త్ అథారిటీ వెబ్‌సైట్ నమోదు చేసుకున్నారు. నమోదు వివరాలు ఒక పోర్టల్ నుంచి మరో పోర్టల్లోకి వెళ్లకపోవడంతో తిరిగి ఎన్సీడీ పోర్టల్లో నమోదు చేస్తున్నారు. ఇంతకు ముందు నమోదు చేసుకున్న వాళ్లు కేవలం అభా నంబర్ చూపితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

ఆరోగ్య గుర్తింపు కార్డుగా ఉపయుక్తం..

30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ అభాలో ఆరోగ్య వివరాలు నమోదు చేయించుకోవాలి. ఇది ఆరోగ్య గుర్తింపు కార్డు వంటిది. రానున్న రోజుల్లో దీని ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయి. అన్ని ఆసుపత్రుల వివరాలను సైతం ఇందులో నిక్షిప్తం చేస్తున్నారు. తక్షణ చికిత్స కోసం ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

– డాక్టర్ రఘునాథ్ స్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

నైజీరియన్లపై నజర్!

- పాత నేరస్తులు, విమానాశ్రయాల్లో రాకపోకలపై ఆరా
- గడువు ముగిసినా ఏళ్ల తరబడి అక్రమంగా తిష్ట
- మెట్రో నగరాలే లక్ష్యంగా డ్రగ్స్ దందా
- సెలబ్రిటీలు, బడా వ్యాపారులే కస్టమర్లు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీసు శాఖ నిఘా పెట్టింది. డ్రగ్స్ దందాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేకించి నైజీరియన్లపై నజర్ పెట్టింది. పరారీలో ఉన్న నిందితులు, విమానాశ్రయాల్లో రాకపోకలపై ఆరా తీస్తోంది. తాజాగా సైబరాబాద్ పోలీసులు ఛేదించిన అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ కేసులో చిక్కిన ఇద్దరు నైజీరియన్లు తరచూ హైదరాబాద్‌కు రాకపోకలు సాగించినట్లు గుర్తించారు. దీంతో అనోహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీమ్ అడెషోలా కదలికలపై పోలీసులు నిఘా పెట్టి, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఎక్కువ మంది టూరిస్టు, స్టడీ, మెడికల్ వీసాలపై ఇండియాకు వస్తున్నారు. వీసా గడువు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే అక్రమంగా ఉంటూ డ్రగ్స్ దందా, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. నైజీరియా, సూడాన్, సోమాలియా, ఘనా దేశాలవారే ఇక్కడ అక్రమంగా ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. లంగర్‌హౌస్, హైదర్షాకోట, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, బండ్లగూడ ప్రాంతాల్లో ఎక్కువగా ఆఫ్రికన్ దేశాలవారు ఉన్నారు. పోలీసుల కళ్లుగప్పి గోవా, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలలో మకాం మారుస్తూ.. ఎండీఎంఏ, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారు. సినీనటులు, క్రీడాకారులు, బడా వ్యాపారులకు డ్రగ్స్ విక్రయిస్తున్నారు.

రైళ్లు, బస్సుల్లో ప్రయాణం..

ఎయిర్‌పోర్టులో ఉండే ఫారినర్స్ వింగ్ విదేశీ ప్రయాణికుల వివరాలను సేకరించి స్పెషల్ బ్రాంచ్‌కు పంపిస్తుంది. వీసా గడువు ముగిసిన వారు తిరిగి వెళ్లిపోయారా లేదా అని పోలీసులు ఆరా తీసి వెనక్కి పంపిస్తుంటారు. అయితే ముంబై, ఢిల్లీ, బెంగళూరు విమానాశ్రయాల్లో దిగి రైలు, బస్సు మార్గాల ద్వారా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు.

స్పెషల్ బ్యూరోల ఫోకస్..

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(టీజీ న్యాబ్) స్పెషల్ ఫోకస్ పెట్టింది. గ్రేటర్‌లోని మూడు పోలీసు కమిషనరేట్లలో ఉన్న విదేశీయుల వివరాలను సేకరించి, వారి కదలికలపై నిఘా పెడుతున్నారు. ఇమ్మిగ్రేషన్, ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ అధికారులతో కలిసి జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. పబ్స్‌తోపాటు సిటీలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడినా నైజీరియన్ల లింకులు బయటపడుతున్నాయి. సిటీలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో ప్రధాన డ్రగ్స్ సప్లయర్ టోనీ కూడా నైజీరియనే కావడం గమనార్హం. గోవాకు చెందిన మోస్ట్ వాంటెడ్ సప్లయర్ ఎడ్విన్ నూన్స్, చకుమెకా, ఎన్గుచుక్వు గాడ్విన్ ఇఫెనీ, ఓజెంగ్వా ఇమ్మాన్యుయేల్ ఒసోండు, మహమ్మద్ తోయిరు బకారి, విక్టర్ చుక్వా, ఒజిగ్బో తోచుక్వు, ఒబిబులు చిమ డార్లింగ్‌టన్, చిజియోకో ఉచెచుక్వి అలియాస్ పీటర్ వంటి నైజీరియన్లు పోలీసులకు చిక్కినవారిలో ఉన్నారు.

డ్రగ్స్ కేసులో 18 మందికి రిమాండ్

- ఏ1గా నైజీరియన్ మహిళ
- ఏ6గా అమన్‌ప్రీత్‌సింగ్



డ్రగ్స్ కేసు నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

మణికొండ: నైజీరియా నుంచి గోవా, ముంబై, ఢిల్లీల మీదుగా డ్రగ్స్ తరలించి హైదరాబాద్‌లో విక్రయిస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్న 18 మంది సభ్యుల ముఠాను నార్సింగి, రాజేంద్రనగర్ డివిజన్ ఎస్ఓటీ, మాదకద్రవ్యాల నిరోధక శాఖల పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సోమవారం వారిని నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్, విశాల్‌నగర్ కాలనీలోని జెనాబ్ ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 202లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుల నుంచి రూ.2 కోట్ల విలువ చేసే 199.10 గ్రాముల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోగా, మంగళవారం గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డ్రగ్స్ కొనుగోలు చేసిన 13 మందిలో ఆరుగురికి పాజిటివ్ అని వచ్చింది. అనంతరం నిందితులను రాజేంద్రనగర్‌లోని కోర్టులో హాజరుపరిచారు.

డ్రగ్స్ సరఫరా దారులు వీరే...

డ్రగ్స్ కేసులో ఏ1గా అనొహ బ్లెస్సింగ్ అనే మహిళ, ఏ2గా నిజాం కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్న అజీజ్ నోహీమ్ అడేషోలా, ఏ3గా బెంగుళూరుకు చెందిన అల్లం సత్యవెంకట గౌతమ్, ఏ4గా బోరబండకు చెందిన సానబోయిన వరుణ్‌కుమార్, ఏ5గా ఈవెంట్ కొరియోగ్రాఫర్ మహ్మద్ మహబూబ్ షరీఫ్ ఉన్నారని, వీరంతా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కాగా, సినీహీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ తమ్ముడు అమన్ ప్రీత్ సింగ్, ఫిల్మ్‌నగర్‌కు చెందిన కిషన్ రాతీ, బంజారాహిల్స్‌కు చెందిన అని, గచ్చిబౌలికి చెందిన యశ్వంత్ గాడె, జూబ్లీహిల్స్‌కు చెందిన అలుగడ్డల రోహిత్, గండిపేటకు చెందిన శ్రీచరణ్, బంజారాహిల్స్‌కు చెందిన ప్రసాద్, ఫిల్మ్‌నగర్‌కు చెందిన హృతిక్‌కుమార్, పంజగుట్టకు చెందిన నిఖిల్ ధావన్, గచ్చిబౌలికి చెందిన మధురాజు, రఘు, కనుమూరి కృష్ణంరాజు, వెంకట సత్యనారాయణ డ్రగ్స్ వినియోగిస్తున్నవారిలో ఉన్నారని తెలిపారు. వీరి పేర్లను ఏ6 నుంచి ఏ18 వరకు కేసులో పొందుపరిచారు. వీరి నుంచి 10 సెల్ ఫోన్‌లు, రెండు ద్విచక్రవాహనాలు, ఓ పాస్‌పోర్టును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

విజయనగర్‌కాలనీ: టాస్క్‌ఫోర్స్, ఆసిఫ్‌నగర్ పోలీసులు 12 కిలోల గంజాయితో పాటు యాక్టివా బైక్, రెండు సెల్‌ఫోన్లతో కలిపి మొత్తం రూ.3.45 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..... మహ్మద్ అర్షద్ అలియాస్ అమ్జద్ మిస్కిన్‌ఖాన్ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్. అతడి మేనల్లుడు అబ్దుల్ ఖలీల్ అలియాస్ అబ్దుల్ అలి ఇళ్లల్లో దొంగతనాలతోపాటు సెల్‌ఫోన్లను కూడా దొంగిలించడంలో దిట్ట. ఇదిలా ఉండగా మహ్మద్ అర్షద్ వహీద్‌ఖాన్ అనే వ్యక్తి నుంచి గంజాయిని సేకరించి విక్రయించడానికి అమ్జద్‌తో కలిసి వెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని జైలుకు పంపించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి, ఎస్ఐ సాయికిరణ్, ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.శ్రీనివాస్ తేజ పాల్గొన్నారు.

సొసైటీ స్థలం ఆక్రమిస్తున్నవారిపై కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–1లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ పక్కన జూబ్లీహిల్స్ సొసైటీకి చెందిన 6,072 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ సొసైటీ స్థలాన్ని 2001లో బీఓటీ పద్ధతిలో కేపీరెడ్డి అనే వ్యక్తికి క్లినిక్ నిమిత్తం లీజుకు ఇచ్చింది. అయితే ఈ లీజు అగ్రిమెంట్‌ను కేపీరెడ్డి అతిక్రమించి సత్యనారాయణ అనే వ్యక్తికి నర్సరీ నడుపుకునేందుకు అద్దెకు ఇచ్చాడని, నెలకు రూ.20 వేలు కిరాయి తీసుకుంటున్నాడని సొసైటీ అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కేపీరెడ్డి, సత్యనారాయణ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, మిగతా స్థలంలోకి చొచ్చుకువస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కబ్జా దారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సివిల్ తగాదాలో తలదూర్చినందుకే...

విజయనగర్‌కాలనీ: సివిల్ తగాదా విషయంలో తలదూర్చి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ ఎస్ఐతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను మంగళవారం నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ నెల 4వ తేదీన సుల్తాన్‌బజార్‌కు చెందిన మనీష్ అనే మందుల వ్యాపారిని ఎటువంటి ఫిర్యాదు లేకుండానే ఇంట్లో నుంచి పోలీసులు తీసుకువెళ్లారు. ఈ విషయమై బాధితుడి కుటుంబసభ్యులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు కాకుండా ఇతర ప్రాంతానికి తీసుకువెళ్లారని బాధితులు వాపోయారు. ఉన్నతాధికారులు కేసును సీరియస్‌గా తీసుకుని విచారించారు. ఫిర్యాదులో నిజానిజాలు గ్రహించిన ఉన్నతాధికారులు ఎస్ఐ ఆదిల్ రియాజ్, పోలీస్ కానిస్టేబుల్ రాజేష్, బాలరాజులపై సస్పెన్షన్ వేటు వేశారు.

రెండురోజుల కస్టడీకి రాధాకిషన్‌రావు

బంజారాహిల్స్: షేర్ల బదలాయింపు కేసులో అరెస్టై ఇప్పటికే జైలులో ఉన్న మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును మరింత విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. తనను బెదిరించి కిడ్నాప్ చేసి నిర్బంధించి బలవంతంగా సంతకాలు పెట్టించారని బాధితుడు చెన్నుపాటి వేణుమాధవ్ అనే వ్యక్తి రాధాకిషన్‌రావుపై ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రాధాకిషన్‌రావును పోలీసులు మంగళ వారం కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు.

పెళ్లి పేరిట నమ్మించి.. డబ్బులు కాజేసి..

మ్యాట్రిమోనీలో అమ్మాయిలను మోసగించిన వ్యక్తి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: డేటింగ్ యాప్‌లలో నకిలీ ప్రొఫైల్స్ పెట్టి, పెళ్లి చేసుకుంటానని అమ్మాయిలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఘరానా మోసగాణ్ని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాకు చెందిన చిన్నిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పలు డేటింగ్ యాప్‌లలో సందీప్ సన్నీ పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించాడు. ఆకర్షితురాలైన ఓ బాధితురాలికి గూగుల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నని నమ్మించాడు. స్నేహం పేరుతో బంధాన్ని ప్రారంభించి తర్వాత ప్రేమ, పెళ్లి వరకూ తీసుకెళ్లాడు. వ్యక్తిగత, కుటుంబ కష్టాలు ఉన్నాయని కట్టుకథలు చెప్పి బాధితురాలి నుంచి రూ.6.41 లక్షలు వసూలు చేశాడు. కొట్టేసిన సొమ్మును మేజిస్టిక్ ప్రైడ్, క్యాసినో ప్రైడ్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో పెట్టి పోగొట్టుకున్నాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అరెస్టు చేశారు. సెల్‌ఫోన్, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

గ్యాంగ్‌రేప్ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

అల్వాల్: వివాహితపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న ఓ వివాహిత అల్వాల్‌కి వచ్చి ఆటోలో తిరుగు ప్రయాణమైంది. లోతుకుంట మద్యంషాపు వద్ద సాయికిరణ్ (28), సలీం (40) ఆటో ఎక్కారు. తాము ముందు స్టాప్‌లో దిగిపోతామంటూ నమ్మబలికారు. కొద్దిదూరం వెళ్లాక ఆటోడ్రైవర్‌ను బెదిరించి లోతుకుంటలోని ఖాళీప్రదేశానికి తీసుకువెళ్లారు. అక్కడ ఉన్న బొలెరో వాహనంలోకి ఆమెను సాయికిరణ్ బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. సలీం అతడికి సహకరించాడు. మహిళ తప్పించుకుని ప్రధాన రహదారిపైకి వచ్చి ఇతరుల సాయంతో బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు కేసును శనివారం అల్వాల్ పోలీసులకు బదిలీ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎలాంటి సమయంలోనైనా ప్రమాదంలో ఉన్నామని భావిస్తే బాధితులు 100 ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాలని డీసీపీ సూచించారు.

స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ పేరిట మోసాలు

- అధిక లాభాలంటూ ఆశ చూపిన కేటుగాళ్లు
- ఓ వ్యాపారి నుంచి రూ.1.23 కోట్లు కాజేసిన వైనం
- సైబర్ ముఠాకు బ్యాంక్ ఖాతాలు అందిస్తున్న నిందితుడి అరెస్ట్

హిమాయత్‌నగర్: స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాకు బ్యాంక్ ఖాతాలను అందిస్తున్న నిందితుడు యష్ దూడిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ఒక ప్రకటన విడుదల చేశారు. మోహిత్ గెట్, ఆదిత్య దయాల్ అనే సైబర్ మోసగాళ్లతో రాజస్థాన్‌కు చెందిన యష్ దూడి(22) చేతులు కలిపి వారికి బాధితుల బ్యాంకు ఖాతాల వివరాలు అందించేవాడు. ఈ క్రమంలో నగరానికి చెందిన వ్యాపారి వికాస్ అగర్వాల్(43)తో దూడి పరిచయం చేసుకున్నాడు. ఎలియన్స్ గ్లోబల్ ఇన్‌వెస్టర్స్ ఇండియా అనే కంపెనీ పేరిట 146 మంది సభ్యులతో కూడిన 'ఎలియన్స్ ఇన్వెస్టర్స్ క్లబ్ 449'అనే వాట్సాప్ గ్రూపులో అతడిని చేర్చారు. అనంతరం రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తే 50% లాభం వస్తుందని నమ్మించారు. విడతలవారీగా వ్యాపారి నుంచి మొత్తం రూ.1.23 కోట్లను డిపాజిట్ల పేరిట కాజేశారు. చివరికి నమ్మించి లాభాలు ఇవ్వకుండా మోసం చేశారు. ఈ కేసులో ఏ1 అయిన మోహిత్ గెట్, ఏ2 ఆదిత్య దయాల్, ఏ3 యష్ దూడిని పోలీసులు చేర్చారు. ఈ మోసగాళ్లు దేశవ్యాప్తంగా ఏడాది ఫిబ్రవరి నుంచి మార్చి వరకు రూ.3.41 కోట్ల లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. యష్ దూడి వద్ద నుంచి 3 ఖాతాల చెక్ బుక్స్, 4 బ్యాంకుల డెబిట్ కార్డులు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మోహిత్ గెట్, ఆదిత్య దయాల్ పరారీలో ఉన్నారు., వీరిపై దేశవ్యాప్తంగా మొత్తం 69 కేసులు నమోదయ్యాయి.

అక్రమ నిర్మాణాలపై అధికారుల ఆరా

నివేదిక తెప్పించుకొని పరిరక్షిస్తామన్న రంగనాథ్



ప్రభుత్వ స్థలాన్ని సందర్శించిన రంగనాథ్ తదితరులు

చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్ సర్వే నెంబర్ 155లోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణంపై 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిషనర్ రంగనాథ్ మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా చేపట్టిన ప్రహరీ విషయమై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రెండు నెలల్లో ఈ స్థలంపై పూర్తి నివేదికను తెప్పించుకొని పరిరక్షిస్తామన్నారు. సుమారు 1,100 గజాల ప్రభుత్వస్థలం ప్రైవేట్ వ్యక్తులకే చెందుతుందని అప్పట్లో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్‌కుమార్ ప్రకటించారు. దీంతో ప్రైవేట్ వ్యక్తులు అక్కడ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అయితే 2007లో అప్పటి ఎమ్మార్వో, 2019లో జీహెచ్ఎంసీ అధికారులు, ఇటీవల జిల్లా సర్వే అధికారులు సర్వే చేయగా, మొత్తం ప్రభుత్వ స్థలం 3,500 గజాలు అని తేలింది. కానీ, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి కొత్త మ్యాప్ రూపొందించి కొంత మేరకే ఫెన్సింగ్ చేయించారు. భగత్ సింగ్‌నగర్ ప్రభుత్వ స్థల పరిరక్షణ కమిటీ హైకోర్టుకు వెళ్లగా మొత్తం 3,500 గజాల స్థలానికి ఫెన్సింగ్ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది.

వివాదాస్పదస్థలం పరిశీలన..

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ భూవివాదంపై మంగళవారం జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం కమిషనర్ రంగనాథ్ పరిశీలన చేపట్టారు. స్థానికంగా ఉన్న సర్వే నెంబరు 348/1లోని ప్రభుత్వ భూమిలో చోటు చేసుకుంటున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో పది రోజుల క్రితం కొందరు ప్రైవేట్ వ్యక్తులు సదరు స్థలంలో రోడ్డు నిర్మించేందుకు యత్నించడం వివాదాస్పదమైంది. పరికి చెరువు శిఖ భూమిని ఆనుకుని ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయాలు చేపడుతుండగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నేతలు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 8న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏఈ అజేష్, టౌన్‌ప్లానింగ్ అధికారులు కబ్జాలను పరిశీలించగా తాజా రంగనాథ్ సందర్శించి ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ కట్టడం కూల్చివేత

సాక్షి, సిటీబ్యూరో: తప్పుడు అనుమతులతో పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్లితే... కుత్బుల్లాపూర్‌లోని మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీకి సంబంధించిన పార్కు స్థలంలో ఒక వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తప్పుడు అనుమతులతో భవన నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణంపై కమిషనర్‌కు సొసైటీ ఫిర్యాదు చేసింది. స్పందించిన ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ పూర్వాపరాలతోపాటు దస్తావేజులను, డాక్యుమెంట్లను పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. అనంతరం అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి అనంతరం భవనం కూల్చివేశారు.

నకిలీ ఇంటర్వ్యూలు.. బోగస్ ఆఫర్ లెటర్లు..

ఉద్యోగాల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ గేమింగ్ డబ్బుల కోసం నిరుద్యోగుల జీవితాలతో ఆటాడుకున్న ఓ మోసగాడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే... ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కిలారు సీతయ్య నౌకరీ.కామ్, లింక్డిన్ వంటి జాబ్ పోర్టళ్ల నుంచి నిరుద్యోగుల సమాచారాన్ని సేకరించేవాడు. బాధితులకు ఫోన్ చేసి ఎరిక్సన్ గ్లోబల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సీనియర్ ఉద్యోగినని నమ్మించేవాడు. తమ కంపెనీలో జాబ్ ఆఫర్ ఉందని, జాబ్ గ్యారంటీకి కొంత ఖర్చు అవుతుందని చెప్పేవాడు. టోకెన్ అమౌంట్‌ను పంపించినవారికి ఆన్‌లైన్‌లో నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించేవాడు. నకిలీ జాయినింగ్ లెటర్లు పంపి మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేవాడు. జాయినింగ్ లెటర్‌తో కంపెనీకి వెళ్లిన బాధితులు అసలు విషయం తెలుసుకుని ఖంగుతిన్నారు. ఈ క్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి రూ.5.64 లక్షలు వసూలు చేశాడు. ఈ కేసులో సాంకేతిక ఆధారాలతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాధితుల నుంచి కొట్టేసిన సొమ్మును ఆన్‌లైన్ గేమ్‌లు, స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసి పోగొట్టుకున్నాడు. సీతయ్యపై ఇప్పటికే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఏడు కేసులున్నాయి.


హైదరాబాద్- విజయవాడ రూట్‌లో న్యూ గో ఎలక్ట్రిక్ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి విజయవాడ, నంది గామలకు న్యూ గో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు న్యూ గో ట్రావెల్స్ సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పర్యావరణహితమైన రవాణా సదుపాయాన్ని అందజేసే ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందజేయనున్నాయి. ఈ బస్సులో ప్రయాణికులకు పటిష్టమైన భద్రతతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. ప్రీమియం సర్వీసులు ఉంటాయి. చార్జీలు రూ.399 నుంచి ప్రారంభమవుతాయి. టికెట్ బుకింగ్ కోసం న్యూ గో వెబ్‌సైట్, న్యూగో మొబైల్ యాప్ సేవలను వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు.

నిండుకుండలా హుస్సేన్‌సాగర్

- ట్యాంక్‌బండ్‌కు భారీగా చేరుతున్న వరద నీరు
- పూర్తిస్థాయి నీటి మట్టం 513.14 అడుగులు



హుస్సేన్ సాగర్ తూముల్లోంచి నీటి విడుదల..

కవాడిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షానికి ట్యాంక్‌బండ్‌కు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో అధికారులు నాలుగు తూముల నుంచి మూసీలోకి నీరు వదులుతున్నారు. హుస్సేన్‌సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి 9 కాలువల ద్వారా భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో నాలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయితే నాలా పరిసర ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నగరంలో ఇటీవల కురిసిన వర్షాలతో సాగర్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో నాలా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నీటి ప్రవాహాన్ని అంచనా వేసుకొని స్థానికులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. హుస్సేన్‌సాగర్‌కు ఎగువనున్న కూకట్‌పల్లి, పంజగుట్ట, బేగంపేట్, సికింద్రాబాద్ నాలాల నుంచి వరద ఎక్కువగా వచ్చి చేరుతోంది.

రిటెయినింగ్ వాల్ పూర్తి చేస్తాం

హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక ప్రాంతంలో రిటెయినింగ్ వాల్ మొత్తం పూర్తి చేశాం. గాంధీనగర్ డివిజన్ పరిధిలోని సబర్మతి నగర్ వద్ద జలమండలి అధికారులు ఆలస్యంగా పైప్‌లైన్ పనులు పూర్తి చేయడంతో 3.7 మీటర్ల పొడవు వాల్ నిర్మాణం ఆగిపోయింది. నాలాలో వరద ఉధృతి తగ్గిన వెంటనే ఆ పనులను పూర్తి చేస్తాం.
– శ్యామ్‌సుందర్, ఇరిగేషన్ ఏఈ

స్థానికులు ఇబ్బంది పడుతున్నారు



బడ్జెట్ సమస్యతో అక్కడక్కడా రిటెయినింగ్ వాల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వర్షాకాలంలో నాలా ఉధృతి పెరగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లక్ష్మి అనే స్థానికురాలు ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతి చెందింది. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారిం పనులను పూర్తి చేయాలి. – కార్పొరేటర్ రచనశ్రీ



హుస్సేన్‌సాగర్‌లో పెరిగిన నీటమట్టం

విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


బీటెక్ ఒరియెంటేషన్ ప్రోగ్రాంలో అతిథులు..

బంజారాహిల్స్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తదితర అధునాతన కోర్సుల్లో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దడమే కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ లక్ష్యమని వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ అన్నారు. మంగళవారం కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీలో 2024–25 విద్యా సంవత్సరాన్ని బీటెక్ ఒరియెంటేషన్ ప్రోగ్రాంతో ఉత్సాహంగా ప్రారంభించించారు. ఈ కార్యక్రమంలో పాఠ్యాంశాల విధానం, ఎంపిక చేసుకున్న కోర్సుల వివరాలు, విద్యాపరమైన విషయాలను నిపుణుల బృందం వివరించింది. బోధనా సిబ్బందితో విద్యార్థులు మమేకమై తరగతుల నిర్వహణ, యూని వర్శిటీలోని వివిధ క్లబ్‌లు, కార్యకలాపాలు, విధి విధానాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిమెన్స్ ఈడీఏ ఇండియా సీనియర్ హ్యూమన్ రీసోర్స్ మేనేజర్ ప్రగతి ఠాకూర్, జేపీ మోర్గాన్ చేజ్ వైస్ ప్రెసిడెంట్ మురళి సాయి సందీప్‌లు అతిథులుగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించి స్ఫూర్తిని నింపారు. అనంతరం వర్శిటీ వైస్ ఛాన్సలర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ కేవలం విద్యను అందించడమే కాకుండా ఆవిష్కరణల దిశగా ప్రోత్సాహం అందించి స్ఫూర్తినిచ్చే నాయకులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఎల్.కోటేశ్వరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే జీవరాశుల మనుగడ


హరితధార కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న ధారాసింగ్

బంజారాహిల్స్: మొక్కల పెంపకంతోనే జీవరాశుల మనుగడ ఆధారపడి ఉందని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్ అన్నారు. మంగళవారం సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో హరితధార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ కొందరు మొక్కలు నాటిన తరువాత వాటి సంరక్షణ మర్చిపోతున్నారని అన్నారు. తమ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది తమ జోన్ పరిధిలో ఒక్కో బ్రాంచీ తరఫున అయిదు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తమవి 326 బ్రాంచీలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కేబీఆర్ పార్కులో 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు సత్యవాణి, గుల్షన్ కుమార్, చీఫ్ మేనేజర్ ఎ. యెతేంద్ర, పార్కు అధికారి మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌ను గుర్తించడంలో 'ఏఐ' పాత్ర అద్భుతం

అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్ గీతిక వకాటి

సాక్షి, సిటీబ్యూరో: రొమ్ము కేన్సర్‌ను గుర్తించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అద్భుతమని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) కన్సల్టెంట్, బ్రెస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్ గీతిక వకాటి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఆవిష్కరణలు ఎందరో ప్రాణాలను కాపాడటంలో సాయపడుతున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ మామ్మోగ్రఫీ ప్రాథమిక స్థాయిలో గుర్తించేదుకు అవకాశం ఉంటుందని, అయితే ఏఐ వచ్చాక అత్యంత కచ్చితత్వంతో కేన్సర్లను గుర్తిస్తుందని వివరించారు. త్రీడీ మామ్మోగ్రఫీ లేదా టోమోసింథసిస్ చిత్రాలను ఏఐ మరింత లోతుగా చిత్రాలను విశ్లేషించడంలో రేడియాలజిస్టులకు సాయం చేస్తుందని చెప్పారు. రొమ్ము కేన్సర్‌ను గుర్తించడంతో పాటు చికిత్సలో కూడా ఏఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

లిబర్టీ: విద్యావంతులైన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలు తక్కువ ఉన్నందున స్వయంగా ఉపాధిపై జీవనం సాగించేందుకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి చేయూతనివ్వాలని విన్నవించారు. లిబర్టీ ప్లాజాలోని యువజన సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివిన ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని రోడ్లపైకి వచ్చి ఆందోళన నిర్వహిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఉపాధి మార్గాల కోసం వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విన్నవించారు.

సమస్యల పరిష్కారానికే సమీక్ష సమావేశాలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్


సమీక్ష సమావేశంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

రహమత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే అధికారులతో సమస్యల శంఖారావం సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. బోరబండ డివిజన్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ కమ్యూనిటీ హాల్లో డివిజన్ సమస్యలపై మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మంచినీరు, డ్రైనేజీ సమస్యలు సమావేశంలో తమ దృష్టికి వచ్చాయని వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సమీక్ష సమావేశంలో వచ్చిన ఫిర్యాదులపై తాను ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. సమస్యలపై మరోమారు సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు అరాచకాలను అడ్డుకుంటాం : ఎమ్మెల్యే గోపీనాథ్

కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలను అడ్డుకుంటామని ఎమ్మెల్యే గోపీనాథ్ అన్నారు. తాము పది ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏలాంటి దౌర్జన్యాలు చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు కేసులు పెట్టిస్తు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. సమీక్ష సమావేశానికి రావాలని ముందుగానే సర్కిల్ 19 అధికారులు సమాచారం అందించామని, కానీ కేవలం బోరబండ డివిజన్ అభివృద్ధిపై మేయర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, తాను ఏర్పాటు చేసిన సమావేశానికి రాకుండా చేయడాన్ని ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

బీమా పాలసీల పేరుతో సైబర్ మోసాలు

ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

హిమాయత్‌నగర్: సైబర్ ముఠాకు బ్యాంకు ఖాతాలు సప్లయ్ చేస్తూ వారికి సహకరిస్తున్న నిందితున్ని నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత తెలిపిన వివరాల ప్రకారం... పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, భారతీ యాక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో సైబర్ మోసగాళ్లు ఆ కంపెనీలకు ప్రతినిధులుగా పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఇన్సూరెన్స్ పేరిట వివిధ చార్జీల పేరుతో రూ. 45,78,760లను కాజేశారని రిటైర్డ్ ఉద్యోగిని షబ్నం భక్షి (72) నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు వైద్యులు, సాఫ్ట్‌వేర్, ఇంజినీరు, రిటైర్డు ఉద్యోగుల డేటా సేకరించి వారికి సంబంధించిన ఖాతాలు సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న రాజస్థాన్‌కు చెందిన తరుణ్ సచ్‌దేవా అనే నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి ఒక చెక్‌బుక్, 2 వివిధ బ్యాంకు ఖాతాల పాస్‌బుక్స్, ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు.

చలానా నుంచి తప్పించుకునేందుకు నకిలీ నెంబర్ ప్లేట్

బంజారాహిల్స్: ట్రాఫిక్ చలానా నుంచి తప్పించుకునేందుకు ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనానికి నకిలీ నెంబర్ ప్లేట్ మార్చి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మార్చి 23న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతుండగా వాహనంపై వెళుతున్న నితిన్‌ను ఆపి శ్వాస పరీక్ష చేయగా బీఏసి 107 అని వచ్చింది. దీంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని నితిన్‌కు కౌన్సెలింగ్‌తో పాటు కోర్టులో హాజరుకావాలని సూచించారు. ఆ తరువాత నితిన్ స్పందించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వాహన నెంబర్ ద్వారా యజమానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అది నకిలీదని తేలింది. ఇదిలా ఉండగా నల్గొండ జిల్లాకు చెందిన సురిమిత్తి శివాజీ రెండు రోజుల క్రితం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు వచ్చి వాహనం తనదేనని చెప్పాడు. స్నేహితుడైన నితిన్‌కు ఇచ్చినట్టు వెల్లడించాడు. కాగా పోలీసులు నకిలీ నంబర్ ప్లేట్ గురించి అతన్ని ప్రశ్నించగా ట్రాఫిక్ చలానా నుంచి తప్పించుకునేందుకు తానే అలా మార్చినట్టు ఒప్పుకున్నాడు. ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని, శివాజీని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మట్టిని ఎత్తేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది..


భారీ వర్షానికి పేరుకపోయిన వ్యర్థాలు

ముంపు తిప్పలు..!

- మట్టి, రాళ్లు, వ్యర్థాలతో స్థానికులకు ఇబ్బందులు
- పేరుకపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

వరద వచ్చిన వెళ్లిన అది తీసుకొచ్చిన తిప్పలు మాత్రం ఇంకా వీడలేదు. గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు వరదకు లోనయ్యాయి. దీంతో వరద వల్ల బురద, ప్లాస్టిక్ ఇతరత్రా వ్యర్థాలు బాగా పేరుకపోయాయి. అసలే వర్షాకాలం కావడం వ్యర్థాలు, చెత్తాచెదారంతో దోమల వ్యాప్తి చెంది ఎక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వరదకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారం

బంజారాహిల్స్: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయం కాగా వరదనీరు వెళ్లలేని ప్రాంతాల్లో రోడ్లపై బురద పేరుకుపోయింది. దీంతో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలోని సర్కిల్–17, 18 పరిధిలోని స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నిలిచిన ప్రాంతాల్లో బురదతో పాటు వ్యర్థాలు కొట్టుకువచ్చి రోడ్ల పక్కన నిలిచిపోయాయి. దీనికి తోడు భవన నిర్మాణ వ్యర్థాలు, ఇసుక, మట్టి, సిమెంట్, రాళ్లు కూడా పెద్ద ఎత్తున రోడ్లపై కొట్టుకువచ్చి మ్యాన్‌హోళ్ల వద్ద భారీగా పేరుకుపోయాయి. రోడ్లకు రెండువైపులా మట్టి పేరుకుపోవడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది దానిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. వరదలతో భారీగా కొట్టుకువచ్చిన మట్టితో బురద పేరుకుపోవడంతో రెండు రోజుల నుంచి జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడికక్కడే ఎత్తేస్తున్నారు. అయితే పెద్ద ఎత్తున పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించడానికి ఇంకా వారం రోజుల సమయం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, వెంకటేశ్వర కాలనీ, చింతల్‌బస్తీ, పంజగుట్ట, ఖైరతాబాద్, శ్రీనగర్‌కాలనీ, అమీర్‌పేట, శ్రీకృష్ణానగర్, ఇందిరానగర్, వెంకటగిరి, జర్నలిస్టుకాలనీ తదితర ప్రాంతాలన్నీ రోడ్ల పక్కన బురదతో, మట్టితో స్థానికులకు నరకాన్ని చవిచూస్తున్నారు. జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పేరుకుపోయిన మట్టి, ఇసుక, రాళ్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ జర్నలిస్ట్ కరుణాకర్ మృతి

సంతాపం తెలిపిన దళిత సంఘాలు, జర్నలిస్టులు



లక్డీకాపూల్: నిమ్స్‌లో మూడు రోజులుగా అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ మల్లెల కర్ణాకర్ కన్నుమూశారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లెల గోవర్ధన్ (గోపి) సోదరుడైన కరుణాకర్ కొంత కాలంపాటు విలేఖరిగా పనిచేశారు. మల్లెల కర్ణాకర్ మృతికి నాగర్ కర్నూల్ దళిత సంఘాలు, పలువురు జర్నలిస్టులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కరుణాకర్ మృతికి నివాళులర్పించిన వారిలో అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి, గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సీ.యల్. యాదగిరి, జర్నలిస్టుల ప్రతినిధి రఘు తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... మంగళవారం స్థానిక ఆల్‌సబా హోటల్ దగ్గరలో సుమారు 45 వయస్సు ఉన్న వ్యక్తి పడిపోయి ఉండటంతో స్థానికులు మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి అతనిని 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలియజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బంజారాహిల్స్: బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌కు చెందిన సయ్యద్ సిద్దిఖీ రేషన్ షాపులో నుంచి బియ్యం తీసుకువచ్చి వాటిని అధిక ధరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ రాంబాబు తన సిబ్బందితో దాడి చేసి సిద్దిఖీని అదుపులోకి తీసుకున్నాడు. అతని ఇంట్లో ఉన్న యాభై వేల రూపాయలు విలువ చేసే 2,015 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌బాటిల్‌లో నీరు పట్టినందుకు దాడి

బంజారాహిల్స్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మందులు వేసుకునేందుకు మెట్రో స్టేషన్లో వాటర్ బాటిల్లో నీరు పట్టుకుంటుండగా భద్రత సిబ్బంది అతనిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారాసిగూడకు చెందిన తందూరి సాయి ప్రసన్న ప్రైవేటు ఉద్యోగి. ఆయన పని మీద ఈ నెల 15న మాదాపూర్‌కు మెట్రో రైలులో వచ్చాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముందులు వేసుకునేందుకు వాటర్ బాటిల్‌లో నీరు పట్టుకుంటుండగా సెక్యూరిటీ సూపర్వైజర్ వచ్చి అడ్డుకుని నీరు తాగేందుకు గ్లాసు మాత్రమే వాడాలని దాడిచేసి లాప్‌టాప్‌ను పగులగొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల పొట్టకొట్టొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు


వెంగళరావునగర్: విద్యుత్ కార్మికుల పొట్టగొట్టే ప్రైవేటీకరణ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, ఈ శాఖను ప్రైవేటుపరం చేస్తే వేలాది మంది కష్టాలను ఎదుర్కొవాల్సి ఉంటుందని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నాయకులు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు రాష్ట్ర నాయకులు తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేశారు. విద్యుత్ రంగంలో దాదాపు 29 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ కార్యాలయాల్లో సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, పోల్‌టుపోల్ కార్మికులు, ఫీల్డ్ వర్కర్లు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కొంతమంది ఆర్టిజన్లను రెగ్యులైజ్ చేసి వారికి రెండు రూల్స్ పెట్టిందని, ఉద్యోగులను విడదీసే విధంగా ఉన్న రెండు విధానాలను తొలగించి ఒకటి మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. మీటర్ రీడర్స్, స్టోర్ కీపర్లను సైతం రెగ్యులైజ్ చేయాలని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్ళనున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి కె.లింగం, స్టేట్ మీటర్ రీడర్స్ కోశాధికారి ఏ.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ రాజు, వసంత తదితర యూనియన్ నేతలు పాల్గొన్నారు.

దుండిగల్ డీఆర్‌డీఓ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఫ్యూచర్ డిజికేర్ ఎండీ నాగళ్ళ విజయ్‌కుమార్

శ్రీనగర్‌కాలనీ: దుండిగల్ డీఆర్‌డీఓ డైరెక్టర్ శివప్రసాద్ అక్రమాలు, అధికార దుర్వినియోగంపై కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ డిజికేర్ ఎండీ నాగళ్ళ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యూచర్ డిజికేర్ సంస్థ ఎండీగా ఉన్నానని తమ సంస్థ ద్వారా డ్రైవ్ 9 అనే నానో ద్రావణాన్ని కనిపెట్టామన్నారు. ఈ నానో ద్రావణం వాహనాన్లలోకి ఇంజక్షన్ ద్వారా పంపిస్తే ఎక్కువ మైలేజీతోపాటు వాహన కాలుష్యం తగ్గిస్తూ పర్యావరణాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని డీఆర్‌డీఓ డైరెక్టర్‌కి తెలుపగా నానో ఆవిష్కరణకు మంత్రముగ్ధులైన ఆయన కేంద్రం ఇటువంటి వాటికి భారీ మొత్తంలో నిధులను విడుదల చేస్తుందని, సుమారు 100 కోట్ల ఆర్డర్‌ను ఇప్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి తన చెల్లి, బావను తన కంపెనీలో డైరెక్టర్స్‌గా నియమించాడని తెలిపారు. ఇలా తన ఆవిష్కరణను బయటకు రానివ్వకుండా అంతేకాకుండా తన అక్రమ సంపాదనను తన కంపెనీలో పెట్టి తన బినామీలకు అండగా ఉండాలని భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన చేసిన అక్రమాలపై తన దగ్గర ఆధారాలున్నాయన్నారు. ఈ విషయమై ఇప్పటికే కేంద్ర విజిలెన్స్, సీబీఐ, డిఫెన్స్‌లకు ఫిర్యాదు చేశామని, మియాపూర్ పోలీసులు కేసు స్వీకరించ లేదని చెప్పారు. డీఆర్‌డీఓ డైరెక్టర్ శివప్రసాద్ చేసే గూఢచర్య పనులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

కులమతాలకు అతీతంగా మొహర్రం


మొక్కులు చెల్లించుకుంటున్న కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్

రహమత్‌నగర్: కులమతాలకు అతీతంగా మొహర్రంను నిర్వహించడం జరుగుతుందని మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ అన్నారు. మొహర్రం సందర్భంగా బాబా ఫసీయుద్దీన్ మంగళవారం పీర్లకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా పీర్ల పండుగను ఎంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, పండుగలో కులమతాలకు అతీతంగా పాల్గొంటున్నారన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహ, మహేష్ గౌడ్, ఇమ్రాన్‌తో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు మాయం

వెంగళరావునగర్ : సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉంచిన ల్యాప్‌టాప్‌లు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడలో ఉంటూ మధురానగర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం గుర్తు తెలియని 25 ఏళ్ళ యువకుడు తాను పనిచేసే కార్యాలయం బిల్డింగ్‌లో 3వ అంతస్తుకు వెళ్ళి తాను మూగ, చెవుడు అని చెప్పగా వారు కిందకు పంపారు. తిరిగి వస్తూ రెండో అంతస్తులో తలుపు పక్కన ఉంచిన రెండు ల్యాప్‌టాప్‌లను పట్టుకెళ్ళాడు. రాజశేఖర్ రెడ్డి వచ్చి చూసేసరికి తన ల్యాప్‌టాప్‌లు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవటంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీలో బోనాల వేడుక


ఎల్లమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్: బోనాల వేడుకలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మంగళవారం ఆవరణలో కొలువుదీరిన శ్రీఎల్లమ్మ తల్లి సన్నిధిలో బోనాల పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. లక్ష్మణ్‌నాయక్ అమ్మవారికి జరిగిన విశేష పూజల్లో పాల్గొని బోనాల విశిష్టతను వివరించారు. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నవనీత, వెంకటరమణ (హాస్టల్స్), అకాడమిక్ కో–ఆర్డినేటర్ మీనాక్షి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణ, మేనేజర్ శ్రీనివాస్, ఎన్‌జీఓ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, శంకరయ్య, శంకర్‌నాయక్, రాకేష్, ఘుమ్రాన్, భీమయ్య, వెంకట్, నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు. దేవాలయం వద్ద విరాళంగా షెడ్డును నిర్మించిన బిల్డర్ సాగర్‌కు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

19 నుంచి సిల్క్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహరా

బంజారాహిల్స్: బెంగాల్ ఆర్ట్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సిల్క్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమనాథ్, అభిజిత్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీ సిల్వాన్ డ్రైవ్ ఇన్‌లో సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహరాతో పాటు పలువురు మోడల్స్ పాల్గొని కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో 50 మందికి పైగా మాస్టర్ వీవర్స్ చేతితో నేసిన వస్త్ర ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. చేనేత ఉత్పత్తులతో పాటు హస్తకళల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు షూస్ అందజేత


విద్యార్థులకు షూస్‌లను అందజేస్తున్న నాయకులు

ఖైరతాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో మొదటి విడతగా 300 మంది విద్యార్థులకు ఉచితంగా షూస్‌లను అందజేశారు. సోమవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ యాదవ్, మహేందర్‌బాబు, సురేందర్ ముదిరాజ్, వి.ప్రవీణ్, శ్యాంకుమార్, శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. గత నెల శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇచ్చిన మాట ప్రకారం ఖైరతాబాద్‌లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 800 మంది విద్యార్థులు షూస్ అందజేస్తానని చెప్పిన మేరకు మొదటి విడతగా 300 మందికి అందజేశారు. మరో వారం రోజుల్లో మిగతా వారికి అందజేస్తామని తెలిపారు.

మట్టి వ్యర్థాలు తరలించాలని వినతి


వెంగల్ రావు పార్కు పార్కింగ్ స్థలంలో కుప్పలుగా పోసిన మట్టి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని జలగం వెంగల్‌రావు పార్కు పార్కింగ్ స్థలంలో మట్టి వ్యర్థాలు పోశారని దీంతో స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థాల వల్ల రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని, దోమల వల్ల ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంగల్‌రావు పార్కులో చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వెలువడిన వ్యర్థాలను పార్కింగ్ స్థలంలో పెద్ద ఎత్తున గుట్టలుగా పోశారన్నారు. కొన్ని రోజుల క్రితం ఇక్కడ పర్యటనకు వచ్చిన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి సైతం విషయాన్ని వివరించగా వెంటనే ఈ వ్యర్థాలను వెంటనే తరలించాలని అధికారులను ఆదేశించినా వ్యర్థాల తరలించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యర్థాలను తరలించాలని కోరారు.

'నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్, కేటీఆర్‌కు లేదు'

లిబర్టీ: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలకు ఎందరో నిరుద్యోగులు, అమాయకులు బలైపోయారని, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు లేదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల ఉసురుపోసుకున్న బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత పది ఏండ్లలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పదేండ్ల పాలనలో కనీసం డీఎస్సీ నోటిఫికేషన్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ఎందుకు ప్రకటించలేదని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని లేకపోతే భవిష్యత్తులో ప్రజలు మిమ్మల్ని నమ్మరని ఆయన అన్నారు.

రా రైస్ మిల్లులు మూతపడే పరిస్థితి

- సమస్యలు పరిష్కరించాలంటూ మిల్లర్ల వినతి



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 535 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 116 అర్జీలున్నాయి. పౌరసరఫరాల శాఖ సమస్య 88, విద్యుత్ శాఖ 62, హౌసింగ్ 57, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 36, ఇతర శాఖలకు సంబంధించి 176 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రైస్ మిల్లు వ్యవస్థను కాపాడాలని బాధిత రైస్ మిల్లర్లు ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రజాభవన్ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రా రైస్ మిల్లులు మూతపడే ప్రమాదం ఏర్పడిందన్నారు. కరోనా కాలంలో బియ్యం సార్టెక్స్ టెస్ట్ చేసిన తర్వాత మాత్రమే ఎఫ్‌సీఐ తీసుకుంటుందని, దాని వల్ల తమకు పెట్టుబడి భారం, వడ్డీ, తరుగు భారం ఎక్కువై చాలా రైస్ మిల్లులు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మంత్రి సీరియస్

సాక్షి, సిటీబ్యూరో: వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు స్పందించకపోవడంపై ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల చుట్టూ ఉన్న ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములను కబ్జాదారులు చెరబట్టిన విషయాన్ని సీరియస్ తీసుకున్నారు. ఈ మేరకు ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్‌మెంటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లకు మంత్రి లేఖ రాశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఖానామెట్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 41/14లోని 252.24 ఎకరాల భూమి ఉండగా 2008లో అప్పటి ప్రభుత్వం 180.13 ఎకరాలను హుడా(ప్రస్తుత హెచ్‌ఎండీఏ)కు కేటాయించిందని, అందులో నుంచి 75 ఎకరాలను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ప్రస్తుత టీజీఐఐసీ)కు హుడా బదిలీ చేసిందని పేర్కొన్నారు. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టీజీఐఐసీ యాజమాన్యంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని మంత్రి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని 100, 101 సర్వే నంబర్లలోని 100 ఎకరాల భూమిపై కబ్జా యత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆక్రమణల సమాచారం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొత్త నైపుణ్యాలు నేర్చుకోండి

- పీఆర్ నిపుణులకు వోక్సెన్ వర్సిటీ డీన్ జోషువా పిలుపు



పీఆర్ వాయిస్ మ్యాగజైన్ సంచికను విడుదల చేస్తూ..

లక్డీకాపూల్: అనూహ్య వేగంతో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్స్ వృత్తి నిపుణులు కొత్త నైపుణ్యాలు సాధించి రాణించాలని వోక్సెన్ యూనివర్సిటీ లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ జోషువా డాల్రింపిల్ అన్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఎస్‌ఎమ్‌డీసీ సౌజన్యంతో ఆ సంస్థ కేంద్ర కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ మంగళవారం నిర్వహించిన ప్రపంచ పీఆర్‌డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జాషువా మాట్లాడుతూ.. మనందరం ఇప్పుడు ఒక సమాచార సునామీ మధ్యలో చిక్కుకుని ఉన్నామని, అందులో భాగంగా తప్పుడు సమాచారం, ఫేక్ న్యూస్ రూపంలో ఉన్న ప్రమాదకరమైన షార్క్స్ కూడా భీతిగొల్పుతున్నాయన్నారు. అందుకే సంస్థల్లో పీఆర్, లీగల్ ఫ్రేమ్ వర్క్‌ల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు. పబ్లిక్ రిలేషన్స్ డే వేడుకల్లో పీఆర్, కమ్యూనికేషన్ ప్రొఫెషనల్స్, జర్నలిజం టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ వృత్తిలో ఉన్న వారికి ఉద్దేశించిన ప్రొఫెషనల్ మ్యాగజైన్ పీఆర్ వాయిస్ 70వ సంచికను విడుదల చేశారు. పీఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, ఎస్‌ఎమ్‌డీసీ కార్పొరేట్ కమ్యూనికేషన్ అధిపతి జయప్రకాశ్, మ్యాగజైన్ ఎడిటర్, ప్రాక్టీసింగ్ అడ్వొకేట్ వై.బాబ్జి పాల్గొన్నారు.

హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రవాణా అవసరాలపై హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. ఈ మేరకు ఉమ్టా(యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టారు. వినియోగంలో ఉన్న ప్రజా, ప్రైవేట్, వ్యక్తిగత రవాణా సదుపాయాలపై అధ్యయనం చేసి 2050 నాటికి అవసరమైన రహదారుల విస్తరణ, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని ఉమ్టా ప్రణాళికలను రూపొందించనుంది. ఇందుకోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ లీ అసోసియేట్స్‌కు బాధ్యతలను అప్పగించారు. – సాక్షి, సిటీబ్యూరో



టార్గెట్.. 2050

సమగ్ర రవాణా ప్రణాళికపై కదలిక

- జాతీయ పట్టణ రవాణా ప్రణాళికకు అనుసంధానం
- 2050 నాటికి అనుగుణంగా కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్
- ఉమ్టా ఆధ్వర్యంలో కార్యాచరణ
- లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభం

ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. భవిష్యత్తులో ఈ పరిధి 10 వేల చదరపు కిలోమీటర్లకు పైగా పెరగనుంది. అలాగే నగర జనాభా కూడా 3 కోట్లు దాటవచ్చని అంచనా.., ఈ మేరకు ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)ను రూపొందించనున్నారు. ఇది జాతీయ పట్టణ రవాణా విధానం(నేషనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ)కి అనుసంధానంగా ఉంటుందని ఉమ్టా అధికారులు తెలిపారు. ఇందుకోసం హెచ్‌ఎండీఏ పరిధిలో 10 వేల కుటుంబాల రవాణా అవసరాలను ప్రామాణికంగా తీసుకొని సర్వే నిర్వహించనున్నారు. అలాగే ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ ప్రయాణికుల నుంచి కూడా అభిప్రాయాలను సేకరించి కామన్ మొబిలిటీ ప్లాన్‌పై 2025 మార్చి నాటికి డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను సిద్ధం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ డీపీఆర్ ఆధారంగా హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ మౌలిక, ప్రజారవాణా సదుపాయాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటాయి. ఏయే ప్రాంతాల్లో వ్యక్తిగత వాహనాల వినియోగం ఎలా ఉంది, ఆ ప్రాంతాల్లో ఏ విధమైన ప్రజారవాణా సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉందనే అంశాలను లీ అసోసియేట్స్ రూపొందించే డీపీఆర్‌లో తెలియజేస్తారు. అలాగే కొత్త రోడ్లు, ఫ్లైఓవర్లు, జంక్షన్‌ల విస్తరణ వంటి అవసరాలపై ఈ అధ్యయనం తగిన సూచనలు, సలహాలు అందజేయనుంది.



మీ అవసరాలేంటీ..?

- లీ అసోసియేట్స్ వివిధ ప్రాంతాల్లో మొత్తం 10 వేల కుటుంబాలను నమూనాగా తీసుకొని సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వేలో ప్రస్తుతం వారు ఏ రకమైన రవాణా సదుపాయాలను వినియోగిస్తున్నారు.. భవిష్యత్తులో ఏ విధమైన సదుపాయాలు అవసరమనే వివరాలను సేకరిస్తారు.
- వ్యక్తిగత వాహనాల వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎంఎంటీఎస్, మెట్రో, సిటీ బస్సుల్లో ఏ రకమైన సదుపాయాలను విస్తరిస్తే బాగుంటుందనే అంశంపైన ఈ అధ్యయనం దృష్టి సారిస్తుంది.

రవాణా సదుపాయాల పెంపు..

బెంగళూరు వంటి నగరాల్లో సుమారు 6,000కు పైగా సిటీ బస్సులు ఉంటే గ్రేటర్‌లో హైదరాబాద్‌లో వీటి సంఖ్య 3 వేల లోపే ఉంది. ఈ క్రమంలో సిటీ అవసరాల కోసం ఎన్ని బస్సులను అదనంగా పెంచాల్సి ఉందనేది ఈ అధ్యయనం స్పష్టం చేస్తుంది. ప్రస్తుతం 78 ఎంఎంటీఎస్ సర్వీసులు ఉన్నాయి. అలాగే మెట్రో రైళ్లు మూడు కోచ్‌లలోనే నడుస్తున్నాయి. ఎంఎంటీఎస్ సర్వీసుల పెంపు, మెట్రో కోచ్‌ల పెంపు అవసరాలను కూడా లీ సమర్పించే డీపీఆర్‌లో తెలియజేస్తారని అధికారులు తెలిపారు.

లాస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రధానం..

నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ మధ్య ప్రస్తుతం మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల నగరవాసులు మెట్రో సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. మెట్రోకు 5 కిలోమీటర్ల పరిధిలో ఫీడర్ చానల్స్ ఏర్పాటు చేయాలి. ఏ మెట్రో స్టేషన్ నుంచైనా సరే ప్రయాణికులు 5 కిలోమీటర్ల పరిధిలో ఈజీగా మెట్రోకు చేరుకునేవిధంగా నాన్ మోటరైజ్డ్ వాహనాలను సదుపాయాలను అందుబాటులోకి తేవాలనే ప్రతిపాదన కూడా ఉంది.

- ప్రస్తుతం సిటీ బస్సులు ఎక్కువగా వినియోగిస్తున్న ప్రాంతాల్లో రోజుకు ఎన్ని ట్రిప్పులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ట్రిప్పులు, బస్సుల సంఖ్యను ఏ మేరకు పెంచాల్సి ఉంటుందనే అంశంపై స్పష్టత రానుంది.
- అలాగే నిర్ణీత వేళల ప్రకారం బస్సులు రాకపోకలు సాగించకపోవడానికి కారణాలేంటి, బస్సులు ఎందుకు ఆలస్యంగా నడుస్తున్నాయనే అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆ ప్రాంతాల్లో నెలకొనే ట్రాఫిక్ రద్దీ, వాహనాల సంఖ్యపైన ఈ అధ్యయనం విశ్లేషించనుంది.
- ట్రాఫిక్ రద్దీకి కారణాలను కూడా ఈ నివేదికలో పొందుపరుస్తారు. కొన్ని చోట్ల వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటే మరి కొన్ని చోట్ల సెవెన్ సీటర్ ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల వల్ల రద్దీ ఉండవచ్చు. ఇరుకైన రోడ్లు, జంక్షన్ల వల్ల రద్దీ ఉత్పన్నం కావచ్చు. ఈ అంశాలపైన సీఎంపీలో ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నారు.

పార్కింగ్ సదుపాయాల పెంపు..

- కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్‌లో భాగంగా వాహనాల పార్కింగ్‌పై కూడా దిశానిర్దేశం చేయనున్నారు. చాలాచోట్ల సరైన పార్కింగ్ సదుపాయాలు లేకపోవడం వల్లే ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. కొన్ని చోట్ల పార్కింగ్ స్థలాలు ఉన్నప్పటికీ సరైన వినియోగం లేదు. అలాగే నగర విస్తరణకు అనుగుణంగా ఎక్కడెక్కడ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలనేది కూడా ఈ అధ్యయనంలో భాగం కానుంది.

నగరంలో నేడు

- పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ జి.పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు రవీంద్రభారతిలో కాకతీయ పార్ట్-3 నృత్య ప్రదర్శన జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు.
- హైదరాబాద్ సినీఫిల్స్ ఆధ్వర్యంలో ప్రిసనర్స్ ఆఫ్ కాన్సెన్స్‌పై స్క్రీనింగ్ అండ్ డిస్కషన్ సాయంత్రం 5 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో జరుగుతుంది.
- హైదరాబాద్ మాన్‌సూన్ రేసెస్-2024పై మలక్‌పేట్‌లోని హైదరాబాద్ రేస్ క్లబ్‌లో రాత్రి 7 గంటలకు సమావేశం జరుగుతుంది.
- ఏపీ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం సదస్సు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో గురువారం సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కానుంది. 21వ తేదీ వరకు నిత్యం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7గంటల వరకు ఉంటుంది.
- శిల్పారామం ఆంపి థియేటర్‌లో శనివారం గురువందనం కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శన జరగనుంది. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈ నెల 21న గురుదక్షిణ పేరిట కథక్ నృత్య ప్రదర్శన ప్రదర్శించనున్నారు.

కార్యాలయాల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టాలి

అమీర్‌పేట: ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డితో సమానంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోలు పెట్టాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన నివాసంలో తెలంగాణ నిరుద్యోగుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీని రద్దు చేయాలని 10 రోజులుగా నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్‌ను కాదని రేవంత్‌రెడ్డిని సీఎం చేసింది ఇందు కోసమేనా అని మండిపడ్డారు. కేవలం ఉచిత బస్సు తప్ప ఏ పథకం అమలు కావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి నేటి వరకు 30సార్లు ఢిల్లీ ప్రయాణాలు చేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు.

నిమ్స్‌లో పేరుకుపోయిన బకాయిలు

- 40 మంది మెడికల్ సప్లయర్లు.. రూ.20 కోట్ల బకాయిలు
- బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించిన డైరెక్టర్ డా.బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్‌లో మెడికల్ సప్లయర్లకు చెల్లించాల్సిన బకాయిలు కోట్ల మేర పేరుకుపోయాయి. ఆస్పత్రికి రోగుల ప్రయోజనార్థం ఏళ్ల తరబడి రేట్ కాంట్రాక్టర్లు ఫార్మా, సర్జికల్ విభాగాలకు సంబంధించి సరఫరా చేస్తుంటారు. ఇందుకు యాజమాన్యం సర్జికల్, జనరల్ మెడికల్ స్టోర్లను ఏర్పాటు చేసింది. ఆయా స్టోర్లకు సంబంధించి యాజమాన్యం నిర్ణీత కాంట్రాక్టర్లు అవసరం మేరకు శస్త్ర చికిత్సల నిర్వాహణకు సంబంధించినవే కాకుండా జనరల్ మెడిసిన్(మందులు)ను కూడా సరఫరా చేస్తుంటారు. ఇందుకు దాదాపు 40 మంది వరకు మెడికల్ సప్లయర్లు ఉన్నారు. వీరందరికీ యాజమాన్యం నిర్ణీత వ్యవధిలో బిల్లులు చెల్లించాలి. కానీ ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా కాంట్రాక్టర్లు తమ నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ఆస్పత్రిలో యాజమాన్య వైఖరి పట్ల పలువురు సర్జికల్, ఫార్మా సంబంధించిన సరఫరాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత వ్యవధిలో బిల్లులు చెల్లించకపోవడంతో తాము డీలర్లకు పెద్ద మొత్తంలో బకాయిలు పడిపోతున్నామని, దాంతో పాటు తాము సకాలంలో నిమ్స్ ఇండెంట్‌ను సరఫరా చేయలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించి కోట్లలో పేరుకుపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆస్పత్రికి సంబంధించి అన్ని విభాగాల అవసరాల మేరకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరిగినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. అయితే అంతకు ముందే ఆస్పత్రి వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివరించాల్సిన గురుతరబాధ్యత నిమ్స్ యాజమాన్యంపై ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొంటున్నారు.

బీఆర్‌ఎస్ తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయ్

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, సిటీబ్యూరో: బీజేపీలో విలీనమా? పొత్తునా? బీఆర్‌ఎస్ స్పష్టత ఇస్తే బాగుంటుందని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రధాన రెండు ఆంగ్ల దినపత్రికల్లో బీఆర్‌ఎస్‌పై ప్రముఖంగా వార్తలు వచ్చాయని, ఆ పార్టీ నేత వినోద్ సైతం రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చని పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తున్నాయన్నారు. తనకు మాత్రం తెలియదని, బీఆర్‌ఎస్‌నే అడగాలని సూచించారు. 2008లోనే తెలంగాణ ఏర్పడితే బీజేపీ బలపడుతుందని చెప్పానని, అదే జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటైంది, అభివృద్ధి జరిగింది, ఇంకా బలహీనంగా ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌లోని దోడాలో ఉగ్రవాదులతో జరిగిన ఘటనను ఆయన ఖండించారు. సైనికులు ప్రాణాలు కోల్పోతుంటే మోదీ ప్రభుత్వం ఏంచేస్తోందని దుయ్యబట్టారు. కాషాయ పాలకులు ఉగ్రవాదాన్ని నియంత్రించలేకపోతున్నారని విమర్శించారు. మహారాష్ట్రలో డిసెంబర్ 6 ఘటనలు పునరావృతం అవుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు.

బోనాల చెక్కుల పంపిణీలో గందరగోళం

ప్రొటోకాల్ పాటించాలని బీఆర్‌ఎస్ ఆగ్రహం

- నిరసన వ్యక్తం చేసిన కార్పొరేటర్లు, నాయకులు
- సికింద్రాబాద్‌లో 15 మంది అరెస్టు
- ఫ్లెక్సీ తొలగింపుతో పరిస్థితి ప్రశాంతం



బోనాల చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు మంగళవారం నిర్వహించిన బోనాల వేడుకల చెక్కుల పంపిణీ కార్యక్రమం గందరగోళంగా మారింది. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను గౌరవించడం లేదని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి మల్టీపర్పస్ హాలు వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని లక్ష్మీప్రసన్నతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు వేదిక ఎక్కి అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించాలని పట్టుబట్టారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్‌కు సమాచారం ఇవ్వలేదని, ఎమ్మెల్యే వచ్చే వరకు చెక్కుల పంపిణీ చేయవద్దని బీఆర్‌ఎస్ నాయకులు భీష్మించుకొని కూర్చున్నారు.

15 మంది అరెస్టు..

ఎమ్మెల్యేకు ముందస్తు సమాచారం అందించని దేవాదాయ శాఖ అధికారులు క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ నాయకులు వేదిక దిగాలని బీఆర్‌ఎస్ నాయకులు వేదికపై కూర్చుని నినాదాలు చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ కలుగజేసుకుని ఎమ్మెల్యేకు అధికారులు సమాచారం అందించారని చెప్పారు. ఎమ్మెల్యే వస్తానంటే.. వచ్చేవరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిలిపివేస్తామని చెప్పారు. సికింద్రాబాద్ ప్రజల సంక్షేమం కోసం అన్ని పార్టీల నాయకులు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఎమ్మెల్యే ఫొటోలేని ఫ్లెక్సీని చెక్కుల పంపిణీ వేదికపై నుంచి కాంగ్రెస్ నాయకులు తొలగించారు. నిరసన ప్రదర్శనతో పరిస్థితి గందరగోళ పరిస్థితికి దారి తీస్తుండటంతో బీఆర్‌ఎస్ నాయకులు ఆలకుంట హరిబాబు, లింగాని శ్రీనివాస్, రాజేశ్‌తో పాటు 15 మంది నాయకులను అదుపులోకి తీసుకున్న చిలకలగూడ పోలీసులు ఓయూ పీఎస్‌కు తరలించారు.

కార్పొరేటర్ల సమక్షంలో పంపిణీ..

చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ నిబంధనలు విస్మరించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్వహించాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదని అన్నారు. అందరు ఎమ్మెల్యేల విషయంలో ప్రభుత్వానికి ఒకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. వేం నరేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ బోనాల చెక్కులు పంపిణీ చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 205 దేవాలయాలకు రూ.1.06 కోట్ల చెక్కులను బోనాల వేడుకల నిర్వహణ కోసం అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్లు శ్రీదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు. నగరంలో ఈసారి బోనాల వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు.

నూతన భవనాల ఆస్తిపన్ను అసెస్‌మెంట్ల కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణను రెండేళ్ల క్రితం నిలిపివేసిన జీహెచ్‌ఎంసీ ఆ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. రోజురోజుకూ జీహెచ్‌ఎంసీకి వస్తున్న ఆదాయం కంటే ఖర్చులు పెరిగిపోతుండటంతో ఆదాయ మార్గాలపై దృష్టి సారించిన జీహెచ్‌ఎంసీ.. గతంలో మాదిరిగానే కొత్త భవనాలు నిర్మించుకున్న యజమానులు ఆస్తిపన్ను అసెస్‌మెంట్ కోసం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తుల్ని అందజేసే విధానాన్ని తిరిగి పునరుద్ధరించింది. మరోవైపు, జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం ఆస్తిపన్ను అసెస్‌మెంట్‌కాని భవనాల యజమానులను అసెస్‌మెంట్ చేయించుకోవాల్సిందిగానూ సూచిస్తున్నారు. తద్వారా ప్రస్తుతం వస్తున్న ఆదాయం కంటే ఆస్తిపన్ను వసూళ్ల ద్వారా జీహెచ్‌ఎంసీకి వచ్చే ఆదాయం పెరుగుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఆఫ్‌లైన్ సైతం!

- ఆస్తిపన్ను అసెస్‌మెంట్ కోసం..
- సర్కిల్ కార్యాలయాల్లో.. ఫిజికల్‌గానూ దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగానూ..

చాలా కాలం క్రితమే ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానాన్ని జీహెచ్‌ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు స్వయంగాను, మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ చేయించుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. తద్వారా ప్రజలు జీహెచ్‌ఎంసీ కార్యాలయాల దాకా తిరిగే అవసరం లేకుండా సులభం అవుతుందని భావించారు. దీంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే విధానం అమలయ్యేది. అలా అమలులో ఉన్న రెండు విధానాల్లో అప్పటి ప్రభుత్వంలోని సచివాలయ స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒకదాన్ని రెండేళ్ల క్రితం అప్పటి కమిషనర్ రద్దు చేశారు. యజమానులే నేరుగా కానీ, మీ సేవ కేంద్రాల ద్వారా కానీ ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునే విధానాన్ని మాత్రమే అమలులో ఉంచారు. బిల్‌కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, దిగువస్థాయి సిబ్బంది జోక్యాన్ని పూర్తిగా తొలగించారు. ఎక్కువ విస్తీర్ణం ఉన్న భవనాలకు తక్కువ విస్తీర్ణం నిర్ధారిస్తూ ఆస్తిపన్ను తక్కువగా విధించడం, తదితర చర్యలతో సొంత జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలతో పాటు కొన్ని సందర్భాల్లో అవి వెల్లడైన నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్పట్లో ఆ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్ విధానంతో వెల్లడైన అవకతవకలు

ఈ నేపథ్యంలో.. ఆన్‌లైన్ ద్వారా అందిన సెల్ఫ్ అసెస్‌మెంట్ దరఖాస్తులకు ఆటోమేటిక్‌గానే పీటీఐఎన్(ఆస్తి పన్ను గుర్తింపు నెంబరు), ఆస్తిపన్ను డిమాండ్ జనరేట్ కావడం వంటి విధానాలు అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానం వల్ల యాజమాన్య హక్కులకు సంబంధించి తగిన డాక్యుమెంట్లు లేకున్నా, ఎలాంటి పరిశీలన జరపకుండానే పీటీఐఎన్‌లు జారీ అవుతుండటంతో ప్రభుత్వ భవనాలను సైతం ప్రైవేటు వ్యక్తులు తమ పేరిట అసెస్‌మెంట్ చేసుకోగలిగే లోపాలు వెలుగుచూశాయి.

- మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఏకంగా జీహెచ్‌ఎంసీ కార్యాలయ భవనాన్ని తనపేరుపై అసెస్ చేయించుకొని లోపాలను ఎండగట్టారు. ఆ నేపథ్యంలో, సెల్ఫ్ అసెస్‌మెంట్‌లోని లోపాలు సరిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. ఆన్‌లైన్ సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానమే అమల్లో ఉంది. ఇటీవల ఆదాయం పెంచుకునేందుకు వివిధ ఆలోచనలు చేస్తున్న క్రమంలో కొత్తగా నిర్మించిన భవనాలకు అసెస్‌మెంట్ల కోసం డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల్లో దరఖాస్తులు ఫిజికల్‌గా తీసుకునే విధానాన్ని కూడా అమల్లోకి తెచ్చినట్లు సంబంధిత అధికారి తెలిపారు.
- అంతేకాదు.. అసెస్‌మెంట్ కాని భవనాలను జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించినా అసెస్మెంట్ చేయించుకోవాల్సిందిగా సుమోటోగానే భవన యజమానులకు సమాచారం అందించి ఆమేరకు అందిన దరఖాస్తుల్ని సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో స్వీకరిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి విచారణ తర్వాత భవనాన్ని అసెస్‌మెంట్ చేసి డిమాండ్ నోటీసు జారీ చేస్తారు. ఆస్తిపన్ను చెల్లించాక పీటీఐఎన్ జారీ చేస్తారు. ఈవిధానంతో పాటు సెల్ఫ్ అసెస్‌మెంట్ కూడా యధావిధిగా కొనసాగుతుంది.


ఈ ఆర్థిక సంవత్సరం..

అసెస్‌మెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్న యజమానులు: 17,051

వారు చెల్లించాల్సిన ఆస్తిపన్ను(డిమాండ్ నోటీసుల మేరకు): రూ. 23.60 కోట్లు

వసూలైన ఆస్తిపన్ను: రూ. 17.24 కోట్లు

వసూలు కావాల్సింది: రూ. 6.36 కోట్లు



ఆదాయం పెంచుకునేందుకు..

జీహెచ్‌ఎంసీలో ఏటా కొత్తగా దాదాపు 15వేల భవనాలకు టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు జారీ చేస్తోంది. ఆమేరకు కొత్త భవనాలు ఆస్తిపన్ను జాబితాలో మాత్రం చేరడం లేవు. కొత్తగా నిర్మాణం పూర్తయిన అన్ని భవనాల నుంచి ఆస్తిపన్ను వసూలు కోసం సెల్ఫ్‌అసెస్‌మెంట్‌తోపాటు పాత విధానాన్ని పునరుద్ధరించారు. సుమోటోగానూ సమాచారమిస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లాంజ్‌

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్‌కామ్‌ (ఇఎన్‌సీఎఎల్‌ఎమ్‌)



హాస్పిటాలిటీ 'ట్రాన్సిట్ బై ఎన్‌కామ్‌' పేరిట ఏర్పాటైన తమ అధునాతన లాంజ్‌ను మంగళ వారం ప్రారంభించింది. ఎన్‌కామ్‌ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వికాస్ శర్మ మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్‌లోని లెవల్ డి అరై వల్స్ వద్ద ఉన్న ఈ ట్రాన్సిట్ లాంజ్‌లో ప్రయాణి కుల కోసం 17చ.మీ మీటర్ల నుంచి 51 చ.మీ వరకూ పరిమాణంలో 57 గదులు, జిమ్‌, ఎన్‌రూట్ కేఫ్, కాఫీ మేకర్, వాక్‌–ఇన్ షవర్స్‌, వైఫై, కరెన్సీ మార్పిడి, లగేజీ స్పేస్ లతో పాటు స్పా సౌకర్యం ప్రత్యేక ఆకర్షణ అని వివరించారు.

ధ్యానం.. ఆవాహనం

మెడిటేషన్ ఆన్ వీల్స్‌కు శ్రీకారం

- ఒత్తిడికి చక్కని పరిష్కారం
- ఐటీ కంపెనీలు, ఆస్పత్రులు, కళాశాల ప్రాంగణాలకు
- బ్రహ్మకుమారీస్‌ విశ్వవిద్యాలయ ప్రయత్నం

Meditation on Wheels

ఒత్తిడి సహా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే జ్ఞానం ఉన్నా ధ్యానమార్గం వైపు ప్రయాణించే తీరిక, సమయం లేక ఇబ్బంది పడుతున్నవారి సమక్షానికి ధ్యానమే తరలివస్తోంది. నగరంలోని ఐటీ కంపెనీలు, ఆస్పత్రులు, కళాశాల ప్రాంగణాల్లో ఉచితంగా ధ్యానాభిరుచిని పరిచయం చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా నగరంలో మెడిటేషన్ ఆన్ వీల్స్‌కు శ్రీకారం చుట్టింది ప్రజాపిత బ్రహ్మకుమారీస్‌ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ..

– సాక్షి, సిటీబ్యూరో



విహారం నుంచి ఆహారం దాకా కాదేదీ ఆ'వాహనానికి' అనర్హం అన్నట్టు సిటీలో 'వీల్స్‌' వీరవిహారం చేస్తున్నాయి. అదే క్రమంలో నగరంలో మెడిటేషన్ ఆన్ వీల్స్ అందుబాటులోకి వచ్చింది. కొన్ని నెలలుగా 3వేల మందికి పైగా తమ ధ్యాన చక్రాలు పలకరించాయని అంటున్నారు ఆధ్యాత్మిక వేదిక ప్రజాపిత బ్రహ్మకుమారీస్‌ ప్రతినిధులు.

ధ్యాన మార్గం వైపు మళ్లించేందుకు..

నగరంలో చదువుతో మొదలుపెడితే... ఉద్యోగాలు, వ్యాపకాల వంటివన్నీ ఒత్తిడి కారకాలుగా మారుతున్నాయి. ఈ ఒత్తిడి అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతోంది. దీనికి అత్యుత్తమ పరిష్కారం ధ్యానం.. అయితే సమయాభావం కావచ్చు, తగినంత అవగాహన లేకపోవడం వల్ల కావచ్చు... చాలా మంది ఈ పరిష్కారాన్ని అందుకోలేకపోతున్నారు. వారి కోసమే ఈ మెడిటేషన్ ఆన్ వీల్స్‌ను డిజైన్ చేశామని వీరు చెబుతున్నారు.

ఆధ్యాత్మిక తోవ...

ఈ వాహనంతో పాటు బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు కొందరు ప్రయాణిస్తుంటారు. నగరవాసుల అభ్యర్థన మేరకు వారు కోరుకున్న ప్రాంతానికే వెళ్లి వాహనం ద్వారా ధ్యానం చేసే అవకాశాన్ని కల్పిస్తారు. దీనికి ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. ఆ వాహనానికి అవసరమైన పార్కింగ్ సమకూరిస్తే చాలు. కనీసం 2 గంటల నుంచి అత్యధికంగా 4 గంటల దాకా సేవలు అందిస్తారు. వాహనంలో ఒక్కో బ్యాచ్‌కు 10 మంది వరకూ హాజరు కావచ్చు. ధ్యానం అనంతరం వారి అనుభూతిని తెలుసుకుని, ఆసక్తి, అవసరాన్ని బట్టి వారికి ఆ తర్వాత ఉచిత ధ్యాన తరగతుల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు.

ఐటీ కంపెనీ నుంచి గేటెడ్ కమ్యూనిటీ దాకా..

నగరంలో చుట్టుపక్కల ఉన్న ఏ విద్యా సంస్థ అయినా, ఐటీ కంపెనీ అయినా, గేటెడ్ కమ్యూనిటీ అయినా కార్పొరేట్ సంస్థలైనా...ఏవైనా సరే ఈ ధ్యాన వాహన సేవలు కావాలంటే బ్రహ్మకుమారీస్‌ను సంప్రదించవచ్చు. అవసరమైతే మరికొన్ని అదనపు రోజులు కూడా వాహనాన్ని అందుబాటులో ఉంచుతారు.

కులమతాలకు అతీత సేవ...

మెడిటేషన్ ఆన్ వీల్స్ అనేది దేశంలోనే తొలిసారి. ఈ వాహనం ద్వారా కులమతాలకు అతీతమైన ఉచిత ద్యాన సేవ అందించనున్నాం. ఇప్పటికే గత 8నెలలుగా మూడు నుంచి నాలుగువేల మందికి మా వాహన సేవలు అందాయి. దేశవ్యాప్తంగా కూడా దీన్ని విస్తరించాలని యోచిస్తున్నాం.

–శివాణి, బ్రహ్మకుమారీస్‌





ఐఫా స్టార్స్‌..

2024-హోస్ట్స్‌గా రానా, తేజా సజ్జ





సాక్షి, సిటీబ్యూరో: అతిపెద్ద సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ 'ఐఫా అవార్డ్స్‌ 2024'కు సర్వం సిద్ధమైంది. సుదీర్ఘకాలం తర్వాత 'ఐఫా' ప్రారంభ కార్యక్రమం నగరంలోని హెచ్‌ఐసీసీ వేదికగా మంగళవారం నిర్వహించారు. యూఏఈ అబుదాబిలోని యస్ ద్వీపం వేదికగా సెప్టెంబర్ 6, 7 తేదీల్లో జరగనుంది. నగరంలో ఏర్పాటు చేసిన ప్రారంభ వేడుకల్లో పలువురు తెలుగు, తమిళ, మలయాళీ, కన్నడ సినీ తారలతో పాటు అబుదాబి కల్చరల్ టూరిజం ప్రతినిధి అబ్దుల్లా యూసఫ్ మొహమ్మద్, ఫెస్టివల్ యూనిట్ హెడ్ డీటీసీ– నవాఫ్ అలీ అల్జాహ్దామీ తదితర ప్రతినిధులు సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు సినీ తారలు పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ప్రపంచ స్థాయి గుర్తింపు

భారతీయ సినిమాకు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కుతోంది. సినిమాకు ప్రాంతం, బాషతో సంబంధం లేదు. ప్రతీ రంగాన్ని ఆస్వాదిస్తున్నాను కాబట్టే సినిమా, టీవీ, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నాను. తెలుగులో తారక్ నటన అంటే చాలా ఇష్టం. అవకాశముంటే చిరు, బాలయ్య, తారక్ తో సినిమా చేయడాని సిద్ధంగా ఉన్నాను.

– కుష్బూ

నెల రోజుల్లో కొత్త సినిమా

ఈసారి అబుదాబి ఐఫా ఉత్సవం 2024ను నేను, తేజా సజ్జ కలిసి చేయబోతున్నాం. సినిమాను తెలుగు అభిమానులు సెలబ్రేట్ చేసుకున్నంత మరెవరూ చేసుకోరేమో. మరో నెల రోజుల్లో కొత్త సినిమా గురించి వివరాలు చెబుతాను.

– రానా దగ్గుపాటి

చివరి సారి జరిగిన ఐఫా ఉత్సవంలో పాల్గొన్నాను. ఇన్నేళ్ల తరువాత మళ్లీ జరుగుతుండటం సంతోషంగా ఉంది.

– రాశీ ఖన్నా

పుష్ప 2 కోసం అందరిలానే నేనూ ఎదురు చూస్తున్నారు. సుకుమార్ మరింత క్రేజీగా రెండో భాగాన్ని రూపొందించారు. రష్మిక ఇరగదీసింది. సినిమా ప్రయాణంలో హైదరాబాద్ ప్రత్యేకమైనది.

– దేవీ శ్రీ ప్రసాద్

ఐఫా వేదికపై డ్యాన్స్ స్టెప్పులు వేయనున్నాను. కుర్చీ మడతపెట్టి ప్రజలకు బాగా చేరువైంది. ఇలాంటి వేదికల పై సినిమా కుటుంబాన్ని ఒకేసారి కలుసుకోవడం ఆనందంగా ఉంటుంది.

–శ్రీలీల

హనుమాన్ సక్సెస్ సంతోషాన్నిచ్చింది. మంచి ప్రాజెక్ట్స్ వస్తున్నాయి. త్వరలో అప్డేట్ చేస్తాను. ఐఫా లో రానా తో పాటు హోస్ట్ గా చేస్తున్నాను.

–తేజ సజ్జ

కల్కిలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. షూటింగు సమయంలో ప్రభాస్ చేసిన అల్లరి మరచిపోలేను. మరో 3 సినిమాల్లో నటిస్తున్నాను.

–ఫరియా అబ్దుల్లా

చాలా రోజుల తరువాత తెలుగు అభిమానులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. బాలయ్యతో నరసింహ రెడ్డి పాటలకు వేసిన స్టెప్పులు గుర్తొస్తున్నాయి. ప్రస్తుతం హిందీ, తమిళ్‌లో సినిమాలు చేస్తున్నాను. అవకాశాలను బట్టి తెలుగులోనూ చేయాలని ఉంది.

– సిమ్రాన్

తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తున్నాను. హైదారాబాద్ ఎప్పుడు వచ్చినా మంచి అనుభూతి. తెలుగులోనూ చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

–అక్షర హాసన్

2017లో ఐఫా ఉత్సవంలో కంచె సినిమా నేపథ్యంలో పాల్గొన్నాను. తెలుగు సినిమా ఎదిగిన తీరు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. తెలుగులో మరో 2 సినిమాలు చేస్తున్నాను.

–ప్రగ్యా జైశ్వాల్

మొదటి ఐఫా అవార్డ్స్ కు హోస్ట్ గా చేశాను. నా నటన కన్నా నా మాటలను అభిమానులు బాగా ఆదరించారు. ఈ మధ్య కాలంలో ఓటీటీ లో మంచి సక్సెస్ ను అందుకున్నాను.

– నవదీప్

ఈ కార్యక్రమంలో సింగర్ సాహితీ, హరిణి, మంగ్లీ, సింగర్ కరీముల్లా, హీరో సుశాంత్ తదితరులు పాల్గొని సందడి చేశారు.



నాట్యవిలాసం..



రవీంద్ర భారతిలో అద్భుత నాట్య ప్రదర్శన

ఆహూతులను ఆకట్టుకున్న నృత్య రీతులు

ప్రదర్శన ఎప్పటికీ మర్చిపోలేం: ఇంద్రాణీ సుగుమార్

ప్రేక్షకుల స్పందన చూసి ఆశ్చర్యపోయాం

మలేసియా నాట్య బృందంతో 'సాక్షి' ప్రత్యేక సంభాషణ

సాక్షి, సిటీబ్యూరో/గన్‌ఫౌండ్రీ: నెమలి నాట్యం ఎంత అందంగా ఉంటుందో.. వాళ్లు నృత్యం చేస్తే అంతకన్నా అద్భుతంగా ఉంటుంది. ఆ నెమలి సైతం అబ్బురపడేలా వారి ప్రదర్శన ఉంటుంది. అమ్మవారి వేషం వేసుకుంటే అమ్మవారే పూనినట్టు అనిపిస్తుంది. రాక్షస సంహార ఘట్టం ప్రదర్శన చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. ఎవరైనా సరే చేతులెత్తి నమస్కరించాల్సిందే. సాక్షాత్తూ అమ్మవారే భువి నుంచి దివికి దిగి వచ్చారా అన్నట్టు అనిపిస్తుంది. ఇటీవల మలేసియా నుంచి హైదరాబాద్ వచ్చి పలు నృత్య రూపకాలను రవీంద్రభారతిలో ప్రదర్శించిన నాట్య బృందాన్ని 'సాక్షి'పలకరించింది. ఇక్కడ వారి అనుభవాల గురించి అడిగి తెలుసుకుంది.

కళ్లు చెమర్చాయి...

రవీంద్ర భారతిలో మలేసియా సంప్రదాయ నృత్యమైన నెమలి నృత్యం, కళింగ అమ్మాళ్ నృత్య రూపకాలను ప్రదర్శించామని బృందానికి ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ ఇంద్రాణీ సుగుమార్ వివరించారు. మొత్తం పది మంది బృందంతో ఇచ్చిన అమ్మాళ్ నృత్య ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. రాక్షస సంహారం అనంతరం ప్రేక్షకులు కొట్టిన చప్పట్లు ఎప్పుడూ మర్చిపోలేనని చెప్పారు. అనేక దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చామని, ఇలాంటి స్పందన ఎక్కడా చూడలేదని, ఇక్కడివారి ప్రేమాభిమానాలకు మంత్ర ముగ్ధులమయ్యామని చెప్పారు. ఇక లైటింగ్, సౌండ్‌సిస్టమ్‌తో ప్రదర్శన చేస్తుంటే రోమాలు నిక్కబొడిచాయని, అంత అద్భుతంగా స్టేజీని అలంకరించారని చెప్పారు. ప్రదర్శన అనంతరం అమ్మవారి వేషధారణలో ఉన్న తమకు కొందరు నమస్కరించారని గుర్తు చేసుకున్నారు.

ఆడవాళ్లకు చాలా సురక్షితమైన ప్రాంతం

మహిళలకు హైదరాబాద్ ఎంతో సురక్షిత ప్రాంతంగా అనిపించిందని చెప్పారు. నిర్వాహకులు తమను ఎంతో బాగా చూసుకున్నారన్నారు. ఇక్కడి ఆతిథ్యం ఎంతో బాగుందని వివరించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. తొలిసారి హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శన ఇచ్చామని, మరోసారి అవకాశం వస్తే ప్రదర్శన చేయాలని ఉందని చెప్పారు.

హైదరాబాద్ బిర్యానీ బాగుంది..

చార్మినార్‌ను సందర్శించామని, ఇక, హైదరాబాద్ బిర్యానీ ఎంతో రుచికరంగా ఉందని, అక్కడికి వెళ్లాక చాలా మిస్ అవుతామన్నారు. ఇరానీ చాయ్ కూడా టేస్టీగా ఉందని చెప్పారు. ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నామని వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఎంతో మర్యాదగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారని తెలిపారు.

దేశవిదేశాల్లో ప్రదర్శనలు..

ఏపీలోని వైజాగ్‌తో పాటు తమిళనాడులోని చిదంబరం దేవాలయం, పుదుచ్చేరిలో ప్రదర్శనలు ఇచ్చామని, చిదంబరంలో 2019లో తాము ప్రదర్శించిన చిదంబరేశ నాట్య కలైమణి ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కిందని చెప్పుకొచ్చారు. దక్షిణాఫ్రికాలోని పలు ప్రాంతాల్లో 'కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్' కింద అనేక ప్రదర్శనలు ఇచ్చామని తెలిపారు. మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్, మారిషస్‌లోని అనేక ప్రాంతాల్లో నృత్య ప్రదర్శన చేస్తుంటామని చెప్పారు. ముఖ్యంగా నవరాత్రుల సందర్భంగా తాము ప్రదర్శనలు ఇస్తుంటామని తెలిపారు. మలేసియాలోని కౌలాలంపూర్ వద్ద ఇంద్రాణీ డ్యాన్స్ అకాడమీ నెలకొల్పి, ఆసక్తి ఉన్న వారికి నృత్యం నేర్పిస్తానని తెలిపారు. భరత నాట్యంలో తాను నిష్ణాతురాలినని, అయితే భరత నాట్యంతో పాటు ఒడిస్సీ కూడా విద్యార్థులకు నేర్పిస్తానని వివరించారు.



ట్రంప్ ఉపాధ్యక్ష అభ్యర్థి ఉషా'పతి'

ఆంధ్రా మూలాలున్న అమ్మాయి ఉషా చిలుకూరిని పెళ్లి చేసుకున్న జేమ్స్ డేవిడ్ వాన్స్ ● దశాబ్దాల కిందటే యూఎస్‌లో స్థిరపడ్డ ఉష తల్లిదండ్రులు

వాషింగ్టన్: మిల్వాకీలో సోమవారం జరిగిన పార్టీ జాతీయ సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు. రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా ప్రస్తుతం ఓహియో సెనేటర్‌గా ఉన్న జేమ్స్ డేవిడ్ వాన్స్ (జేడీ వాన్స్)ను ప్రకటించారు. ఒకప్పుడు ట్రంప్ విమర్శకుడిగా ఉన్న జేడీ వాన్స్ తరువాత ఆయనకు అత్యంత ముఖ్య అనుచరుడిగా మారిపోయారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన వెంటనే.. దీని వెనుక అధ్యక్షుడు జో బైడెన్ పాత్ర ఉండొచ్చని మొట్టమొదటగా ట్వీట్ చేసింది కూడా జేడీనే. సోమవారం జరిగిన కన్వెన్షన్‌లో అభ్యర్థిత్వం ప్రకటించిన తరువాత ప్రసంగించిన ఆయన.. తన ప్రస్థానం వెనుక భార్య ఉషా చిలుకూరి వాన్స్ సహకారం ఎంతో ఉందన్నారు. అలా వెలుగులోకి వచ్చిన ఉషా చిలుకూరి.. విజయవంతమైన న్యాయవాది.

చరిత్ర విద్యార్థిగా..

ఉషా తల్లిదండ్రులు చాలా ఏళ్ల కిందట ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె 1986 జనవరి 6న కాలిఫోర్నియాలోని శాండియాగోలో జన్మించారు. వృత్తిరీత్యా అడ్వకేట్ అయిన ఉషా.. యేల్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ చదివారు. ఈ సమయంలోనే ఉష అక్కడి లా

ఉషా చిలుకూరి వాన్స్.. తెలుగు పేరులా ఉంది కదా! అవును.. అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ కొత్తగా చర్చనీయాంశమైన పేరు. రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేమ్స్ డేవిడ్ వాన్స్ భార్య. గొప్ప విద్యానేపథ్యం కలిగిన విజయవంతమైన న్యాయవాది. కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన ఆ తెలుగు ఆడబిడ్డ గురించి కొన్ని ముచ్చట్లు..


వివాహ సమయంలో..


పిల్లలతో..


జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా, యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. కేంబ్రిడ్జిలో ఫిలాసఫీలో మాస్టర్స్ చేశారు. తరువాత గేట్స్ ఫెలోగా కేంబ్రిడ్జిలోనే ఆధునిక చరిత్రలో ఎంఫిల్ చేశారు. అక్కడ ఆమె లెఫ్ట్-వింగ్, లిబరల్ గ్రూప్స్ కలిసి పనిచేశారు. 2014లో వామపక్ష డెమొక్రటిక్ పార్టీలో చేరిన ఉషా.. 2018లో రిపబ్లికన్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 2015 నుంచి 2017 వరకు శాన్‌ఫ్రాన్సిస్కో వాషింగ్టన్ డీసీలోని వివిధ సంస్థల్లో పని చేశారు. 2018లో సుప్రీం కోర్టుకు లా క్లర్క్‌గా మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జాన్ రాబర్ట్స్, జస్టిస్ బ్రెట్ కెవానా వద్ద విధులు నిర్వర్తించారు. సివిల్ లిటిగేషన్ల పరిష్కారంలో ఆమె దిట్ట. వివిధ రంగాలకు చెందిన అప్పీళ్లను కొలిక్కితేవడంలో ఆమెకు మంచి నైపుణ్యం ఉంది.

భర్తకు అండగా...

యేల్ యూనివర్సిటీలో చదువుతుండగానే ఉషకు జేడీ వాన్స్ పరిచయం. ఇద్దరూ కలిసి పలు ప్రాజెక్టుల్లో పనిచేశారు. జేడీ ఆమెను తరచూ 'యేల్ స్పిరిట్ గైడ్' అంటూ పిలిచేవారు. ఈ అనుబంధం ప్రేమగా మారి.. వారిద్దరూ 2014లో కెంటకీలో పెళ్లి చేసుకున్నారు. ఓ పక్క న్యాయవాదిగా తన విధులు నిర్వహిస్తూనే భర్త రాజకీయ ప్రయాణంలో అండగా ఉన్నారు. రాజకీయ కార్యక్రమాలకు ఆయనతో పాటు హాజరవుతారు. ఒహాయో సెనేటర్‌గా భర్త పోటీ చేసినప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనపై వచ్చిన విమర్శలను తిప్పికొట్టి భర్త విజయంలో కీలక పాత్ర పోషించారు. అందుకే తన విజయం వెనుక ఉష మద్దతు ఎంతో ఉందని వాన్స్ పలుమార్లు ప్రస్తావించారు. సోమవారం మిల్వాకీలోనూ భార్యపై ప్రశంసల వర్షం కురిపించారు. జేడీ వాన్స్, ఉష దంపతులకు ఇద్దరు కొడుకులు వివాన్, వివేక్, కూతురు మిరాబెల్ ఉన్నారు. వారిని హిందూ, క్రిస్టియన్ రెండు మత విశ్వాసాలతో పిల్లలను పెంచుతున్నారు.

ఆల్మట్టి గేట్లు ఎత్తారు

- 65 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల
- నేడు నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తివేత!
- ఐదారు రోజుల్లో వరద శ్రీశైలానికి చేరుకునే అవకాశం



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ కనుమల్లో సోమవారం విస్తారంగా వర్షాలు కురవడంతో కృష్ణా నదిలో వరద ఉధృతి పెరిగింది. మంగళవారం ఆల్మట్టి డ్యామ్‌లోకి 1,04,050 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 1,698.95 అడుగుల్లో 100 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో.. బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల మహారాష్ట్రలో ముంపు సమస్య ఉత్పన్నం కాకుండా నివారించేందుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆల్మట్టి గేట్లను ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. గతేడాది జూలై 27న ఆల్మట్టి డ్యామ్ గేట్లు ఎత్తారు. ఈ ఏడాది 11 రోజుల ముందుగానే గేట్లు ఎత్తడం గమనార్హం. దీంతో దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్‌లోకి వరద చేరుకుంటోంది. ప్రస్తుతం నారాయణపూర్ డ్యామ్‌లోకి 22,621 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 1608.2 అడుగుల్లో 28.76 టీఎంసీలకు చేరుకుంది. నారాయణపూర్ డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,615 అడుగులు కాగా పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు. బుధవారానికి డ్యామ్‌లో నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకోనుంది. దాంతో సాయంత్రం డ్యామ్ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. నారాయణపూర్ దిగువన తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 9.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.68 టీఎంసీలు ఉన్నాయి. వరద ఉధృతి వారం పాటు ఇదే రీతిలో కొనసాగే అవకాశం ఉండటంతో.. ఐదారు రోజుల్లో శ్రీశైలానికి ప్రవాహం చేరుకునే అవకాశం ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 32,262 క్యూసెక్కులు తరలిస్తుండటంతో నీటి నిల్వ 35.63 టీఎంసీలకు తగ్గింది. ఇక కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది.

మంగళవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	1705	129.72	1698.95	100	1,04,050	65,000
నారాయణపూర్	1615	37.64	1608.2	28.76	22,621	92
జూరాల	1045	9.66	1041.73	7.68	1,950	2,401
శ్రీశైలం	885	215.81	812.3	35.63	-	32,262
నాగార్జునసాగర్	590	312.05	503.00	191.96	-	601
పులిచింతల	175	45.77	99.28	0.71	200	50
తుంగభద్ర	1633	105.79	1608.71	35.47	28,153	477

25 మంది ఇంజనీర్లపై కమిషన్ గురి

- పూర్తి నివేదిక అందగానే వారికి సమన్లు జారీ
- 10 రోజుల్లోగా కాళేశ్వరం ప్రాజెక్టు పత్రాలు అందించాలి
- ప్రభుత్వానికి మళ్లీ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బరాజ్‌ల వైఫల్యానికి 25 మంది ఇంజనీర్లే కారణమని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. విధి నిర్వహణలో వీరి వైఫల్యమే కారణమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణలో తేలడంతో.. దాని ఆధారంగా సదరు ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్‌తో పాటు విధి నిర్వహణలో వీరి వైఫల్యాలపై విచారణ జరపాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి పూర్తి నివేదికను తెప్పించుకునే పనిలో కమిషన్ ఉంది. నివేదిక చేతికి అందగానే ఆగస్టు రెండోవారంలో వీరిని విచారణకు పిలిపించేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తోంది. ఇక కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ముడిపడి ఉన్న పత్రాలన్నీ 10 రోజుల్లోగా కమిషన్‌కు అందించాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ పత్రాలన్నీ అందితేనే విచారణలో వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని కమిషన్ భావిస్తోంది.

ఆలోగా అఫిడవిట్‌లు దాఖలు చేయండి

ఆగస్టు 5వ తేదీలోపు అఫిడవిట్లు దాఖలు చేయాలని తాజాగా విచారణకు హాజరైన అధికారులను కమిషన్ ఆదేశించింది. విచారణలో భాగంగా క్రాస్ ఎగ్జామినేషన్‌కు సహకరించడానికి వీలుగా తెలంగాణ, ఏపీ, కోల్‌కతాతో సంబంధం లేదని న్యాయవాదిని కమిషన్‌కు సమకూర్చాలని ఆదేశించిన ఆయన... ఆగస్టు నుంచి న్యాయవాదిని విధిగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు సవరణ, బిల్లులు, చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయా..? లేదా...? అనే అంశానికి సంబంధించి, తెలుగు రాష్ట్రాలు, కోల్‌కతాతో సంబంధం లేని చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ)ను నియమించే ప్రక్రియను వేగిరం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ దఫా విచారణ ముగించుకొని జస్టిస్ పినాకి చంద్రఘోష్ మంగళవారం కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. ఆగస్టు 5 తర్వాత ఆయన మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

హీరో రాజ్‌తరుణ్‌కు పోలీసుల నోటీస్

మణికొండ: ఈ నెల 18వ తేదీలోపు విచారణకు రావాలంటూ సినీహీరో రాజ్‌తరుణ్‌కు నార్సింగి పోలీసులు నోటీస్ జారీ చేశారు. లావణ్య ఫిర్యాదు మేరకు రాజ్‌తరుణ్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆమె తన వద్ద ఉన్న వాట్సాప్ చాటింగ్, కాల్ రికార్డింగ్‌లు, ఫొటోలు, వీడియోలు 175 వరకు పోలీసులకు అందించింది. వాటి ఆధారంగా లావణ్య స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన పోలీసులు ఇప్పుడు హీరో రాజ్‌తరుణ్‌ను విచారించేందుకు సిద్ధమయ్యారు. అయితే రాజ్‌తరుణ్ ముందస్తు బెయిల్ పొందే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది.

'విద్యుత్' కమిషన్ చైర్మన్‌ను మార్చండి

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. మరోవైపు 'విద్యుత్' కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తాను స్వయంగా బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టు సుప్రీంకోర్టుకు లేఖ రాశారు.

రాజకీయ కక్ష సాధింపు కోసమే: కేసీఆర్ తరపు న్యాయవాది

'విద్యుత్' అంశాలపై విచారణ కోసం కాంగ్రెస్ సర్కారు నియమించిన కమిషన్‌ను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం దీనిపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దీ వాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తొలుత కేసీఆర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. కమిషన్‌పై హైకోర్టులో కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తొలిరోజే కనీసం వాదనలు కూడా వినకుండా ఎలా కొట్టివేసిందని ప్రశ్నించారు. ఇందులో రాజకీయ కక్ష సాధింపు స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ సమయంలో చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. 'అది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్న విచారణ మాత్రమేనని, దానికి న్యాయపరమైన అధికారం లేదు కదా' అని పేర్కొన్నారు. దీనికి ముకుల్ రోహత్గి సమాధానమిస్తూ.. 'రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడింది. దాంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిషన్‌తో తెలంగాణ రాష్ట్ర కమిషన్‌కు విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగింది. బీఆర్ఎస్ హయాంలో తక్కువ ధరకే విద్యుత్ కొనుగోళ్లు చేసినట్టు నిరూపిస్తాం. అయినా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిషన్ దోషిగా నిర్ధారించినప్పటికీ అది పరిగణనలోకి రాదు'' అని పేర్కొన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. కమిషన్ విషయంలో పలు అభ్యంతరాలు ఉన్నాయని సింఘ్వీతో పేర్కొన్నారు.

ప్రభుత్వం పొరపాటుగా జ్యుడీషియల్ పదం వాడింది

ప్రభుత్వం తరపు న్యాయవాది సింఘ్వీ వివరణ ఇస్తూ.. ''కమిషన్ నియామక డాక్యుమెంటులో.. విశ్రాంత న్యాయమూర్తి నియామకం నేపథ్యంలో జ్యుడీషియల్ అనే పదం పొరపాటుగా వాడారు. కానీ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం పరిధిలోకి వస్తుంది'' అని తెలిపారు. దీనిపై కేసీఆర్ తరపు న్యాయ వాది రోహత్గీ స్పందిస్తూ.. ''పవర్ పర్చేజీ అంశాన్ని ఇప్పటికే ట్రిబ్యునళ్లు పరిశీలిస్తున్నాయి. అక్కడ పెండింగ్‌లో ఉన్న అంశాలపై కమిషన్ ఎలా నియమిస్తారు. ట్రిబ్యునళ్ల కన్నా ఓ విశ్రాంత న్యాయమూర్తికి ఎక్కువ అధికారాలు ఎలా ఉంటాయి?'' అని ప్రశ్నించారు.

ప్రభుత్వానికి ఓ అవకాశం ఇస్తున్నాం..

ఈ సమయంలో చీఫ్ జస్టిస్ కల్పించుకుంటూ.. ''కమిషన్ చైర్మన్ మీడియా సమావేశంలో కేసు మెరిట్స్‌పై అభిప్రాయాలు వెల్లడించినట్టు ఉంది కదా?'' అని ప్రభుత్వం తరపు న్యాయవాదులను ప్రశ్నించారు. దీంతో సింఘ్వీ స్పందిస్తూ.. ''ప్రభుత్వం మార్చి 14న కమిషన్‌ను నియమించింది. తమ విచారణ సందర్భంగా ఏం జరిగిందనేది తెలుపుతూ.. పలువురితోపాటు మాజీ సీఎం కేసీఆర్‌కు కమిషన్ ఏప్రిల్‌లో నోటీసులు జారీ చేసింది. అయితే మాజీ సీఎం వాటిని సవాల్ చేయకుండా, ఎన్నికల్లో బిజీగా ఉన్నానంటూ జూన్ చివరి వరకూ సమయం అడిగారు'' అని వివరించారు. అయితే కమిషన్ చైర్మన్ తన అభిప్రాయాలను మీడియాకు వెల్లడించడంపై చీఫ్ జస్టిస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ''మాజీ సీఎం ఎలాంటి సమాధానం ఇవ్వకుండానే.. కమిషన్ చైర్మన్ మీడియా సమావేశం నిర్వహించడం, కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం సబబు కాదు కదా. కేసు మెరిట్స్‌పై వ్యాఖ్య లు చేయకుంటే మేం జోక్యం చేసుకునే వాళ్లమే కాదు. కానీ అలా చేశారు. ఇది ఓ వ్యక్తి రెప్యుటేషన్‌పై ప్రభా వం చూపుతుంది కదా. మేం ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నాం. కమిషన్‌లో న్యాయమూర్తిని (చైర్మన్‌గా) భర్తీ చేయడానికి అవకాశం ఇస్తున్నాం. న్యాయం జరిగేలా చూడాలి. ఇది విచారణ కమిషన్'' అని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. భోజన విరామం అనంతరం తర్వాత కొత్త చైర్మన్ పేరు తెలపాలని సూచించారు.

బాధ్యతల నుంచి తప్పుకొంటూ జస్టిస్ నరసింహారెడ్డి లేఖ

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన సూచనల విషయం తెలిసిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి.. 'విద్యుత్' కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టుగా కోర్టుకు లేఖ రాశారు. భోజన విరామం అనంతరం సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణ్ ఈ విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కమిషన్ నూతన న్యాయమూర్తిగా ఎవరిని నియమిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించగా.. సోమవారం నాటికి కోర్టుకు చెబుతామని ప్రభుత్వం తరపు న్యాయవాది సింఘ్వి తెలిపారు. దీనితో పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ప్రకటించారు.

కొత్త చైర్మన్ నేతృత్వంలో యథాతథంగా విచారణ!

గత సర్కారు ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం తదితర 'విద్యుత్' అంశాలపై కాంగ్రెస్ సర్కారు మార్చి 14న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో విచారణ కమిషన్ వేసింది. విచారణలో భాగంగా ఆయన.. చాలా మంది నుంచి ఫిర్యాదులు, అభిప్రాయాలు స్వీకరించారు. దాదాపు 28 మందికి లేఖలు రాశారు. ఈ క్రమంలో పలు తప్పిదాలకు మాజీ సీఎం కేసీఆరే కారణమంటూ విద్యుత్ రంగ నిపుణులు రఘు, ఎం.తిమ్మారెడ్డి, ఎం.వేణుగోపాల్‌రావు, గోపాలకృష్ణన్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం తదితరులు కమిషన్ ముందు వాదించారు. వారిని సాక్షులుగా పరిగణించిన కమిషన్.. ఈ ఆరోపణలపై సమాధానం కోరుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాసింది. అయితే విచారణ క్రమంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి.. చేసిన పలు వ్యాఖ్యలను మాజీ సీఎం కేసీఆర్ తప్పుపట్టారు. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ.. హైకోర్టులో పిటిషన్ వేశారు. కానీ సానుకూల నిర్ణయం రాకపోవడంతో.. సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో కమిషన్ బాధ్యతల నుంచి జస్టిస్ నర్సింహారెడ్డి తప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన స్థానంలో మరో మాజీ జడ్జిని కమిషన్ చైర్మన్‌గా నియమించనుంది. కమిషన్ విచారణ యథాతథంగా కొనసాగనుంది.

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి లేఖ సారాంశమిదీ..

''మీడియా సమావేశంలో నా అభిప్రాయాలు వెల్లడించడంపై కోర్టులో పరిశీలనలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. బీఆర్‌కేఆర్ భవన్‌లోని ఏడో అంతస్తులో నా కార్యాలయం పనిచేస్తోంది. అదే భవనంలోని ఎనిమిదో అంతస్తులో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కార్యాలయం పనిచేస్తోంది. రోజు విడిచి రోజు ఆ కమిషన్ మీడియా బ్రీఫింగ్ జరుగుతోంది. ఆ సమయంలో విలేకరులు నా కార్యాలయంలో ఏం జరుగుతుందోనని ఆరా తీసేవారు. కమిషన్‌కు సంబంధించి ఊహాజనిత వార్తలు ఇచ్చేవారు. అందువల్ల అప్పటివరకు జరిగిన పురోగతి మీడియాకు తెలపాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహించాను. ఒక న్యాయమూర్తి లేదా విశ్రాంత న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరించబోరని స్పష్టంగా చెప్పొచ్చు. ఆరోపణల నేపథ్యంలో న్యాయవ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టడానికి కమిషన్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా..'' అని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థ గౌరవం కోసమే వైదొలిగా..

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్దేశంతో ఈ అంశం లోతుల్లోకి వెళ్లలేదని వివరించారు. థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి సంబంధించి సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కాకుండా సబ్ క్రిటికల్ టెక్నాలజీ వల్ల కాలుష్య ప్రభావం ఉంటుందని అభిప్రాయాలు వచ్చాయని.. దీనిపై విచారణ చేయాల్సి ఉందని మాత్రమే తాను మీడియా సమావేశంలో చెప్పానని వివరించారు. సాధారణంగా కోర్టులో వాదనలు జరుగుతున్న సమయంలో న్యాయమూర్తి కొందరి అభిప్రాయాలతో ఏకీభవించినట్టు కనిపిస్తుందని.. కానీ తుది తీర్పు మాత్రమే పరిగణనలోకి వస్తుందని గుర్తుచేశారు.

నోటీసులేమీ ఇవ్వలేదు..

విచారణ అంశానికి సంబంధించి వాంగ్మూలాలు తీసుకోవడం కమిషన్ ఆఫ్ ఎంక్వైరీలో భాగమని జస్టిస్ నరసింహారెడ్డి చెప్పారు. అయినా తానేమీ మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వలేదని, లేఖ రూపంలోనే అభిప్రాయాలు తెలపాలని కోరానని వివరించారు. బీఆర్‌కేఆర్ భవనంలో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కార్యాలయం రోజు విడిచి రోజు ప్రెస్‌మీట్ నిర్వహించడంపై అభ్యంతరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. అక్కడికి వచ్చిన విలేకరులు.. మా కార్యాలయం విషయంలో ఊహాజనిత వార్తలు రాస్తుండటంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకే ప్రెస్‌మీట్ పెట్టినట్టు చెప్పారు. కమిషన్ ప్రెస్‌మీట్ నిర్వహించడం తప్పు అయితే చాలా కమిషన్లను కొట్టివేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. తన నివేదిక పూర్తి దశకు చేరుకుందని, ప్రభుత్వానికి అందజేద్దామనుకున్నా.. సుప్రీంకోర్టులో కేసు దృష్ట్యా సరికాదని భావించి ఆగానని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

- తిహార్ జైలు నుంచి దీన్‌దయాల్ ఆస్పత్రికి తరలించిన అధికారులు
- కొంతకాలం నుంచి గైనిక్ సమస్యతో బాధపడుతున్న కవిత
- తాజాగా జ్వరంతో ఇబ్బంది.. టెస్టులు చేయించి తిరిగి జైలుకు తరలింపు
- ఆమె తరచూ అనారోగ్యం బారినపడుతుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టై తిహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో జైలు అధికారులు ఢిల్లీలోని హరినగర్‌లో ఉన్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. రక్త పరీక్షలు, గైనిక్ సంబంధ సమస్యల టెస్టులు చేయించి.. తిరిగి జైలుకు తరలించారు. నిజానికి కవితకు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పుడు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమె ఆరోగ్యం పట్ల కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొన్నాళ్లుగా గైనిక్ సమస్యతో సతమతం

ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ అధికారులు మార్చి 15న కవితను అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆమె జ్యుడీషియల్ కస్టడీపై జైలులో ఉన్నారు. ఇటీవల ఆమె పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు జైలులో కవితను పరామర్శించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. అయితే కవిత గైనిక్ (స్త్రీ సంబంధిత) సమస్యలతో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళవారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ ఆస్పత్రి వైద్యులు ఆమెకు సంబంధిత వైద్య పరీక్షలు చేశారని.. బుధవారం ఉదయానికల్లా రిపోర్టులను జైలు అధికారులకు పంపనున్నారని సమాచారం. తనకు గైనిక్ సమస్య ఉందని, బెయిల్ ఇవ్వాలని కవిత గతంలోనే పిటిషన్లు వేసినా.. కోర్టుల నుంచి సానుకూల తీర్పురాలేదు.

ఇంటి ఫుడ్ తినట్లేదంటున్న బీఆర్ఎస్ వర్గాలు

తిహార్ జైలులో ఉన్న కవితకు ఇంటి భోజనం అందించేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. నాలుగైదు రోజులపాటు ఇంటి భోజనం చేసిన కవిత.. తర్వాత భోజనం తీసుకురావొద్దని కుటుంబ సభ్యులకు, తమ న్యాయవాదికి చెప్పారు. జైలులో అందరు ఖైదీలకు పెట్టే ఆహారాన్నే కవిత తీసుకుంటున్నారు. కవిత కోసం ఇంటి నుంచి తీసుకొస్తున్న భోజనాన్ని తనిఖీ పేరుతో నలుగురైదుగురు చేతులు పెట్టి పరిశీలిస్తున్నారని.. అలా చేస్తే రోగాల బారిన పడే ప్రమాదం ఉండటంతోనే ఆమె ఇంటి భోజనం వద్దన్నారని కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు. ఇంటి భోజనం తినకపోవడం, గతంలో ఉన్న గైనిక్ సమస్యల కారణంగా.. కవిత అస్వస్థతకు గురైనట్టు బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

కేంద్రంలో ఫాసిస్టు పాలన సాగుతోంది

'సుద్దాల హన్మంతు సమగ్ర సాహిత్యం–జీవితం' పుస్తకావిష్కరణలో సురవరం


సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): కేంద్రంలో ఫాసిస్టు పాలన సాగుతోందని సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎస్వీకే, ప్రజానాట్యమండలి, సుద్దాల ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాటకు పదిపది దండాలు పేరిట సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రజాకవి సుద్దాల హన్మంతు సమగ్ర సాహిత్యం–జీవితం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురవరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధపోరాటంలో సుద్దాల హన్మంతు తన పాటలతో ప్రజలను చైతన్యం చేయడంతోపాటు స్వయంగా పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ పోరాటం ప్రస్తుత తరానికి ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు మాట్లాడుతూ సమాజాన్ని మార్చేశక్తి కవులు, సాహిత్యానికి ఉంటుందని చెప్పారు. ప్రజానాట్యమండలి కళాకారులు పల్లె నర్సింహ్మ తదితరులు ప్రదర్శించిన యక్షగానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. నవ తెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సినీనటుడు ఉత్తేజ్, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమల, ప్రముఖకవి కోయి కోటేశ్వర్‌రావు, భూపతి వెంకటేశ్వర్లు, ఎస్.వినయ్‌కుమార్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురవరం. చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ, బీవీ రాఘవులు

ప్రాణహిత–చేవెళ్లను పక్కనపెట్టడం పెద్ద తప్పిదం!

కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ ఆరోపణ

- కొందరి ప్రయోజనాల కోసమే రీ–ఇంజనీరింగ్!
- మేడిగడ్డ బరాజ్ స్థలం ఎంపిక తప్పే
- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పలేదు
- కాళేశ్వరం డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వమే రూపొందించింది
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ


మీడియాతో మాట్లాడుతున్న వెదిరె శ్రీరామ్

సాక్షి, హైదరాబాద్:

కొందరి నిర్దిష్ట ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును రీ–ఇంజనీరింగ్ చేశారని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ ఆరోపించారు. మేడిగడ్డ బరాజ్ స్థలం ఎంపిక పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. చిన్న కారణాలు చూపి ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని పక్కనపెట్టి.. దాని స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదికి తీసుకొచ్చారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లను ఆమోదించినది కూడా రాష్ట్ర ప్రభుత్వంలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) అని, దీనికి కేంద్రానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంగళవారం వెదిరె శ్రీరామ్ కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణం, లోపాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ఫిర్యాదుకు మద్దతుగా వాదనలు వినిపించారు. అనంతరం వెదిరె శ్రీరామ్ మీడియాతో మాట్లాడారు. ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని రీడిజైన్ చేసి.. కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం వెనుక ఎన్నో తప్పులు ఉన్నాయని ఆరోపించారు.

సీడబ్ల్యూసీ నీటి లభ్యత ఉందనే చెప్పింది!

గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టిని నాలుగు కారణాలతో పక్కనపెట్టిందని.. అక్కడ నీటి లభ్యత లేదనడం అందులో ఒకటని వెదిరె శ్రీరామ్ చెప్పారు. కానీ 75 శాతం లభ్యత (డిపెండబిలిటీ/నాలుగేళ్లలో కచ్చితంగా మూడేళ్ల వచ్చే వరద) ఆధారంగా 165 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని సీడబ్ల్యూసీ పేర్కొందని తెలిపారు. ఇక నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి రిజర్వాయర్ల సంఖ్యను పెంచాలని సీడబ్ల్యూసీ సిఫార్సు చేసిందని గత ప్రభుత్వం మరో కారణంగా చూపిందని.. కానీ ప్రాణహిత- చేవెళ్ల పథకం కింద కూడా అలా కట్టేందుకు అవకాశం ఉండేదని వివరించారు. దీనికితోడు తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే మహారాష్ట్రలో 3,600 ఎకరాల ముంపు ఉంటుందని, ఆ రాష్ట్రం ఒప్పుకోదని మూడో కారణంగా చూపారన్నారు. అయితే ఎప్పుడైనా భారీ ప్రాజెక్టులకు భూసేకరణ సమస్య ఉంటుందని.. సేకరించాలనే తపన ఉంటే మహారాష్ట్రలో 3 వేల ఎకరాలు సేకరించడం పెద్ద విషయమేమీ కాదని వ్యాఖ్యానించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజె క్టు కోసం 2015 సంవత్సరం నాటికి రూ.11,917 కోట్లు ఖర్చయ్యాయని.. ఆ దశలో ప్రాజెక్టును పక్కనపెట్టడం సహేతుకం కాదని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కట్టి ఉంటే గ్రావిటీతో నీరు అందేదని.. అదే మేడిగడ్డ వద్ద కట్టడంతో ఏటా నీటి పంపింగ్‌కే రూ.11 వేల కోట్ల అనవసర వ్యయం అవుతుందని వివరించారు.

బ్యారేజీల వద్ద పరీక్షల వివరాలు రావాలి..

కాళేశ్వరం బరాజ్ వైఫల్యాలపై గత ఏడాది నవంబర్‌లో ఒక నివేదిక, తర్వాత మేలో మరో నివేదికను ఎన్డీఎస్ఏ ఇచ్చిందని వెదిరె శ్రీరామ్ చెప్పారు. బరాజ్‌ల వద్ద జియో టెక్నికల్, జియో ఫిజికల్, స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు పూర్తి చేసి, వివరాలను ఎన్డీఎస్ఏకు నివేదిస్తే.. ఎన్డీఎస్ఏ బరాజ్‌ల పరిస్థితి, భవిష్యత్తు చర్యలపై తుది నివేదికను అందించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

డీపీఆర్ ఆమోదానికి ముందే నిర్మాణం

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ ఆమోదానికి ముందే బరాజ్‌ల నిర్మాణం సగానికిపైగా పూర్తయిందని వెదిరే శ్రీరామ్ పేర్కొన్నారు. బరాజ్‌ల నిర్మాణంలో పలు లోపాలు ఉన్నట్టు ఎన్డీఎస్ఏ గుర్తించిందన్నారు. గేట్ల నిర్వహణలోనూ వైఫల్యాలు ఉన్నాయన్నారు. 2019లోనే బరాజ్‌లలో సమస్యలు వచ్చినా పరిష్కరించలేదన్నారు. డిజైన్ ఒక విధంగా ఉంటే, నిర్మాణం మరో విధంగా జరిగిందని పేర్కొన్నారు. నీటిని నిల్వ చేయడమే ముఖ్యమైతే.. రిజర్వాయర్లు కట్టి ఉండాల్సిందని.. బరాజ్‌లు కట్టి, రిజర్వాయర్లుగా వాడుకోవడం తప్పేనని స్పష్టం చేశారు.

వైఫల్యానికి కారణాలు అనేకం

కాళేశ్వరం బరాజ్‌ల వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, బ్యారేజీలు కట్టడానికి ముందు తగిన సాంకేతిక పరీక్షలు చేయకపోవడమే కారణమని వెదిరె శ్రీరామ్ ఆరోపించారు. డీపీఆర్ తయారీలో సాంకేతిక అంశాలు పట్టించుకోలేదని.. బరాజ్‌ల ఎంపిక ప్రదేశాల్లో లోపాలున్నాయని పేర్కొన్నారు. డిజైన్ల తయారీ కోసం నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు తగినంత సమయం ఇవ్వలేదని.. ఉన్నత స్థాయిలో ఒత్తిడి చేసి, డిజైన్లకు ఆమోదం తీసుకున్నారని చెప్పారు. తాను నివేదించిన అంశాలతో వారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఆదేశించిందని, అఫిడవిట్ అందిస్తానని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 17-7-2024

న్యూస్‌మేకర్


ధీనిధి దేశింఘు

ఒలింపిక్స్‌లో 14 ఏళ్ల చేపపిల్ల

1952లో జరిగిన ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున 11 ఏళ్ల ఆర్తి సాహా పాల్గొని చరిత్ర సృష్టించింది. ఇన్నాళ్ల తర్వాత బెంగళూరు స్విమ్మర్ ధీనిధి దేశింఘు పారిస్ ఒలింపిక్స్‌లో ఈత పోటీలో పాల్గొనే అవకాశం పొందింది. 9వ తరగతి చదువుతున్న ధీనిధి ఈతలో దేశీయ రికార్డులు సొంతం చేసుకుంది. కాని పారిస్ కల కోసం ఆమె చేసిన కృషి ఎట్టకేలకు ఆమె కోరుకున్నది సాధించి పెట్టింది

'నేను ఎనిమిదేళ్ల వయసులో ఉన్నప్పుడు క్లాసులో చాలా బిడియంగా ఉండేదాన్ని. చురుగ్గా లేనని మా అమ్మానాన్నలు ఈతలో చేర్పించారు. ముందు ఈతకు భయపడ్డాను. తర్వాత స్విమింగ్ పూల్ నా ఫ్రెండ్ అయ్యింది. ఆ తర్వాత ఈత నా ప్యాషన్ అయ్యింది' అంటుంది 14 ఏళ్ల ధీనిధి దెశింఘు.

తొమ్మిదవ తరగతి చదువుతున్న ఈ అమ్మాయి మరికొద్ది రోజుల్లో పారిస్‌లో మొదలు కానున్న ఒలింపిక్స్‌లో మన దేశ ప్రతినిధిగా పాల్గొన నుంది. దాదాపు 70 ఏళ్ల తర్వాత ఇంత చిన్న వయసు అమ్మాయి మన దేశం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొననుండటం ఒక విశేషం. 1952 ఒలింపిక్స్‌లో 11 ఏళ్ల బాలిక ఆర్తి సాహా మన దేశం నుంచి పాల్గొంది.



ధీనిధి దేశింఘు

యూనివర్సాలిటీ కోటా

ఈసారి మన దేశం నుంచి ఎవరూ ఒలింపిక్స్‌లో ఈత పోటీలకు నేరుగా అర్హత పొందలేదు. 'ఒలింపిక్ సెలక్షన్ టైమ్' ప్రదర్శించి 'ఇంటర్నేషనల్ స్విమింగ్ ఫెడరేషన్' ద్వారా అయినా ఆహ్వానాన్ని పొందలేదు. ఇలాంటి సమయంలో ఒలింపిక్స్ వారు ఆయా దేశాలకు 'యూనివర్సాలిటీ ప్లేసెస్' కింద ఇద్దరిని పంపమని అనుమతి ఇస్తారు. జాతీయంగా ఉత్తమ ప్రతిభ ఉన్న ఇద్దరిని అలా పంపవచ్చు. ఈ 'కోటా'ను ఉపయోగించుకుని మన దేశం ఉంచి పురుషుల ఈత కోసం శ్రీహరి నటరాజ్‌ను, స్త్రీల ఈత కోసం ధీనిధిని ఎంపిక చేసి పంపుతున్నారు. ఒలింపిక్స్ కమిటీ వీరు పాల్గొనడాన్ని అనుమతించింది. యూనివర్సాలిటీ ప్లేసెస్ కింద ధీనిధి ఎంపిక సాగినా అంత చిన్న వయసులో ఆ అవకాశం పొందడం కూడా ఘనతే.

స్ట్రయిట్ ఆర్మ్ టెక్నిక్

బెంగళూరుకు చెందిన ధీనిధి అక్కడి డాల్ఫిన్ ఆక్వాటిక్స్‌లో ఈత కోసం చేరినప్పుడు పూల్‌లో చేపపిల్లలా ఈదుతున్న ఆ అమ్మాయిని చూసి కోచ్ మధుకుమార్ ఈ పిట్ట కొంచెం కూత ఘనం అని కనిపెట్టాడు. ఆమెకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. స్ట్రయిట్ ఆర్మ్ టెక్నిక్‌తో ఈత కొట్టే కొద్దిమంది భారతీయ స్విమ్మర్‌లలో ధీనిధి నిలిచింది. 12 ఏట నుంచే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. 'నా కంటే వయసులో రెండింతలు ఎక్కువ ఉన్నవారు నా పక్కన ఉంటే భయం వేసేది. కాని పూల్‌లో దిగాక ఈత మీదే నా దృష్టి' అంటుంది ధీనిధి. గోవాలో జరిగిన 2023 నేషనల్ గేమ్స్‌లో ఈతలో కర్నాటక 7 స్వర్ణాలు సాధించడంలో ధినిధి కీలకంగా నిలిచింది. అదే డాల్ఫిన్ ఆక్వాటిక్స్‌లో ద్రోణాచార్య అవార్డీ నిహార్ అమీన్ శిక్షణ మొదలయ్యాక 200 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఆమె మరింత ప్రతిభ కనబరిచి 02:04-24 సెకన్ల రికార్డు సొంతం చేసుకుంది.

కఠోర శ్రమ

'ఈ అవకాశం నాకు ఊరికే రాలేదు. ఫ్రెండ్స్, సినిమా, ఫోన్, వేరే ఆటలు అన్నీ పక్కన పెట్టి రోజుకు ఆరు గంటలు సాధన చేశాను. ఇందులో జిమ్ ఉంటుంది, ఈత కూడా ఉంటుంది. అప్పుడప్పుడు బాగా ఒంటరిగా అనిపించేది. కాని ఒలింపిక్స్‌లో పాల్గొనే నా కల కోసం ముందుకు సాగేదాన్ని. ఒలింపిక్స్‌లో 7సార్లు గోల్డ్ సాధించిన లెజెండ్ స్విమ్మర్ కేటీ లెడెకి నాకు స్ఫూర్తి. ఆమెను పారిస్ ఒలింపిక్స్‌లో కలవబోతున్నానన్న ఊహే నాకు చాలా ఎక్సయిటింగ్‌గా ఉంది. ఆమె కోసం కొన్ని కానుకలు కూడా తీసుకెళుతున్నాను' అంది ధీనిధి.

పారిస్ ఒలింపిక్స్‌లో ధీనిధి ఏ మెడల్ సాధించినా ఆమె పొందబోయే ప్రశంసలు ఒక సముద్రాన్నే తలపించకమానవు. వాటిని ఈదుకుంటూ ఆమె మరింత ముందుకు పోవాల్సి ఉంటుంది.



నేడు తొలి ఏకాదశి

ఆషాఢమాసంలో వచ్చే ముఖ్య పర్వదినాలలో తొలి ఏకాదశి ఒకటి. ఈ రోజునుంచీ శ్రీ మహావిష్ణువు పాలసముద్రంలో శయనిస్తాడు కనుక దీన్ని 'శయన ఏకాదశి' అని కూడా అంటారు. సూర్యుడు నేటినుంచి దక్షిణం వైపుకు మరలడం వల్ల ఈరోజు నుంచి దక్షిణాయనం ఆరంభం అవుతుంది. దీనిని ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతంగా చెప్పుకోవచ్చు. ఏకాదశి రోజున కర్షకులు పొలానికి వెళ్ళి కొత్త కూలీలను మాట్లాడటం, కొత్త ఒప్పందాలు కుదుర్చుకోవడం చేస్తారు. మొక్కజొన్న పేలాలను దంచి, అందులో నూరిన బెల్లం కలిపి విష్ణుమూర్తికి నివేదిస్తారు. ఈ వేళ ఉపవాసం కనుక పండ్లు మాత్రమే సేవిస్తారు. నేతితో పాయసం వండి ప్రసాదంగా పంచుతారు. ఏకాదశి నాడు ఉపవసించి, విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తే అనుకున్న కార్యాలు దిగ్విజయం కావడంతో పాటు మోక్ష ప్రాప్తి కలుగుతుందని, 'సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తే కోరుకున్నవి నెరవేరుతాయనీ నమ్మకం.

జగన్నాథుడికి స్వర్ణాలంకారం



జగన్నాథుడి తిరుగు రథయాత్ర మొదలైన మరునాడు– అంటే, తొలి ఏకాదశి రోజున జగన్నాథుని స్వర్ణాలంకృతుని చేస్తారు. దీనినే స్థానికంగా 'సునా బేషా' అంటారు. జగన్నాథుడి స్వర్ణాలంకార వేషాన్నే 'రాజ వేషం', 'రాజాధిరాజ వేషం' అని కూడా అంటారు. జగన్నాథ, బలభద్ర, సుభద్ర విగ్రహాలకు బంగారు కాళ్లు, చేతులను, ముఖాలకు బంగారు ఊర్ధ్వపుండ్రాలను అలంకరిస్తారు. జగన్నాథుడి ఊర్ధ్వపుండ్రానికి వజ్రం, బలభద్రునికి కెంపు, సుభద్ర ఊర్ధ్వపుండ్రానికి పచ్చ పొదిగి ఉంటాయి. జగన్నాథుడి చేతుల్లో బంగారు శంఖు చక్రాలను, బలభద్రుడి చేతుల్లో బంగారు గద, హలాయుధాలను అలంకరిస్తారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు వజ్రాలు సహా రత్న కిరీటాలు, కర్ణకుండలాలు, నాసాభరణాలు, కంఠహారాలు, బంగారు పుష్పమాలలు, వడ్డాణాలు, రాహురేఖలను అలంకరిస్తారు. జగన్నాథుడి కిరీటంపై ప్రత్యేకంగా బంగారు నెమలి పింఛాన్ని కూడా అలంకరిస్తారు.


● సౌమ్యారావు

● ఫిట్‌నెస్

30 మినిట్స్... మీ కోసం

వాకింగ్ లాంజెస్, బర్పీస్, జంప్ స్క్వాట్స్, సైడ్ కిక్స్, హై నీస్, స్టెయిర్స్, జంపింగ్ జాక్స్, మౌంటెయిన్ క్లైంబర్స్... మొత్తం ఎనిమిది ఎక్సర్‌సైజ్‌లు. ఒక్కో ఎక్సర్‌సైజ్‌కి ఒక్క నిమిషం. 'రోజుకో అరగంట కేటాయించండి చాలు. దేహం ఫిట్‌గా ఉంటుంది' అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాట. ఫిట్‌నెస్ అనేది మగవాళ్లకు మాత్రమే కాదు మహిళలకు కూడా అవసరమే. మచిలీపట్నంలో మహిళలకు ఫిట్‌నెస్ పట్ల అవగాహన కల్పిస్తున్నారు సౌమ్యారావు.

''మహిళ కుటుంబం కోసం అహర్నిశలూ శ్రమిస్తుంది. కానీ తన ఆరోగ్యం గురించి పట్టించుకోవాలనే ధ్యాస ఉండదు. దేహాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి రోజుకో అరగంట తన కోసం తాను కేటాయించుకునే వెసులుబాటు కూడా ఉండడం లేదు. ఈ విషయంలో నగరాలు ఒక అడుగు ముందున్నాయి. పట్టణాలు, గ్రామాలు మాత్రం మహిళ ఫిట్‌నెస్ గురించి మాట్లాడడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నాయి. ఆ అయిష్టతను తొలగించానికి సౌమ్యారావు చేస్తున్న ప్రయత్నమిది.

బందరమ్మాయి!

మాది మచిలీపట్నం. పూణేలో ఇంజినీరింగ్ చేసేటప్పుడు ఏరోబిక్స్ మీద ఆసక్తి కలిగింది. ఇంజినీరింగ్ చేస్తూనే ఏరోబిక్స్‌లో కోర్స్ చేసి, ట్రైనర్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేశాను. అమ్మాయిలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని చెప్పేవారు నాన్న. ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని మచిలీపట్నం రావడం, అదే ఏడాది మా ఊరి అబ్బాయితోనే పెళ్లి జరిగిపోయాయి. మనం ఎక్కడున్నామో అక్కడి నుంచే మన పని ప్రారంభించాలనుకున్నాను. అలా 2007లో మూడు లక్షల పెట్టుబడితో మచిలీపట్నంలో ఏరోబిక్స్ సెంటర్ ప్రారంభించాను. అప్పుడు నా దగ్గర నేర్చుకోవడానికి ఇద్దరు మాత్రమే పేరు నమోదు చేసుకున్నారు. నెల తిరిగే సరికి యాభై మంది ఎన్‌రోల్ అయ్యారు.

రెండు నుంచి యాభైకి... మధ్య

మచిలీపట్నంలో ఉన్న ప్రతి డాక్టర్‌నీ సంప్రదించాను. ఏరోబిక్స్‌ని ఫిట్‌నెస్ అనే ఒక్కకోణంలో చూడకుండా, దేహం అవసరాన్ని బట్టి ప్రతి పేషెంట్‌కీ అవసరమైనట్లు కస్టమైజ్‌డ్‌గా డిజైన్ చేయాల్సిన అవసరాన్ని సూచించారు. సిజేరియన్ తర్వాత దేహం తిరిగి పటుత్వాన్ని సంతరించుకోవడం, ఒబేసిటీ, పీసీఓడీ వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని వ్యాయామాలు డిజైన్ చేశాను.

పిల్లల డైలీ రొటీన్

పిల్లలకు బ్రష్ చేయడం దగ్గర్నుంచి తగినన్ని నీళ్లు తాగడం వరకు ఆరోగ్యకరమైన అలవాట్లను నేర్పిస్తాం. కానీ ఫిట్‌నెస్ కోసం సమయం కేటాయించడం మన ఇండియన్ పేరెంటింగ్ డిక్షనరీలో కనిపించదు. స్కూళ్లలో ఏరోబిక్స్ ఎక్సర్‌సైజ్ లేదా జుంబా డాన్స్ వంటి ఏదో ఒక వ్యాయామ ప్రక్రియ ప్రవేశపెడితే పిల్లలకు డైలీ రొటీన్‌లో ఎక్సర్‌సైజ్ ఒక భాగంగా మారుతుంది. ఇప్పుడున్న విద్యావిధానం విద్యార్థుల్లో ఒత్తిడిని పెంచుతోంది. ఆ ఒత్తిడిని తొలగించే మార్గం ఫిజికల్ ఎక్సర్‌



సైజ్. కనీసం మూడు నిమిషాల ప్రాక్టీస్ చాలు. నేనే స్వయంగా స్కూళ్లకు వెళ్లి ఉచితంగా నేర్పిస్తానని ప్రభుత్వ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు తెలియచేశాను.

– సౌమ్యారావు,
ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్, మచిలీపట్నం

మన సమాజం నిర్లక్ష్యం చేసే మరో సమస్య మెనోపాజ్. ఈ దశ తర్వాత మహిళల దేహం చాలా వేగంగా శక్తిని కోల్పోతుంది. ఈ దశలో ఫిట్‌నెస్‌ని పరిరక్షించుకోవడం ఎంత అవసరమో తెలియచేస్తున్నాను. అలాంటి వాళ్లకు సెల్ఫ్‌కేర్ గురించి కౌన్సెలింగ్‌తోపాటు ఉచితంగా ఫిట్‌నెస్ శిక్షణనిస్తున్నాను. ఈ సమయంలో నిర్లక్ష్యం వహిస్తే యాభై దాటినప్పటి నుంచి అనారోగ్య సమస్యలు వెంటాడుతుంటాయి. ఈ దశను ఆరోగ్యకరంగా దాటగలిగితే మహిళలు అరవై, డెబ్బైలలో నాణ్యమైన జీవితాన్ని సాగించగలుగుతారు. అలాగే మిడిల్ ఏజ్‌లో మహిళలకు ఎదురయ్యే డిప్రెషన్, మెంటల్ ట్రామాలకు కూడా ఫిట్‌నెస్ యాక్టివిటీ మంచి పరిష్కారం. ఏరోబిక్స్ శిక్షణ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ క్లాసులు తీసుకుంటున్నాను. యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, కువైట్, సౌదీ అరేబియాల్లో ఉన్న మా మచిలీపట్నం వాళ్లే ఎక్కువ మంది.

ఆవేదన తప్పడం లేదు

కొంతమంది భర్తలు 'నీకిప్పుడు ఫిట్‌నెస్ అవసరమా, డబ్బు తగలేస్తావా' ఇలా రకరకాలుగా అంటారట. ఆ మాటలకు భయపడి ముందడుగు వేయని వాళ్లు కొందరైతే, రహస్యంగా నేర్చుకోవాలనుకునే వాళ్లు కొందరు. ఇరవై ఒకటో శతాబ్దం కూడా మహిళల విషయంలో ఇలా ఉండడం ఏమిటో అని ఆవేదన కలుగుతుంటుంది. చైతన్యవంతం కావాల్సింది మహిళలు మాత్రమే కాదు మగవాళ్లు కూడా'' అన్నారు సౌమ్యారావు.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అంబానీ ఇంట అందగాడు

అందమైన కాలర్‌తో పింక్, గోల్డెన్ జాకెట్ ధరించి అనంత్ అంబానీ కుటుంబ వస్త్రధారణతో పోటీ పడుతూ వివాహ కార్యక్రమాల్లో తనూ విశేషంగా ఆహూతులను ఆకట్టుకుంది 'హ్యాపీ' అనే డాగ్.

అహ్మదాబాద్‌కు చెందిన ఖ్యాతి అండ్ కరణ్ షా పంఖ్ డిజైనర్ పెట్ వేర్ దుస్తులను డిజైన్ చేసింది. స్వచ్ఛమైన సిల్క్ జాక్వర్డ్ ఫ్యాబ్రిక్‌తో ఆమె అంబానీల కోసం తయారు చేసిన పెంపుడు జంతువుల దుస్తుల్లో ఇది ఇరవై తొమ్మిదవది.

వివాహ వేడుకలు జరుగుతున్నంత సేపూ హ్యాపీ హాయిగా మండపంపై తన స్థానాన్ని ఆక్రమించుకుని, చుట్టూ పరిశీలిస్తూ, చిత్ర విచిత్ర విన్యాసాలతో వీడి



యోల్లో సందడి చేసింది. ఇషా అంబానీ కూతురు బేబీ ఆదియశక్తి ప్రేమతో హ్యాపీని ఆలింగనం చేసుకుంటుండగా, ఆమె తండ్రి ఆనంద్ పిరమల్ కూతురును అనుసరిస్తూ కనిపిస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోని 'అత్యంత అందగాడు' అంటూ అభివర్ణించారు వ్యూవర్స్. అంబానీ కుటుంబం పెంపుడు జంతువు హ్యాపీ ఈ యేడాది జనవరిలో అనంత్–రాధికల నిశ్చితార్థంలో ఉంగరం మోసే పాత్రను పోషించింది. అప్పుడే అంబానీ కుటుంబ ఫోటోలో ఇది ప్రధాన స్థానం పొందింది.

యూత్ పల్స్

ఫ్యూచర్ రెడీ



యువతులకు సంబంధించి 'ఏఐ'ని ఉపాధి కోణంలో మాత్రమే చూడనక్కర్లేదు. ఆత్మవిశ్వాసం నుంచి ఆర్థిక స్వావలంబన వరకు ఎన్నో అంశాలలో 'ఏఐ' యువతరం నేస్తం అయింది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(జెన్‌ఏఐ) ద్వారా గ్లాస్ సీలింగ్‌ను ఛేదించే అవకాశం ఉందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ కోర్సులలో చేరడానికి మహిళలు ఆసక్తి చూపుతున్నారు' అంటున్నారు ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ 'కోర్సెరా' స్ట్రాటజిక్ అడ్వైజర్ శ్రావణ్ గోలి.

యువతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి సవిట్ (సౌత్ ఏషియా ఉమెన్ ఇన్ టెక్) జెనరేటివ్ ఏఐ లెర్నింగ్ ఛాలెంజ్‌ను ప్రకటించింది. సుమారు అయిదు లక్షల మందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో శిక్షణ ఇవ్వాలనేది 'సవిట్' లక్ష్యంగా పెట్టుకొంది.

'కెరీర్ పరంగా సరికొత్త అవకాశాలకు, ఆర్థిక స్వావలంబనకు, ఉద్యోగాలలో లింగ అంతరాన్ని పూడ్చడానికి, ఏఐ రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది' అంటుంది సవిట్.

> **'కోడ్ విత్ ఔట్ బ్యారియర్స్' ప్రోగ్రామ్ క్రింద 75,000 మహిళలకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది మైక్రోసాఫ్ట్. టెక్‌సాక్ష్యం, సైబర్‌శిక్షణ, మైక్రోసాఫ్ట్ డైవర్సిటీ స్కిల్లింగ్ ప్రోగ్రామ్ (ఎండీఎస్‌పీ)... మొదలైన కార్యక్రమాల ద్వారా నిరుపేద యువతులకు సాంకేతికరంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవసరమైన శిక్షణ ఇస్తోంది మైక్రోసాఫ్ట్.**

టెక్నాలజీ సెక్టార్‌లో కెరీర్ కోసం కలలు కంటున్న యువతులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక శిక్షణ ఇవ్వనుంది సవిట్. నెట్‌వర్కింగ్, మెంటార్‌షిప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ గ్రోత్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి మహిళలకు ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించబోతుంది.

టెక్ మహీంద్రాలో ఏఐ ప్రాజెక్ట్‌లకు సంబంధించి మహిళలు గణనీయమైన సంఖ్యలో నాయకత్వ స్థానంలో ఉన్నారు. టార్గెట్ రిక్రూట్‌మెంట్, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్స్, కెరీర్ రిక్రూట్‌మెంట్ కార్యక్రమాల ద్వారా భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలలో మహిళల సంఖ్యను గణనీయంగా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రామీణ భారతంలో కూడా యువతులను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తోంది ఏఐ. దీనికి ఉదాహరణ... బిహార్‌లోని 'ఐ–సాక్ష్యం' అనే సంస్థ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి రూపొందించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత యువతులను ఛేంజ్‌మేకర్స్‌గా మారుస్తోంది ఐ–సాక్ష్యం. లైఫ్ స్కిల్స్, డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీ... మొదలైన వాటికి సంబంధించి 'ఐ–సాక్ష్యం' శిక్షణ ఇస్తోంది.

ఇన్‌స్పిరేషన్

ఒకేరోజు 85 వేల పండ్ల మొక్కలు!

ఛత్తీస్‌ఘడ్‌లోని గరియాబంద్ జిల్లాలో 17,000 మంది మహిళలు ఒకేరోజులో 85,000 పండ్ల మొక్కలను నాటడం ద్వారా రికార్డ్ సృష్టించారు. 'అమ్మ పేరు మీద ఒక చెట్టు' పేరుతో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు కొత్తగా పెళ్లయిన వారు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు. మామిడి, జామ, నిమ్మ, పనస... మొదలైన మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు, పౌష్టికాహార మెరుగుదలకు దోహదపడే ఈ మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతను మహిళలకు అప్పగించారు. వీరి ఘనతను 'గోల్డెన్



బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించింది. 'మొక్క నాటాను. ఇక నా పని పూర్తయిపోయింది అనుకోడం లేదు. నేను నాటిన మొక్క మా అమ్మ, నా బిడ్డతో సమానం. కంటికి రెప్పలా చూసుకుంటాను' అంటుంది దస్పూర్ గ్రామానికి చెందిన సునీత అనే గృహిణి. ఇది ఆమె మాటే కాదు 'అమ్మ పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో పాల్గొన్న పదిహేడు వేల మంది మహిళలది.

లీగల్

సహజీవనంలో ఆమెకు ఆ హక్కుందా?



ప్రియ, భార్గవ్.. మూడేళ్లుగా లివ్ ఇన్ టుగెదర్ రిలేషన్‌లో ఉంటున్నారు. ఇద్దరూ ఒకే కంపెనీలో పనిచేసేవాళ్లు. ఆరు నెలల కిందట ప్రియకు ఉద్యోగం పోయింది. దాంతో ఇంటి బాధ్యత అంతా భార్గవ్‌దే. అయితే ప్రియ ఇటీవల భార్గవ్ ఏం చేసినా తప్పు పడుతోంది. ఎవరితో మాట్లాడనివ్వకుండా.. తనతో తప్ప ఎవరితో ఎక్కడికీ వెళ్లనివ్వకుండా కట్టడి చేస్తోంది. ఆఫీస్ అవసరాల రీత్యా భార్గవ్ కొలీగ్స్‌కి ఫోన్ చేసినా, ఫోన్‌ని అతను అటెండ్ అయినా పెద్ద యుద్ధమే! గొడవలే! భరించలేక భార్గవ్ ఒకరోజు 'ఈ టార్చర్ తట్టుకోవడం నా వల్ల కాదు.. నీతో కలసి ఉండలేను' అన్నాడు. దాంతో ప్రియ 'నాతో బ్రేకప్ చేసుకుంటే నీ మీద రేప్ కేసు పెడతా' అని బెదిరించింది. హడలిపోయాడు భార్గవ్. నిజంగానే ప్రియకు ఆ హక్కు ఉందా?

కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, సెక్షన్ 69 ప్రకారం.. ఏ వ్యక్తి అయినా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేకపోయినా.. మోసపూరితంగా, ఓ పథకం ప్రకారం.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆ స్త్రీతో శారీరక సంబంధం నెరపితే.. సదరు పురుషుడికి పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. రేప్ అయితే యావజ్జీవం కూడా పడవచ్చు. జూన్ 30 వరకు అమల్లో ఉన్న పాత శిక్షాస్మృతి ప్రకారం కూడా పెళ్లి చేసుకుంటానని చెప్పి, మోసపూరితంగా స్త్రీతో శారీరకసంబంధం నెరపిన పురుషుడిపై ఐపీసీ 376, ఐపీసీ 420 సెక్షన్‌లను కలిపి కేసు నమోదు చేసేవారు. అయితే, ఆ పురుషుడు మొదటినుంచీ మోసం చేసే ఉద్దేశంతోనే ఉన్నాడు అని రుజువుకాకపోతే మాత్రం దాన్ని రేప్‌గా పరిగణించలేమని హైకోర్ట్, సుప్రీంకోర్టు పేర్కొన్న సందర్భాలు, తీర్పులూ ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో ముఖ్యంగా చూడాల్సినదేంటంటే.. పెళ్లి చేసుకునే ఉద్దేశం లేకపోయినా చేసుకుంటానని నమ్మించి కేవలం శారీరక సంబంధం కోసమే అతను లివ్ ఇన్‌లో ఉన్నాడా అనే అంశం. మొదట బాగానే ఉన్నాడు.. పెళ్లి చేసుకోవాలనే అనుకున్నాడు.. కానీ తర్వాత మనస్పర్థలు, భేదాభిప్రాయాలు వచ్చి విడిపోవాలనుకుంటున్నాడు అని రుజువైతే శిక్ష పడదు. భారతీయ న్యాయ సంహిత, సెక్షన్ 69 ప్రకారం కూడా లివ్ ఇన్ రిలేషన్‌లోని పురుషుడు 'మోసపూరితమైన ఆలోచనతోనే రిలేషన్ మొదలు పెట్టాడు' అని రుజువు చేయాలి. అయితే ఈ కేస్ స్టడీలో భార్గవ్ మీద ప్రియ కేసు పెట్టే అవకాశం కచ్చితంగా ఉంది. అతను పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇన్నాళ్లు లివ్ ఇన్‌లో ఉండి ఇప్పుడు వద్దు అంటున్నాడని ప్రియ రుజువు చేయగలిగితే భార్గవ్‌కి పదేళ్లవరకు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే సెక్షన్ 69 వలన సహజీవనం, ప్రేమ అనే అంశాలు ఆది నుంచీ అనుమానంతో మొదలయ్యే ప్రమాదం ఉంది. సహజీవనానికి ముందు లేదా కలసి ఉంటున్న క్రమంలో ఒకరిపై ఒకరు స్పష్టత తెచ్చుకోవడం అవసరం. ఇలాంటి రిలేషన్స్ వ్యక్తిగతమైనప్పటికీ, వీలైనంత మేర అందరికీ తెలిసేలా ఉండడం లేదా కనీసం సన్నిహితులకైనా తెలిసుండటం వల్ల కొంతవరకు రక్షణ కలగవచ్చు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వొకేట్



స్మృతి మంధాన ఐదో ర్యాంక్ యథాతథం

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన 729 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో కొనసాగుతోంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మూడు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో.. షఫాలీ వర్మ రెండు స్థానాలు పురోగతి సాధించి 15వ ర్యాంక్‌లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ 738 పాయింట్లతో మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది. రాధా యాదవ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకుంది.

ఇంగ్లండ్ కోచ్ పదవికి సౌత్‌గేట్ రాజీనామా

గత ఎనిమిదేళ్లుగా ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టుకు కోచ్‌గా ఉన్న గ్యారెత్ సౌత్‌గేట్ తన పదవికి రాజీనామా చేశారు. బెర్లిన్‌లో జరిగిన యూరో కప్ ఫైనల్లో ఇంగ్లండ్ 1-2 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయింది. 2016 నుంచి సౌత్‌గేట్ శిక్షణలో ఇంగ్లండ్ రాటు దేలింది. 2018 'ఫిఫా' ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరుకోవడంతోపాటు 2021, 2024 యూరో టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. 'మార్పు కోసం సమయం ఆసన్నమైంది. కొత్త అధ్యాయానికి తెర లేవనుంది' అని సౌత్‌గేట్ వ్యాఖ్యానించారు.



ఒలింపిక్ పతకాల వేటలో...

క్రీడాకారులకు భారత ప్రభుత్వం అండదండ | పారిస్ ఒలింపిక్స్ సన్నాహాలకు భారీగా నిధులు | రూ. 470 కోట్లు ఖర్చు చేసిన కేంద్రం

2012 లండన్ ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్ 29 స్వర్ణాలు, 18 రజతాలు, 18 కాంస్యాలతో (మొత్తం 65 పతకాలు) మూడో స్థానంలో నిలిచింది. సొంతగడ్డపై పెద్ద సంఖ్యలో పతకాలు గెలిచే లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం చాలా ఏళ్ల క్రితమే ప్రణాళికలు రూపొందించి పెద్ద సంఖ్యలో నిధులు కేటాయించింది. వచ్చిన ఫలితాలను బట్టి చూస్తే తాము గెలిచిన ఒక్కో పతకం కోసం 45 లక్షల పౌండ్లు (సుమారు రూ.38 కోట్లు) ఖర్చు చేసినట్లు ఒలింపిక్స్ తర్వాత అధికారులు వెల్లడించారు. ఆధునిక సౌకర్యాలు, శిక్షణ, టోర్నీలు వంటి సన్నాహాల్లో దీనిని ఖర్చు చేశారు. ఇది పుష్కరకాలం క్రితం నాటి మాట. ఇదే విషయాన్ని భారత్ కోణంలో చూస్తే ఇలాంటిది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆటగాళ్లు వ్యక్తిగత కష్టం, పట్టుదలను నమ్ముకొనే బరిలోకి దిగుతూ వచ్చారు. ఒలింపిక్స్‌కు చేరువైన సమయంలో అక్కడక్కడా కొంత ఆర్థిక సహకారం లభించినా... అందులో ప్రభుత్వ పాత్ర పెద్దగా లేదు. 1956 నుంచి 1992 వరకు భారత్‌కు ఒలింపిక్స్‌లో ఒక్క వ్యక్తిగత పతకం కూడా రాలేదు. ఆ తర్వాతి ఒలింపిక్స్‌లలో పతకం సాధించినవారు కూడా సొంతంగా సన్నద్ధమైనవారే తప్ప ఒక్కరిని కూడా వ్యవస్థ తీర్చిదిద్దినవారుగా చెప్పలేం. కానీ గత కొన్నేళ్లలో పరిస్థితి మారింది. కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలను, ఒలింపిక్స్‌కు అర్హత సాధించే ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. గెలిచి వచ్చిన తర్వాత అందించే నజరానాల కంటే గెలిచేందుకు కావాల్సిన వాతావరణం సృష్టించడం కీలకమని నమ్మింది. అందుకే మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) పేరుతో ప్రత్యేకంగా ఆర్థిక వనరులను చేకూర్చింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్స్) పథకం పేరుతో ఎంపిక చేసిన ఆటగాళ్లకు సహాయం అందించడం ఈ ఎంఓసీలోనే భాగంగా ఉంది. విదేశాల్లో శిక్షణ, పోటీల కోసం ప్రత్యేక క్యాలెండర్ (ఏసీటీసీ)తో ఈ ప్రణాళిక రూపొందించగా... వివిధ వర్గాల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ద్వారా కూడా నిధులు సేకరించింది.

– సాక్షి క్రీడా విభాగం

PARIS 2024

మరో 9 రోజుల్లో...

టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ గరిష్ఠంగా 7 పతకాలు సాధించింది. ఇవి ముగిసిన తర్వాత పారిస్ ఒలింపిక్స్ కోసం సన్నాహాలు షురూ అయ్యాయి. ఈ సారి పతకాల సంఖ్యను పెంచడమే ఏకైక లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) తమ వంతు పని చేసింది. 16 క్రీడాంశాల్లో ఆయా జాతీయ క్రీడా సమాఖ్యల సూచనలు, ప్రతిపాదనలతో ప్రణాళిక సిద్ధమైంది. కేవలం నిధులు అందించడం మాత్రమే కాగా టోక్యో–పారిస్ మధ్య కాలంలో ఆటగాళ్ల ప్రదర్శనను కూడా 'సాయ్' పర్యవేక్షిస్తూ వచ్చింది. అధికారిక లెక్కల ప్రకారం పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ. 470 కోట్లు ఖర్చు చేసింది. మన దేశం నుంచి ఈసారి 117 మంది ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. పతకావకాశాలు ఉన్న వివిధ క్రీడలు, క్రీడాకారుల కోసం చేసిన ఖర్చు వివరాలను చూస్తే...



అథ్లెటిక్స్: ప్రభుత్వం నుంచి ఎక్కువ ఆర్థిక సహాయం అందుకున్న క్రీడాంశం అథ్లెటిక్స్. ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 29 మంది పాల్గొంటున్నారు. అథ్లెటిక్స్‌కు కేంద్రం రూ.96.08 కోట్లు ఖర్చు చేసింది. గత టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించడంతో ఈ సారి అంచనాలు మరింత పెరిగాయి. మొత్తం 36 జాతీయ శిక్షణా శిబిరాలు నిర్వహించారు. విదేశీ కోచ్ క్లాజ్ బార్టొనెట్ వద్ద శిక్షణ తీసుకోవడంతో పాటు విదేశాల్లో టోర్నీలు, శిక్షణ కోసం నీరజ్ చోప్రాకే ప్రభుత్వం రూ.5.72 కోట్లు ఇచ్చింది.

బ్యాడ్మింటన్: ప్రభుత్వం ఈ క్రీడ కోసం మొత్తం రూ. 72.02 కోట్లు ఖర్చు చేసింది. భారత్ నుంచి సింగిల్స్ విభాగంలో ముగ్గురు... పురుషుల, మహిళల డబుల్స్‌లో కలిపి నలుగురు షట్లర్లు బరిలోకి దిగుతున్నారు. విదేశాల్లో శిక్షణ, టోర్నీలకు గరిష్ఠంగా బ్యాడ్మింటన్ ఆటగాళ్ల 81 ట్రిప్‌లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. డబుల్స్ స్పెషలిస్ట్ కోచ్ మథియాస్ బో వద్ద శిక్షణ, వీడియో అనలిస్ట్, ఇతర సౌకర్యాల కోసం డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టిలకు ప్రభుత్వం రూ. 5.62 కోట్లు ఇవ్వగా... పీవీ సింధుకు రూ.3.13 కోట్లు అందించింది. దీంతో పాటు 17 విదేశీ పర్యటనలు, వ్యక్తిగత కోచ్‌లు, సిబ్బంది నియామకం కోసం కూడా 'టాప్స్' ద్వారా సింధుకు సహకారం లభించింది.

బాక్సింగ్: రూ.60.93 కోట్లు

షూటింగ్: రూ.60.42 కోట్లు (ఆటగాళ్ల మొత్తం 45 విదేశీ ట్రిప్‌లకు ప్రభుత్వ సహకారం లభించింది. మొత్తం 41 జాతీయ క్యాంప్‌లు జరిగాయి)

హాకీ: రూ.41.29 కోట్లు (టోక్యోలో కాంస్యం సాధించడంతో ఈ సారి మన జట్టునుంచి మరింత మెరుగైన ప్రదర్శనను ఆశిస్తూ 76 జాతీయ శిక్షణా శిబిరాలు నిర్వహించడంతో పాటు 19 విదేశీ పర్యటనలకు అవకాశం కల్పించింది)

ఆర్చరీ: రూ.39.18 కోట్లు (41 జాతీయ క్యాంప్‌లు నిర్వహించారు)

రెజ్లింగ్: రూ.37.80 కోట్లు

వెయిట్‌లిఫ్టింగ్: రూ.26.98 కోట్లు (టోక్యో రజత పతక విజేత మీరాబాయి చానుకు శిక్షణ నిమిత్తం ప్రభుత్వం రూ. 2.74 కోట్లు అందించింది)

టేబుల్ టెన్నిస్: రూ. 12.92 కోట్లు

జూడో: రూ. 6.30 కోట్లు

స్విమ్మింగ్: రూ.3.90 కోట్లు

రోయింగ్: రూ.3.89 కోట్లు

సెయిలింగ్: రూ.3.78 కోట్లు

గోల్ఫ్: రూ.1.74 కోట్లు

టెన్నిస్: రూ.1.67 కోట్లు

ఈక్వెస్ట్రియన్: రూ.95 లక్షలు

శౌర్య సంచలనం

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖరారు



హ్యూస్టన్ (అమెరికా): ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాడు శౌర్య బావా సంచలనం సృష్టించాడు. ఈ మెగా టోర్నీలో బాలుర సింగిల్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. 2014లో కుష్ కుమార్ తర్వాత ఈ టోర్నీలో భారత్‌కు పతకం రావడం ఇదే ప్రథమం. ఢిల్లీకి చెందిన 18 ఏళ్ల శౌర్య క్వార్టర్ ఫైనల్లో 2–11, 11–4, 10–12, 11–8, 12–10తో లో వా సెర్న్ (మలేసియా)పై గెలుపొందాడు. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శౌర్య మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడం విశేషం. నిర్ణాయక ఐదో గేమ్‌లో శౌర్య 7–10తో ఓటమి అంచుల్లో నిలిచాడు. అయితే శౌర్య ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. బాలికల సింగిల్స్ విభాగంలో జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో 16 ఏళ్ల అనాహత్ 8–11, 9–11, 11–5, 12–10, 11–13తో నదీన్ ఎల్‌హమీ (ఈజిప్ట్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

సుమిత్ శుభారంభం



బస్టాడ్ (స్వీడన్): నోర్డియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 68వ ర్యాంకర్ సుమిత్ 6–4, 6–3తో ఇలియాస్ యామెర్ (స్వీడన్)పై గెలుపొందాడు. 98 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ రెండు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ 36వ ర్యాంకర్ మరియానో నవోన్ (అర్జెంటీనా)తో సుమిత్ తలపడతాడు.

సినిమా

బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు!

ధనుష్ టైటిల్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రాయన్'. సందీప్ కిషన్, కాళిదాసు జయరామ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో సెల్వరాఘవన్, ప్రకాశ్ రాజ్, ఎస్‌జే సూర్య, అపర్ణా బాలమురళి, దుషారా విజయన్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా



● కాళిదాసు, ధనుష్, దుషారా విజయన్, సందీప్ కిషన్

తమిళ, తెలుగు, హిందీ భాషల్లో మంగళవారం 'రాయన్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'రాయన్... అడవిలో ప్రమాదమైన జంతువు ఏదో తెలుసా', 'సింహం,' 'అడవిలో బలమైన జంతువులు పులి, సింహమే. కానీ ప్రమాదమైన జంతువు తోడేలు. రెండూ ఎదురుగా నిలబడితే సింహమే గెలుస్తుంది. కానీ తోడేలు చాలా జిత్తులమారిది. గుంపుగా చుట్టిముట్టి, ఓ పథకం వేసి సింహాన్ని ఓడిస్తాయి', 'వస్తాడు... బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు... దహనం చేస్తాడు', 'రావయ్యా... రాయన్... వెళ్లి ఏం చెప్పావ్... టక్కున కేసు వెనక్కు తీసుకున్నాడు' అనే డైలాగ్స్ తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త.

కాటుక కళ్లతో సైగె చేసే చిన్నది

'మా ఊరి జాతరలో కాటుక కళ్లతో చాటుగా రమ్మని సైగె చేసే చిన్నది...' అంటూ మొదలయ్యే ఫోక్ మెలోడీ సాంగ్ 'బచ్చల మల్లి' సినిమాలోనిది. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరులో విడుదల కానుంది. ఈ సినిమాలోని 'మా ఊరి జాతరలో..' పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ మంగళవారం విడుదల చేసింది. 'రాములోరు పేర్చిన రాళ్లు ఏరి తీయనా... ఏటి నీటి పైనే నీకు కోటే కట్టెయ్యనా...' అంటూ ఈ పాట సాగుతుంది. చిత్రసంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించారు. సింధూరీ విశాల్‌తో కలిసి 'హను–మాన్' ఫేమ్ కంపోజర్ గౌరా హరి ఈ పాటను పాడారు. ''హీరో హీరోయిన్లు ఒకరినొకరు ఎంత ప్రేమించుకుంటారో తెలియజేసే పాట ఇది. హీరో తన భార్యకు ఏదో ఒక ప్రత్యేకమైన బహుమతిని ఇస్తానంటుండగా, అవేవీ వద్దు తనతో ఉంటే చాలు అన్నట్లుగా హీరోయిన్ చెప్పే క్రమంలో ఈ పాట వస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.



● అమృతా అయ్యర్, 'అల్లరి' నరేశ్

ట్రైబల్ కథల్



● ప్రభాస్



● ఎన్టీఆర్



● సూర్య

ఒక సింహాసనం కోసం రెండు తెగలు పోటీ పడతాయి... సముద్ర తీరంలో ఉండే ఆదివాసీల కోసం ఓ వ్యక్తి పోరాటం చేస్తాడు... తమ హక్కుల కోసం పోరాటం చేస్తాడు ఓ గిరిజన తెగ నాయకుడు... ఓ తెగకు చెందిన వ్యక్తి శివభక్తుడిగా మారతాడు... సినిమా పాయింట్ ఏదైనా ఈ సినిమాలన్నింటిలోనూ కామన్ పాయింట్ 'ట్రైబల్' నేటివిటీ. ఇలా ట్రైబల్ కథల్‌తో రానున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

● 'కాన్సార్ ఎరుపెక్కాలా...' అంటూ 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రంలో ప్రభాస్ చెప్పిన డైలాగ్స్‌కి అటు అభిమానులు ఇటు ప్రేక్షకుల కేకలు, అరుపులతో థియేటర్లు దద్దరిల్లాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్'. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా మొదటి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' గత ఏడాది విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కాన్సార్ సింహాసనం కోసం శౌర్యాంగ, ఘనియార్ తెగలు పోటీపడటం, వారికి దక్కకుండా తన సింహాసనాన్ని కాపాడుకోవడం కోసం మన్నార్ తెగకు చెందిన రాజ మన్నార్ చేసే ప్రయత్నం... ఈ మూడు తెగలు ఎవరికి వారు ప్రత్యేక వ్యూహాలు రచించడం మొదటి భాగంలో చూశాం. చివరికి ఏ తెగవారు కాన్సార్ సింహాసనం చేజిక్కించుకున్నారనేది తెలియాలంటే మలి భాగం 'సలార్: శౌర్యాంగపర్వం' విడుదల వరకూ ఆగాల్సిందే. ఇంకా సెకండ్ పార్ట్ షూటింగ్ ఆరంభం కాలేదు.

● 'ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ 'దేవర' కోసం ఎన్టీఆర్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ సినిమా బ్యాక్‌డ్రాప్ ఏంటో చెప్పింది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. భారత దేశంలో విస్మరణకు గురైన సముద్ర తీర ప్రాంతాలకు చెందిన ఆదివాసీల కోసం దేవర చేసే పోరాటమే ఈ సినిమా అని సమాచారం. ఈ చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది.

● 'చావుని ఎదిరించే వాళ్లకు మాత్రమే ఇక్కడ జీవితం' అంటూ 'తంగలాన్' మూవీ ట్రైలర్‌లో హీరో విక్రమ్ చెప్పిన డైలాగ్ పవర్‌ఫుల్‌గా ఉంది. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాలతో ఈ చిత్రం రూపొందింది. బంగారు గనుల తవ్వకాన్ని వ్యతిరేకించే గిరిజన తెగ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఆ తెగ నాయకుడి పాత్రలో విక్రమ్ నటించారట. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లోనూ రిలీజ్ కానుంది.

● సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువ'. శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమాలో సూర్య ఆటవిక జాతికి చెందిన ఓ తెగ నాయకుడిగా నటించారు. ఓ దట్టమైన అడవిలో రెండు ఆటవిక జాతుల మధ్య పోరాటం నేపథ్యంలో ఈ సినిమా రూపొందినట్లు గ్లింప్స్ చూస్తే అర్థం అవుతుంది. అలాగే ఈ సినిమా టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కినట్లు తెలుస్తోంది. ఓ గిరిజన యోధుడైన కంగువ 1678 నుంచి ప్రస్తుత కాలానికి వస్తాడు. ఓ మహిళా సైంటిస్ట్ సాయంతో తన మిషన్‌ని పూర్తి చేయాలనుకుంటాడు. ఆ మిషన్ ఏంటి? ఆ కాలం నుంచి ఇప్పటి కాలానికి అతను టైమ్ ట్రావెల్ ఎలా చేశాడు? అనే నేపథ్యంలో భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలతో ఈ సినిమా కథ సాగుతుందని టాక్. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల కానుంది.

● మంచు విష్ణు నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు ముఖ్య పాత్రధారులు. ఈ సినిమాలో ఓ తెగకు చెందిన తిన్నడు (ఆ తర్వాత శివ భక్తుడు కన్నప్పగా మారారు) పాత్ర చేస్తున్నారు మంచు విష్ణు. ఈ చిత్రంలో తిన్నడు వాడిన విల్లు విశిష్టత గురించి ఇటీవల మేకర్స్ తెలిపారు. తన బిడ్డ తిన్నడు ధైర్యసాహసాలకు ముగ్ధుడైన నాద నాథుడు ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ విల్లును ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతుల్యతను తిన్నడు ఎలా కాపాడాడు? అనే నేపథ్యంలో సాగే సీన్స్ ఆసక్తిగా ఉంటాయట. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుందట.



● మంచు విష్ణు



● విక్రమ్

మస్తుగున్నవ్ పోరీ...



● రామ్, కావ్యా థాపర్

'కలకత్తా మీఠా పాను లెక్క మస్తుగున్నవ్ గాని పోరీ... మే బగరుకర్తా బాబా జర్దా తట్టుకుంటవ చోరీ...' అంటూ 'మార్ ముంత చోడ్ చింత' పాటకు ఫుల్ ఎనర్జీతో చిందేశారు రామ్. అంతే ఎనర్జిటిక్‌గా ఈ హీరోతో కాలు కదిపారు హీరోయిన్ కావ్యా థాపర్. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్'లోని పాట ఇది. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. మంగళవారం 'డబుల్ ఇస్మార్ట్'లోని 'మార్ ముంత చోడ్ చింత...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'సిన లెక్క ఉన్న షేపు చూస్తే మల్లా... పిస్స పిస్స అయితాందే నా దిల్లులా... ఏమ్ జేద్దామంటావ్ మరి... మార్ ముంత...' అనే లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. మణిశర్మ సంగీత సారథ్యంలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, ధనుంజన్ సీపాన, కీర్తన శర్మ పాడారు. రామ్–పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.

ఆ సినిమా రోజులు గుర్తొస్తున్నాయి

– విశ్వక్ సేన్



● సందీప్, హర్ష, విశ్వక్ సేన్, సుప్రజ్, తరుణ్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'గలీజ్..' సాంగ్ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రోటి కపడా రొమాన్స్' టీమ్‌ను చూస్తుంటే నాకు మా 'ఈ నగరానికి ఏమైంది?' సినిమా రోజులు గుర్తొస్తున్నాయి. నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌కు ప్రేమకథలపై మంచి జడ్జిమెంట్ ఉంది. ఈ సినిమా విజయం సాధించి, మంచి వసూళ్లను రాబట్టాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మంచి ఎమోషనల్ రైడ్ ఫిల్మ్ ఇది'' అన్నారు విక్రమ్ రెడ్డి. ''ఓ కొత్త పాయింట్‌ను యువతకు చెప్పాలని 'రోటి కపడా రొమాన్స్'లాంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీని తీశాం'' అన్నారు బెక్కెం వేణుగోపాల్. ''ప్రేక్షకులందర్నీ అలరించే సినిమా ఇది'' అన్నారు నిర్మాత సృజన్‌కుమార్. కృష్ణకాంత్ లిరిక్స్ అందించిన ఈ 'గలీజ్' పాటను రాహుల్ సిప్లిగంజ్, పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు.

సాక్షి **బిజినెస్**
బుధవారం
17-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	52	80,717
నిఫ్టీ ▲	26	24,613

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,433	▲	40
డోజోన్స్	40,819	▼	607
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,165	▼	18
డాక్స్	18,518	▼	73
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,976	▲	2
నికాయ్	41,275	▲	84

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
72,932	▲	407
బంగారం (99.5 స్వచ్ఛత)		
72,640	▲	405
వెండి (కిలో)		
91,835	▲	107

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.14	84.16
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.22	109.81
€	యూరో	ఎస్‌బీఐ	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.38	53.53
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

హల్వా రుచులతో బడ్జెట్ సందడి షురూ..

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'సాంప్రదాయక హల్వా రుచుల' వడ్డింపుతో 2024–25 బడ్జెట్ రూపకల్పన తుదిదశకు చేరింది. లోక్‌సభలో ఆర్థికమంత్రి ఈ నెల 23వ తేదీన మోదీ 3.0 ప్రభుత్వ మొదటి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే. నార్త్‌బ్లాక్ బేస్‌మెంట్‌లో బడ్జెట్ పత్రాల రహస్య ముద్రణ ప్రారంభాన్ని పురస్కరించుకుని సాంప్రదాయంగా వస్తున్న హల్వా రుచుల ఆరగింపు కార్యక్రమంలో ఆర్థికమంత్రి పాల్గొని సీనియర్ అధికారులకు స్వీట్స్‌ను అందజేస్తూ ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్ ముద్రణా ప్రక్రియలో పాల్గొనే అధికారులు అందరూ ఈ హల్వా రుచుల కార్యక్రమం అనంతరం జూలై 23వ తేదీ పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి ప్రసంగం పూర్తయ్యే వరకూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి ఉంటుంది. సీతారామన్‌తో పాటు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ సహా ఇతర సీనియర్ అధికారులు ఈ వేడుకలో పాల్గొన్నారు.



మార్కెట్ రికార్డుల హ్యాట్రిక్

ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్ల దన్ను • 24,600 స్థాయిపైకి నిఫ్టీ • మొహర్రం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు

ముంబై: స్టాక్ సూచీల రికార్డుల జోరు మూడో రోజూ కొనసాగింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, టెలికం షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 52 పాయింట్లు పెరిగి 80,717 వద్ద ముగిసింది. నిఫ్టీ 26 పాయింట్ల లాభంతో 24,613 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డు. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు..., అధిక వాల్యుయేషన్ల ఆందోళనల తో పరిమిత శ్రేణిలో కదలాడాయి. అయినప్పటికీ.., ఒక దశలో సెన్సెక్స్ 233 పాయింట్లు బలపడి 80,862 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు ఎగసి 24,635 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, యుటిలిటీ, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి.

▪ మొహర్రం సందర్భంగా బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు నేడు సెలవు. ట్రేడింగ్ జరగదు. అయితే కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లలో మాత్రం సాయంత్రంసెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది.

వేదాంతా క్విప్ ధర రూ. 461

వేదాంతా అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ (క్విప్)కి తెరతీసింది. షేరుకి రూ. 461.26 ఫ్లోర్ ధరలో రూ. 8,500 కోట్లు సమీకరించనుంది. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలకు వినియోగించనుంది. సోమవారం ముగింపు ధర రూ. 459.4తో పోలిస్తే ఫ్లోర్ ధర స్వల్ప ప్రీమియం.

వేదాంతా షేరు బీఎస్‌ఈలో 1% నీరసించి రూ. 456 వద్ద ముగిసింది.



బజాజ్ ఆటో స్పీడ్

క్యూ1లో రూ. 1,942 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 1,942 కోట్లను తాకింది. దేశీ విక్రయాలతోపాటు.. ఎగుమతులు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,644 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,312 కోట్ల నుంచి రూ. 11,932 కోట్లకు బలపడింది. ఇక స్టాండెలోన్ నికర లాభం 19 శాతం వృద్ధితో రూ. 1,988 కోట్లకు చేరింది. ఈ కాలంలో మొత్తం వాహన విక్రయాలు 7 శాతం అధికమై 11,02,056 యూనిట్లను తాకాయి. వీటిలో దేశీయంగా 8 శాతం వృద్ధితో 6,90,621 వాహనాలు అమ్ముడుపోయాయి. ఎగుమతులు సైతం 7 శాతం మెరుగుపడి 4,11,435 యూనిట్లకు చేరాయి.



సరైన ధరలు: వాహనాలకు ఉత్తమ ధరలు, వ్యయ నియంత్రణలు లాభాల్లో వృద్ధికి దోహదపడినట్లు బజాజ్ ఆటో పేర్కొంది. దీంతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఎదురైన ఒత్తిడిని అధిగమించినట్లు తెలియజేసింది. కాగా, అదనపు డైరెక్టర్‌గా సంగీతా రెడ్డిని బోర్డు నియమించినట్లు పేర్కొంది. ఈ నెల 16 నుంచి ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహిస్తారని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు బీఎస్‌ఈలో 1.3 శాతం బలపడి రూ. 9,805 వద్ద ముగిసింది.

కొత్త యూజర్లలో జియో, ఎయిర్‌టెల్ జోరు

మేలో 34.4 లక్షల కనెక్షన్లు

న్యూఢిల్లీ: కొత్త యూజర్ల విషయంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ జోరు కొనసాగుతోంది. మే నెలలో రెండు సంస్థలకు కలిపి 34.4 లక్షల కనెక్షన్లు జతయ్యాయి. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మే నెలలో జియోకి కొత్తగా 21.9 లక్షల మంది యూజర్లు, ఎయిర్‌టెల్‌కి 12.5 లక్షల మంది మొబైల్ కస్టమర్లు జతయ్యారు. జియో మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 47.46 కోట్లకు చేరింది. మరోవైపు, వొడాఫోన్ ఐడియా మరో 9.24 లక్షల మంది యూజర్లను కోల్పోయింది. మేలో 1.2 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ) కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ట్రాయ్ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఎంఎన్‌పీని అమల్లోకి తెచ్చినప్పటి నుంచి మే నెలాఖరు వరకు వచ్చిన మొత్తం ఎంఎన్‌పీ అభ్యర్థనల సంఖ్య 98.56 కోట్లకు చేరినట్లు వివరించింది. అటు బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య నెలవారీగా 0.72 శాతం వృద్ధితో 93.5 కోట్లకు చేరింది.

గృహ రుణ వడ్డీపై మినహాయింపు పెంచాలి

హౌసింగ్‌కు దన్నుగా చర్యలు తీసుకోవాలి • బడ్జెట్‌పై నారెడ్కో వినతులు



అఫోర్డబుల్ గృహాల కొనుగోళ్లు, నిర్మాణానికి ఊతం లభించేలా బడ్జెట్‌లో పన్నులపరమైన మినహాయింపులు ప్రకటించాలని కేంద్రాన్ని బిల్డర్లు కోరుతున్నారు. సొంతంగా ఇంటికోసం తీసుకున్న గృహ రుణాల మీద కట్టే వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలని రియల్టర్ల సమాఖ్య నారెడ్కో విజ్ఞప్తి చేసింది. ప్రాపర్టీ ధరలు, వడ్డీ రేట్లు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రస్తుతం రూ. 2 లక్షలుగా ఉన్న ఈ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచాలని కోరింది. స్టాక్ ఇన్ ట్రేడ్‌గా వ్యవహరించే ప్రాపర్టీపై నామమాత్ర ఆదాయాన్ని లెక్కగట్టే వ్యవధిని ప్రస్తుతమున్న రెండేళ్ల నుంచి అయిదేళ్లకు పెంచాలని కోరింది. మార్కెట్‌లో పరిస్థితులు బాగాలేనప్పుడు రియల్ ఎస్టేట్ డెవలపర్లు సాధారణంగానే నిల్వలను అట్టే పెట్టుకుని ఉంచుకోవాల్సి వస్తుంది కాబట్టి, వారికి ఈ విషయంలో వెసులుబాటు ఇవ్వాలని పేర్కొంది. ఈ సిఫార్సులను అమలు చేస్తే డెవలపర్లకు ఊరట లభించడంతో పాటు హౌసింగ్ రంగంలో డిమాండ్‌కి కూడా ఊతం లభించగలదని నారెడ్కో ప్రెసిడెంట్ జి. హరిబాబు తెలిపారు. ఇటు కొనుగోలుదారులకు అటు ఇన్వెస్టర్లకు కూడా పన్నులపరంగా సత్వరం మరిన్ని ప్రయోజనాలను కల్పించాల్సిన అవసరం ఉందని స్టెర్లింగ్ డెవలపర్స్ సీఎండీ రమణి శాస్త్రి తెలిపారు. 'పన్ను రేట్లను తగ్గించడం రూపంలోనో లేక ట్యాక్స్ శ్లాబ్‌లను సర్దుబాటు చేయడం ద్వారానో వ్యక్తిగత పన్నులపరంగా బడ్జెట్‌లో కొంత ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది' అని వివరించారు.

వడ్డీ సబ్సిడీ పథకాలతో ప్రోత్సాహం..

రూ. 15–75 లక్షల శ్రేణిలోని ఇళ్లకి డిమాండ్, సరఫరా పెరిగేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో తగు చర్యలు ప్రతిపాదించాలని హౌసింగ్‌డాట్‌కామ్ గ్రూప్ సీఈవో ధృవ్ అగర్వాలా తెలిపారు. వడ్డీ సబ్సిడీ పథకాల్లాంటివి ఇస్తే భావి గృహ కొనుగోలుదారులకు ప్రోత్సాహకంగా ఉండగలదని పేర్కొన్నారు. సరఫరాను ప్రభుత్వం దగ్గర విస్తృతంగా ఉన్న స్థలాలను ప్రైవేట్ డెవలపర్లకు కొంత తక్కువ ధరకు ఇవ్వడంతో పాటు తక్కువ వడ్డీ రేట్లపై రుణాలు లభించేలా చర్యలు తీసుకోవడం ద్వారా సరఫరా పుంజుకునేందుకు కేంద్రం తోడ్పడగలదని వివరించారు. ఇలాంటి వాటితో రియల్ ఎస్టేట్ రంగంతో పాటు 200 అనుబంధ పరిశ్రమలు, ఉపాధి కల్పనకు తోడ్పాటు లభించగలదని అగర్వాలా చెప్పారు.



– సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి వెలుగులు

అంతర్జాతీయంగా రికార్డు

న్యూఢిల్లీ/న్యూయార్క్: అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి పరుగులు పెడుతోంది. ఫ్యూచర్స్ మార్కెట్ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న ఆగస్టు కాంట్రాక్ట్ ధర ఈ వార్త రాస్తున్న రాత్రి 9 గంటల సమయంలో ఔన్స్‌కు (31.1గ్రా) ఆల్‌టైమ్ హై 2,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల కోత అంచనా, ఈటీఎఫ్‌ల డిమాండ్, డాలర్ స్థిరత్వం వంటి అంశలు దీనికి కారణం.

ఢిల్లీలో ఐదురోజుల్లో రూ.1,300 అప్

ఇక అంతర్జాతీయ ట్రెండ్‌కు తోడు ఆభరణ వర్తకుల డిమాండ్ నేపథ్యంలో బంగారం ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా ఐదవ రోజూ పెరిగింది. పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర మంగళవారం రూ.550 పెరిగి రూ.75,700కు చేరింది. గడచిన ఐదు సెషన్లలో రేటు రూ.1,300 పెరిగింది.



హృతిక్ రోషన్‌తో 'జీప్' ప్రచార కార్యక్రమం

హైదరాబాద్: కార్ల తయారీ సంస్థ 'జీప్ ఇండియా' బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్‌తో కలిసి నూతన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. దీని ద్వారా జీప్ రాంగ్లర్ అత్యుత్తమ ప్రదర్శన, ఆకర్షణీయ ఫీచర్లను కస్టమర్లకు తెలియజేయనుంది. 'వన్‌అండ్‌ఓన్లీ' ట్యాగ్‌లైన్ తగ్గట్లు సాటిలేని ప్రమాణాలతో వాహనాలను రూపొందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అత్యుత్తమ స్థాయిని చేరుకోవడమే కాకుండా, ఈ స్థాయిని నిలుపుకునేందుకు నిరంతరం శ్రమిస్తామని జీప్ ఇండియా ప్రకటించింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాపై దివాలా చర్యలు	ఈవీ రంగంలో భారీ ఉపాధి

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లో 450 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (ఏఎఫ్ఎంఎస్).. షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 450 (పురుషులు–338, మహిళలు–112).
» **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి ఎంబీబీఎస్ డిగ్రీ అభ్యర్థులకు 30 ఏళ్లు, పీజీ డిగ్రీ అభ్యర్థులకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, ఫిజికల్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 16.07.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**04.08.2024
» **ఇంటర్వ్యూ తేదీ:** 28.08.2024 నుంచి ప్రారంభం
» **ఇంటర్వ్యూ వేదిక:** ఆర్మీ హాస్పిటల్ (ఆర్ఆర్), ఢిల్లీ కంటోన్మెంట్.
» **వెబ్‌సైట్:** https://amcsscentry.org

ఐటీబీపీలో 112 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)..గ్రూప్–సి నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) విభాగంలో.. హెడ్ కానిస్టేబుల్(ఎడ్యుకేషన్ అండ్ స్ట్రెస్ కౌన్సిలర్) పోస్టుల భర్తీకి పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 112 (పురుషులు–96, మహిళలు–16).
» **అర్హత:** డిగ్రీ (సైకాలజీ) లేదా ఏదైనా డిగ్రీ, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 05.08.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:**నెలకు రూ.25,500 నుంచి రూ.81,100
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2024.
» **వెబ్‌సైట్:** https://itbpolice.nic.in

ఐటీబీపీలో 29 ఎస్ఐ, స్టాఫ్ నర్స్ పోస్టులు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ).. దేశవ్యాప్తంగా ఐటీబీపీ కేంద్రాల్లో ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 29.
» **పోస్టుల వివరాలు:**సబ్ ఇన్‌స్పెక్టర్(స్టాఫ్ నర్స్)–10,అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫార్మసిస్ట్)–05, హెడ్ కానిస్టేబుల్ (మిడ్ వైఫ్–మహిళలు)–14.
» **అర్హత:** పదో తరగతి, 10+2, జీఎన్ఎం, ఏఎన్ఎం, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టాఫ్‌నర్స్)–రూ.35,400 నుంచి రూ.1,12,400; అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఫార్మసిస్ట్)–రూ.29,200 నుంచి రూ.92,300; హెడ్ కానిస్టేబుల్ (మిడ్‌వైఫ్–మహిళలు)–రూ.25,500 నుంచి 81,100.
» **వయసు:** ఎస్ఐ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్లు, ఏఎస్ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్లు, హెచ్‌సీ పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్,ప్రాక్టికల్ ఎగ్జామినేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.07.2024
» **వెబ్‌సైట్:** https://itbpolice.nic.in

సెయిల్-బిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో 45 పోస్టులు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. బిలాయ్ స్టీల్ ప్లాంట్ (బీఎస్‌పీ)లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45.
» **ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** సీనియర్ మెడికల్ ఆఫీసర్/కన్సల్టెంట్–19.
» **విభాగాలు:** జనరల్ మెడిసిన్,డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ తదితరాలు.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** మైన్స్ ఫోర్‌మెన్–03, జూనియర్ ఇంజనీరింగ్ అసోసియేట్ (ఎలక్ట్రికల్)–14, టెక్నికల్ అసోసియేట్ (బాయిలర్ ఆపరేషన్)–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీటెక్ (మైనింగ్/సివిల్), ఎంబీబీఎస్, పీజీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.08.2024
» **వెబ్‌సైట్:** https://www.sail.co.in

పీఎన్‌బీలో అప్రెంటీస్‌లకు ఆహ్వానం

» పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అప్రెంటీస్ నియామకాలు
» మొత్తం 2,700 ఖాళీల భర్తీకి ఈ నెల 28న పరీక్ష
» నెలకు రూ.10 వేలు-15 వేలు స్టయిఫండ్

బ్యాంకింగ్ రంగం.. కొలువులు, నియామకాల పరంగా కళకళలాడే రంగం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు నిత్యం నియామకాలు చేపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి అప్రెంటిస్ చక్కటి మార్గం చూపుతోంది. తాజాగా ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్.. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. మొత్తం 2,700 అప్రెంటీస్‌ల నియామకానికి త్వరలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. పీఎన్‌బీ అప్రెంటీస్ ఖాళీలు, ఎంపిక ప్రక్రియ, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..



బ్యాంకింగ్ కెరీర్

బ్యాంకింగ్ రంగంలో.. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పని అనుభవం తప్పనిసరిగా మారుతోంది. ఇలాంటి కొలువులు సొంతం చేసుకోవడానికి అప్రెంటీస్‌షిప్ ద్వారా పొందిన అనుభవం ఉపయోగపడుతుంది. కాబట్టి బ్యాంకింగ్ కెరీర్ కోరుకునే వారు అప్రెంటీస్‌షిప్ శిక్షణ పొందడంమేలంటున్నారు నిపుణులు.

అప్రెంటీస్ యాక్ట్ మేరకు

పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. నేషనల్ అప్రెంటీస్ యాక్ట్–1961కు అనుగుణంగా అప్రెంటీస్‌ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం అభ్యర్థుల ఎంపికకు రాత పరీక్ష నిర్వహించనుంది. ఇందులో విజయం సాధించిన వారికి అప్రెంటీస్‌గా అవకాశం కల్పించి స్టయిపండ్ కూడా అందించనుంది.

మొత్తం 2,700 ఖాళీలు

పీఎన్‌బీ తాజా నోటిఫికేషన్ ప్రకారం–జాతీయ స్థాయిలో మొత్తం 2,700 అప్రెంటీస్‌ల నియామకం చేపట్టనుంది. రాష్ట్రాల వారీగా, ఆయా రాష్ట్రాల్లో జిల్లాల వారీగా అప్రెంటీస్ ఖాళీల సంఖ్యను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో.. ఏపీలో 27, తెలంగాణలో 34 అప్రెంటీస్ ట్రైనీ ఖాళీలు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

▪ 2024, జూన్ 30 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
▪ **వయసు:** 2024, జూన్ 30 నాటికి 20–28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష

పీఎన్‌బీ అప్రెంటీస్ ట్రైనీ నియామకాలను రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఖరారు చేస్తారు. ఆన్‌లైన్‌లో రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో నాలుగు విభాగాలు (జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్) ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. మొత్తం నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలతో 100 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం ఒక గంట.

ప్రాంతీయ భాష పరీక్ష

పీఎన్‌బీ అప్రెంటీస్ నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తాము ఎంచుకున్న ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ రాత పరీక్షలో పొందిన మార్కులు, నిర్దేశిత కటాఫ్ ఆధారంగా మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ప్రాంతీయ భాషలో పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ప్రాంతీయ భాషను ఎంచుకోవాలి. నిర్దిష్టంగా ఒక రాష్ట్రంలోని పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రాష్ట్ర భాషలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రాంతీయ భాష పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే.. అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారవుతుంది. నిర్దిష్టంగా ఒక ప్రాంతీయ భాషను ఎంచుకున్న అభ్యర్థులు.. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో సదరు భాషను అభ్యసించి ఉంటే వారికి ప్రాంతీయ భాష పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.

మెడికల్ ఎగ్జామినేషన్

ఆన్‌లైన్ పరీక్ష, అదేవిధంగా ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించి.. ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్ నిర్వహించి అప్రెంటీస్ ట్రైనీగా నియామక పత్రం అందిస్తారు.

అప్రెంటీస్ ట్రైనీగా విధులు

అప్రెంటీస్ ట్రైనీగా నియమితులైన అభ్యర్థులు వారికి కేటాయించిన బ్రాంచ్‌లలో ఏడాది పాటు ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సీనియర్ సిబ్బందికి సహకరించడం, అదేవిధంగా బ్యాంకింగ్ రంగంలో జరిగే కార్యకలాపాలకు సంబంధించిన బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ఏడాది వ్యవధిలో రెండు వారాలు ప్రాథమిక శిక్షణ, 52 వారాలు ఆన్-జాబ్ ట్రైనింగ్ ఉంటుంది.

స్టయిఫండ్

అప్రెంటీస్‌గా నియమితులైన వారికి పీఎన్‌బీ స్టయిఫండ్ అందిస్తుంది. గ్రామీణ/సెమీ అర్బన్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.10 వేలు; అర్బన్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.12 వేలు; మెట్రో బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

భవిష్యత్ అవకాశాలు

ప్రస్తుతం బ్యాంకులు నియామకాల్లో అనుభవం ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రధానంగా కోర్ బ్యాంకింగ్ విధుల విషయంలో అనుభవమే ప్రధాన ప్రాతిపదికగా నిలుస్తోంది. ప్రముఖ బ్యాంకులలో అప్రెంటీస్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బ్యాంకింగ్ సెక్టార్‌లో కొలువు అందుకోవడం సులభమని చెప్పొచ్చు. కాబట్టి పీఎన్‌బీలో అప్రెంటీస్ ట్రైనీలు భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది.

ముఖ్య సమాచారం

▪ **ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ:** 2024, జూలై 28
▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.pnbindia.in/Recruitments.aspx

రాత పరీక్షలో రాణించే మార్గం

అప్రెంటీస్ నియామకాల్లో భాగంగా నాలుగు విభాగాల్లో గంట వ్యవధిలో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో విజయానికి అభ్యర్థులు సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించాలంటే.. తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించిన చట్టాలు,విధానాలు,రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో..కరెంట్ అఫైర్స్,స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ..ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో.. ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్


ఇందులో అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు,లాభ–నష్టాలు, నంబర్ సిరీస్,బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించాలంటే.. కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై ఫోకస్ చేయాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

ఆయా సబ్జెక్ట్‌లలోని కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఐబీపీఎస్ గత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల ప్రశ్నలు అడిగే తీరుపై అవగాహన లభిస్తుంది. ప్రిపరేషన్ సమయంలోనే అభ్యాసంతోపాటు ప్రాక్టీస్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతో పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబరిచి మెరిట్ లిస్ట్‌లో నిలిచే అవకాశాలు మెరుగవుతాయి.



బ్రెయిన్ ఈటింగ్ అమీబా జాగ్రత్త సుమా!

కేరళలో ముగ్గురు చిన్నారుల మృతితో సంచలనం.. అన్ని రాష్ట్రాలూ అప్రమత్తం
తెలుగు రాష్ట్రాల్లో లేని 'నెగ్లేరియా ఫౌలేరీ' ఆనవాళ్లు
కలుషిత చెరువులు, సరైన నిర్వహణ లేని స్విమ్మింగ్ పూల్‌ల వల్ల వ్యాపించే చాన్స్.. జాగ్రత్త అవసరమంటున్న వైద్య నిపుణులు

హెల్త్‌డెస్క్

కేరళలో బ్రెయిన్ ఈటింగ్ అమీబా కారణంగా ఇటీవల ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పాటు అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేసింది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ తరహా అమీబా అనవాళ్లు లేకపోయినా వైద్య ఆరోగ్య శాఖలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కలుషితమైన చెరువులు, నీటివనరులతో పాటు సరైన నిర్వహణ లేని స్విమ్మింగ్ పూల్‌లలో చిన్నారులు ఈదడం వల్ల ఈ తరహా అమీబా వ్యాపించే అవకాశం ఉంది. చిన్నారుల్లో రోగ నిరోధకత తక్కువ కాబట్టి వారిపై ఇది ఎక్కువగా ప్రభావం చూపిస్తుంది.

ముక్కు రంధ్రాల్లోంచి మెదడుకు..

నెగ్లేరియా ఫౌలేరీ అని పిలిచే ఈ అమీబా ప్రపంచవ్యాప్తంగా లోతు తక్కువ ఉండే చెరువులు, సరస్సులు, కాల్వలతో పాటు పంటపొలాలు, నేలల్లోనూ నివసిస్తుంది. బాగా వేడిగా ఉండే నీటి బుగ్గల్లో (హాట్ స్ప్రింగ్స్) కూడా ఇది మనుగడ సాగించగలుగుతుంది. ఇది మెదడులో 'ప్రైమరీ అమీబిక్ మెనింగో ఎన్‌కెఫలైటిస్ – (పామ్)' అనే తీవ్రమైన ఇన్ఫెక్షన్‌ను కలుగజేస్తుంది. (ఈ కారణంగానే దీనిని బ్రెయిన్ ఈటింగ్ అమీబాగా పేర్కొంటున్నారు) నాడీ వ్యవస్థను దెబ్బతీయడం వల్ల మరణించే అవకాశమూ ఉంది. చిన్నారులు చెరువులు, ఈత కొలనుల్లాంటి వాటిల్లో ఈదుతున్నప్పుడు ఈ అమీబా వాళ్ల ముక్కు రంధ్రాల్లోంచి మెదడుకు చేరి 'పామ్'ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది.

లక్షణాలు
- తీవ్రమైన జ్వరం
- తీవ్రమైన తలనొప్పి
- వికారం, వాంతులు
- వణుకు
- అయోమయం
- మెదడువాపులో కనిపించే అన్ని లక్షణాలతో పాటు మెడ కదలించలేకపోవడం (స్టిఫ్ నెక్), వెలుతురు చూడలేకపోవడం.

చివరగా కోమాలోకి వెళ్లే ప్రమాదం

నిర్ధారణ
- లంబార్ పంక్చర్ ప్రక్రియ ద్వారా వెన్నుపాము చివరి భాగం నుంచి నీరు (సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) తీసి పరీక్షించాల్సి ఉంటుంది.
- కొన్నిసార్లు మెదడు బయాప్సీ నిర్వహించి అక్కడ అమీబా ఉనికిని గుర్తించాల్సి ఉంటుంది.

నివారణ
- కలుషిత నీటితో కూడిన చెరువులు, కాల్వలు, సరస్సుల వంటి వాటిల్లోకి పిల్లలు వెళ్లకుండా చూసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల విషయంలో ఇది మరీ ప్రమాదం.
- నగరాల్లోని స్విమ్మింగ్ పూల్స్‌లో వాటి నిర్వహణ సరిగా (క్లోరినేషన్ చేయడం, పరిశుభ్రమైన నీటినే వాడటం) ఉందా లేదా? అనే విషయాలను పరిశీలించాకే పిల్లలను పంపాలి.
- కొందరు యోగా నిపుణులు ఓ కొమ్ము చెంబు నుంచి నేరుగా ముక్కు రంధ్రం ద్వారా నీటిని బయటకు ప్రవించేలా చేసే 'నేతి' ప్రక్రియ చేయిస్తుంటారు. అయితే మామూలు నల్లా / కొళాయి నీళ్లతో చేసేవారు బాగా మరగబెట్టి చల్లార్చిన నీటితోనే దీన్ని చేయాలి. కలుషితమైన నీళ్లతో చేస్తే పెద్దవారిలోనూ బ్రెయిన్ ఈటింగ్ అమీబా తాలూకు 'పామ్'ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.

ఎంత వేగంగా చికిత్స చేస్తే అంత మేలు

దీనికి నిర్దిష్ట చికిత్స అంటూ ఏదీ లేదు. కరోనా కేసుల్లో మెదడుకు బ్లాక్ ఫంగస్ వచ్చినప్పుడు ఉపయోగించిన యాంఫోటెరిసిన్-బి వంటి మందులతో పాటు రిఫాపిన్, ఫ్లుకోనాజోల్, మిల్టెఫొసైన్ వంటి మందులను ఉపయోగిస్తారు. (మిల్టెఫొసైన్‌ను.. శాండ్‌ఫ్లై అనే కీటకాల్లో ఉంటూ లీష్మానియాసిస్ అనే వ్యాధిని కలిగించే పరాన్నజీవి సంబంధిత ఇన్ఫెక్షన్‌కు ఉపయోగించడానికి 'ఎఫ్‌డీఏ'అనుమతించింది). త్వరగా వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంత మేలు. చిన్నారులకు చల్లటి నీళ్లతో (మరీ చల్లటివి కాదు) స్పాంజింగ్ చేస్తూ జ్వరం తగ్గేలా చేయడం వల్ల వేగంగా కోలుకుంటారు.



డా. విజయ్, న్యూరాలజిస్ట్, కిమ్స్ ఐకాన్, వైజాగ్



కనువిందు చేస్తున్న గుండం

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీప గుట్టల్లో ఉన్న గుండం జలపాతం కనువిందు చేస్తోంది. వాజేడు మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో అరుణాచలపురం గ్రామం ఉండగా, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న రహదారి గుండా 3.5 కిలోమీటర్లు నేరుగా వెళ్తే ఈ గుండం జలపాతం వస్తుంది. సుమారుగా 3 కిలోమీటర్ల మేర కాలి నడకన వెళ్లాల్సి ఉంటుంది. అక్కడకు వెళ్లేందుకు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోగా, దూరంగా ఉండటంతో పర్యాటకులు వెళ్లడం లేదు.



6,270 మీటర్ల ఎత్తుపై మనోడు

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన పర్వతారోహకుడు భూక్య యశ్వంత్ భారత యూనియన్ భూ భాగం లడఖ్‌లోని 'మౌంట్ కాంగ్ యాత్సే–2'పర్వతంపై జాతీయ పతాకాన్ని సోమవారం ఎగురవేశారు. 6,270 మీటర్ల ఎత్తులో ఉన్న కాంగ్ యాత్సే పర్వతాన్ని 8 రోజుల్లో అధిరోహించి శభాష్ అనిపించుకున్నారు. గత నెలలోనే యశ్వంత్ ఆసక్తిని, ప్రతిభను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా యశ్వంత్ సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాశారు. 2023 డిసెంబర్‌లో 2,228 మీటర్ల ఎత్తయిన మౌంట్ కోస్కియస్కో, 2021 జూన్‌లో జమ్మూకశ్మీర్‌లోని లేహ్‌లడఖ్ ప్రాంతంలోని 5,602 మీ. ఎత్తయిన ఖార్దుంగ్‌లా పర్వతాన్ని అధిరోహించాడు. అదే ఏడాది ఆగస్టులో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటారు. అదేవిధంగా 6,111 ఎత్తున్న యునామ్ మంచు పర్వతాన్ని అనుకున్న సమయానికంటే ఒక రోజు ముందుగానే చేరుకొని రికార్డు సృష్టించారు. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఎవరెస్టు బేస్ క్యాంపు పూర్తిచేశాడు. త్వరలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహిస్తానని భూక్య యశ్వంత్ 'సాక్షి'కి తెలిపారు.



గోతిలో దిగి..

కరీంనగర్ కార్పొరేషన్: కొత్త రోడ్డు వేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనుల ఊసెత్తక పోవడంతో కరీంనగర్ కార్పొరేషన్‌కు చెందిన వాల రమణారావు గోతిలో నిలబడి వినూత్నంగా నిరసన తెలుపుతున్న దృశ్యం. మంగళవారం నగరంలోని జ్యోతిబాపూలే మైదానం వెనకాల పనులు నిలిచిన రోడ్డు వద్ద పెద్దగోతిలో తను నిలబడి ప్లకార్డులు ప్రదర్శించారు.

'మీన'మేషాలు!

పరిరక్షణ లేక అంతరించిపోతున్న స్థానిక జాతుల చేపలు



4 రకాల చేపల పెంపకం, వినియోగమే ఎక్కువ..
166 రకాలుంటే కనుమరుగయ్యే దశకు చేరిన 20 జాతులు

- వివిధ రకాల చేపలను సేకరిస్తున్న సిద్దిపేట ప్రభుత్వ పీజీ కాలేజీ ఫిషరీస్ విద్యార్థులు
- రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే స్థానిక చేపల బ్రీడింగ్ చేస్తామంటున్న అధ్యాపకులు

సాక్షి, సిద్దిపేట

రాష్ట్రంలో స్థానిక జాతుల చేపలు అంతరించిపోయే దశకు చేరుకుంటున్నాయి. కొన్ని రకాల చేపలనే విస్తృతంగా పెంచడం, మిగతా వాటి బ్రీడింగ్, పరిరక్షణ లేకపోవడమే దీనికి కారణమవుతోంది. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ (ఫిషరీస్), ఎమ్మెస్సీ (ఫిషరీస్) అధ్యాపకులు, విద్యార్థులు చేపల జీవవైవిధ్య స్టడీ ప్రాజెక్ట్ చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్థానిక చేపలను సేకరించి భద్రపరుస్తున్నారు. ప్రభుత్వం సహకరిస్తే స్థానిక రకాల చేపల బ్రీడింగ్ చేపడతామని చెబుతున్నారు.

ఎన్ని ఉన్నా ఆ 4 రకాలే ఎక్కువ

రాష్ట్రంలో మొత్తం 166 రకాల చేపలుండగా.. నాలుగు రకాల చేపలే ఎక్కువగా లభిస్తాయి. రోహు (రవ్వ), బొచ్చ, బంగారు తీగ, బొమ్మె చేపలే విస్తృతంగా పెంచడం, వినియోగించడం జరుగుతోంది. మిగతా రకాల చేపలు మెల్లగా అంతరించిపోతున్నాయి. భవిష్యత్తులో పలు రకాల చేపల పేర్లు వినడమే తప్పితే చూసే పరిస్థితి ఉండదని నిపుణులు అంటున్నారు. ఇంటర్నేషనల్ యూనియన్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) తమ రెడ్‌బుక్‌లో ఇప్పటికే పలు రకాల చేపలు అంతరించిపోతున్నాయని వెల్లడించింది. అందులో తెలంగాణకు చెందిన 20 రకాల జాతుల చేపలు కూడా ఉండటం గమనార్హం.

65 రకాల చేపలు సేకరించి..

చేపల జీవవైవిధ్య స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలసి ఇప్పటి వరకు 65 రకాల చేపలను సేకరించారు. వాటిని ముందు తరాలకు చూపించడం, అందించడం కోసం ప్రయత్నిస్తున్నారు. సహజ ఆవాసాల్లో లభించే వివిధ రకాల చేపలను సేకరించి, స్పెసిమెన్లనూ నిల్వ చేస్తున్నారు. ఇప్పటివరకు గోదావరి, మున్నేరు, కృష్ణా నదులు, వైరా, పాలేరు రిజర్వాయర్ల నుంచి మంచినీటిలో పెరిగే చేపలను తీసుకువచ్చారు.

మలుగు పాము



పాములా కనిపిస్తున్నా ఇది చేపనే. మలుగు పాముగా పిలిచే ఈ చేపలు సాధారణంగా 2 నుంచి 3 అడుగుల మేర పెరుగుతాయి. మత్స్యకారులు దీనిని మున్నేరు వాగులో పడితే విద్యార్థులు కొనుగోలు చేసి తెచ్చారు. దీనికి పొలుసులు ఉండవు. ఇది బ్రీడింగ్ సమయంలో వలస వెళ్తుంది.

మగ దుమ్మ



ఈ చేప పేరు మగ దుమ్మ. ఇది వైరా రిజర్వాయర్‌లో లభించింది. అంతరిస్తున్న చేపల రకాల్లో ఇది కూడా ఉంది. క్యాట్ ఫిష్ జాతికి చెందిన ఈ చేపల్లో ఆరోగ్యానికి మేలు చేసే ఒమెగా–3 ఫ్యాట్ అధికంగా ఉంటుంది.

చుక్క పాంప్రెట్ చేప



ఇది చుక్క పాంప్రెట్ చేప. ఈ రకం చేపలు వలకు చిక్కాయంటే మత్స్యకారులకు పండగే. ఇవి బాగా రుచిగా ఉండటంతో ముంబై, కేరళ ప్రాంతాల ప్రజలు లొట్టలేసుకొని తింటారు. ఇవి మున్నేరు నదిలో ఉన్నాయి.

ఒక్క సిద్దిపేటలోనే ఎమ్మెస్సీ ఫిషరీస్ కోర్సు

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల బీఎస్సీ (ఫిషరీస్) కోర్సును నిర్వహిస్తున్నా.. ఒక్క సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో ఎమ్మెస్సీ(ఫిషరీస్) కోర్సు అందుబాటులో ఉంది. 2017–18లో ప్రారంభమైన ఈ పీజీ కోర్సును ఏటా 40 మంది విద్యార్థులు పూర్తి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా చేపల ఫార్మింగ్ తీరును చూపించేందుకు.. కళాశాల ప్రాంగణంలోనే రకరకాల చేపలను పెంచుతున్నారు. ఆ చేపలకు ఫుడ్‌ను కాలేజీలోనే తయారు చేస్తున్నారు. అలాగే ఎక్వేరియం చేపల బ్రీడింగ్ కూడా చేస్తున్నారు.

బ్రామ బెలగారి



ఈ చేపను ఓసియో బ్రామ బెలగారి చేప అంటారు. దీనిని గోదావరి నది నుంచి తీసుకువచ్చారు. ఇవి అచ్చం పరక చేపల మాదిరిగా ఉంటాయి. ఈ రకం చేపలు అంతరించిపోతున్న జాబితాలో ఉన్నాయి.

స్థానిక చేపల విత్తనోత్పత్తి చేస్తాం

స్థానికంగా లభించే రకరకాల చేపలు అంతరించి పోతున్నాయి. స్థానిక చేపల విత్తనోత్పత్తి దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వం సహకరిస్తే స్థానిక చేపల విత్తనోత్పత్తి చేసి అందిస్తాం. మా కళాశాలలో చదివిన విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మన రాష్ట్రంలో చేపల ఉత్పత్తిని పెంచేందుకు ఫిషరీస్ చేసిన విద్యార్థులను వినియోగించుకోవడం వల్ల మేలు జరుగుతుంది.



– అయోధ్యరెడ్డి, ఫిషరీస్ హెడ్, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సిద్దిపేట

65 రకాలు సేకరించాం..



చేపల జీవవైవిధ్య స్టడీ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 65 రకాల చేపలను సేకరించి భద్రపరిచాం. కృష్ణా, గోదావరి, మున్నేరు నదులు, వైరా, పాలేరు రిజర్వాయర్ల నుంచి అంతరించి పోతున్న చేపలను సేకరించాం. ఏదైనా కొత్త రకం చేప పడితే చెప్పాలని మత్స్యకారులను కోరాం. ఫిషరీస్ చదివిన వారికి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించి మన మత్స్య సంపదను కాపాడాలి.

– సాయికుమార్, ఎమ్మెస్సీ సెకండియర్

1,039 మంది మోముపై 'ముస్కాన్'..

స్పెషల్ డ్రైవ్ వివరాలను వెల్లడించిన అడిషనల్ డీజీ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: బాలకార్మికులు, వెట్టిచాకిరీ, యాచన చేసే చిన్నారులు, అదృశ్యమైన బాలలను గుర్తించేందుకు ఈనెల 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కూడిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బందితో పాటు కార్మికశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ, పాఠశాల విద్య, ప్రజారోగ్య, లీగల్ సర్వీస్ అథారిటీ, ఎన్జీవోల బృందాలు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 1 నుంచి 14 వరకు మొత్తం 1,039 మంది చిన్నారుల జాడను గుర్తించామని, ఇందులో బాలురు 921 మంది, బాలికలు 118 మంది ఉన్నట్టు మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ శిఖాగోయల్ 'సాక్షి'కి తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన వారు 896 మంది(788 మందిబాలురు, 108 మంది బాలికలు) కాగా, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 143 (133 మంది బాలురు, 10 మంది బాలికలు)ఉన్నట్టు తెలిపారు. మొత్తం 120 సబ్ డివిజినల్ బృందాల్లోని 646 మంది పోలీస్ సిబ్బంది ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నట్టు శిఖాగోయల్ తెలిపారు. ఈనెల 14 వరకు గుర్తించిన చిన్నారులలో 949 (843 మంది బాలురు, 106 మంది బాలికలు)చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని, మరో 90 మంది (78 మంది బాలురు, 12 మంది బాలికలు)ని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్, షెల్టర్ హోంలకు తరలించినట్టు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులను బాలకార్మికులు, వెట్టిచాకిరీ చేసే వారిగా మార్చిన వారిపై 208 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతోపాటు 211 మంది నిందితులను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 కేసులు, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 39 కేసులు, నల్లగొండలో 26 కేసులు, సిద్దిపేటలో 13 కేసులు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో తొమ్మిది కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈనెల 31 వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని శిఖాగోయల్ వివరించారు.



అడిషనల్ డీజీ శిఖాగోయల్



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముస్కాన్ టీంలు రక్షించిన బాల కార్మికుడు

విశాఖకు వందేభారత్ స్లీపర్?

- రెండు సర్వీసులూ కిటకిట..మూడో దానికి డిమాండ్
- రైల్వే బోర్డుకు దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: ఒకేమార్గంలో రెండు వందేభారత్ రైళ్లు ఉన్నా, మూడోది కూడా అవసరమన్న డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో వందేభారత్ స్లీపర్ రైలు కోసం ఇప్పుడు రైల్వేబోర్డుకు దక్షిణమధ్య రైల్వే ప్రతిపాదించింది. తెలంగాణ మీదుగా నడుస్తున్న నాలుగు వందేభారత్ రైళ్లు 110 శాతం ఆక్యుపెన్సీ రేషియోను మించాయి. ఇందులో విశాఖకు వెళ్లే వందేభారత్ రైలు ఏకంగా 148 శాతం ఆక్యుపెన్సీ రేషియోను మించి నడుస్తుండటం విశేషం. గత సంవత్సరం సంక్రాంతి రోజు దక్షిణమధ్య రైల్వే తొలి వందేభారత్ రైలు సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య పట్టాలెక్కింది. తొలిరోజు నుంచే అది కిటకిటలాడుతూ పరుగు ప్రారంభించింది. ఆక్యుపెన్సీ రేషియో ఏ దశలోనూ 130 శాతానికి తగ్గలేదు. దేశవ్యాప్తంగా గరిష్ట ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్న తొలి మూడు వందేభారత్ రైళ్లలో ఒకటిగా ఇది రికార్డు సృష్టించింది. దీంతో ఈ రెండు నగరాల మధ్య మరో వందేభారత్ రైలు అవసరం ఉందని దక్షిణమధ్య రైల్వే.. బోర్డుకు ప్రతిపాదించింది. ఒకే కావడంతో 2023 జనవరిలో ఈ మార్గంలో మొదటి రైలు ప్రారంభం కాగా, ఈ సంవత్సరం మార్చిలో రెండో వందేభారత్ రైలు మొదలైంది. మొదటి వందేభారత్ రైలు గతేడాది 130 శాతం ఆక్యుపెన్సీతో నడవగా, రెండో వందేభారత్ వచ్చాక అది ఏమాత్రం తగ్గకపోగా మరింత పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు దాని సగటు ఆక్యుపెన్సీ రేషియో 135 శాతంగా రికార్డయ్యింది. ఇక విశాఖపట్నం రెండో వందేభారత్ ప్రారంభమైన మొదటి నెల 143 శాతం సగటు ఆక్యుపెన్సీ రేషియోతో నడవగా, గత నాలుగు నెలల సగటు 148 శాతానికి చేరుకుంది. దీంతో ఇప్పుడు మూడో వందేభారత్ రైలు ఈ మార్గంలో అవసరమన్న విషయాన్ని దక్షిణమధ్య రైల్వే గుర్తించింది. ఆగస్టులో వందేభారత్ స్లీపర్ సర్వీసులు మొదలు కాబోతున్నాయి. తొలి రైలు ముంబయి–అహ్మదాబాద్ మధ్య నడిచే అవకాశముంది. సికింద్రాబాద్–విశాఖపట్నం మార్గంలో స్లీపర్ వందేభారత్ రైలు ప్రారంభిస్తే లాభదాయకంగా నడుస్తుందని అధికారులు అంటున్నారు.

ఆస్తి పంచకముందే అమ్మ..
పంచాక.. ఇదేమి ఖర్మ!!

తల్లి బాగోగులు పట్టించుకోని కుమారుల నిర్వాకం



గార్ల: ఆస్తి మొత్తం పంచుకొని అన్నం పెట్టకుండా కొడుకులు వదిలేయడంతో ఉండటానికి గూడు లేక, వేరే వాళ్ల ఇళ్ల ముందు పడుకుంటూ జీవనం నెట్టుకొస్తున్న ఓ కన్నతల్లి దీనగాథ ఇది. మహబూబాబాద్ జిల్లా గార్లలో మంగళవారం ఆ వృద్ధురాలైన తల్లి విలేకరుల ముందు తన గోడును వెళ్లబోసుకుంది. గార్ల గ్రామంలోని జెండాబజారుకు చెందిన వృద్ధురాలు నర్సమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. వీరికి ముగ్గురు కుమారులు. ఉన్న 3 ఎకరాల భూమిని కొడుకులు పంచుకున్నారు. ఆ తర్వాత ఇంటిని సైతం కూలగొట్టి తల్లికి గూడు లేకుండా చేశారు. ఆస్తి పంచుకునే ముందు కొడుకులు ప్రతి నెలా ఒకరు సాకుతామని ఒప్పందం చేసుకున్నారు. తీరా ఆస్తి పంచిన తర్వాత కొడుకులు బాగోగులు చూడక పోవడంతో అదే బజారులో ఎవరైనా అన్నం పెడితే తినడం, అలాగే బజారులోని ఇళ్ల గద్దెలపై పడుకుంటున్నానని వృద్ధురాలు తెలిపింది. వారం రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన గోడు చెప్పుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకులను పిలిపించి తనకు ఉండటానికి ఒక గూడు ఏర్పాటు చేసి అన్నం పెట్టేలా చూడాలని నర్సమ్మ వేడుకుంటోంది. ఈ విషయమై ఎస్సై ఎన్ జీనత్‌కుమార్‌ను 'సాక్షి'వివరణ కోరగా నర్సమ్మ ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనగోడు చెప్పుకుందని, కానీ ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.



15 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి..

గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించిన డీఎంహెచ్‌ఓ

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలో గుట్టలపైనున్న పెనుగోలు గ్రామానికి మంగళవారం జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య కాలి నడకన వెళ్లారు. గుమ్మడిదొడ్డి గ్రామం దగ్గరినుంచి సుమారుగా 15 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ మధ్యలోని వాగులు, వంకలు దాటి వెళ్లారు. డీఎంహెచ్‌ఓ రాత్రి గ్రామంలోనే బస చేయనున్నారు. పెనుగోలులోని 10 కుటుంబాల వారికి దోమతెరలను ఇవ్వడంతోపాటు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయా కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులను తమ వెంట తీసుకువెళ్లారు. డీఎంహెచ్‌ఓ వెంట వాజేడు వైద్యాధికారి మహేందర్, హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, లఖాన్, రమేశ్, ఆశ వర్కర్ సమ్మక్క, గ్రామస్తులు ధర్మయ్య, ముద్దయ్య, ఆదినారాయణ ఉన్నారు.

కడసారి చూపునకూ రాని
కన్నకొడుకు..



కైలాస్‌నగర్: కన్న తల్లికి వృద్ధాప్యంలో అన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేసిన ఆ కన్న కొడుకు చివరకు ఆమె అంత్యక్రియలకు సైతం హాజరుకాలేదు. మానవ సంబంధాలు నానాటికి తెగిపోతున్నాయనేందుకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లి–బి గ్రామంలో జరిగిన ఈ ఉదంతమే నిదర్శనం. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన వృద్ధ దంపతులు విఠాబాయి–దేవురావు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి హాజరై కొడుకు నిర్వాకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఇంటికి వెళుతుండగా విఠాబాయి మృత్యుఒడి చేరిన సంగతి తెలిసిందే. ఆ వృద్ధురాలి మృతదేహాన్ని కూతురు నివాసముండే అర్లి–బి గ్రామానికి తరలించి అక్కడ అంత్యక్రియలు చేపట్టారు. లోకం విడిచిన తల్లి చితికి నిప్పంటించాల్సిన కొడుకు కనీసం కడసారి చూసేందుకు సైతం రాలేదు. దీంతో భార్య అంత్యక్రియలను భర్త దేవురావు పూర్తి చేసిన తీరు అందరిని కలిచివేసింది. బతికుండగా మానసికక్షోభకు గురిచేసిన ఆ కొడుకు చివరకు తల్లి చనిపోయిన తర్వాత కూడా అదేతీరుగా వ్యవహరించడం మానవత్వానికి మాయని మచ్చగా నిలిచింది.

ఈ ఏడాది బోనాలు తీసుకురాం

- అరిష్టం జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత: శ్యామల, శృతియాదవ్
- జోగిని, శివసత్తులు, పోతరాజులపై దాడి చేశారని ఆరోపణ



పంజగుట్ట : బల్కంపేటలో జోగిని, పోతరాజు, శివసత్తులపై దాడికి నిరసనగా ఈ ఏడాది సామూహికంగా దేవాలయాలకు బోనాలు తీసుకురామని, తమ ఇళ్లలోనే బోనాలు చేసుకుంటామని జోగిని, శివసత్తులు తెలిపారు. తాము దేవాలయాలకు బోనాలు తీసుకురాకపోవడంవల్ల తప్పకుండా అరిష్టం జరుగుతుందని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోగిని కొలిపాక శ్యామల, శివసత్తి శృతి యాదవ్‌లు మాట్లాడుతూ...రాష్ట్రంలో తొలిసారి శివశక్తులు, జోగినులను, పోతురాజులపై దాడి చేశారన్నారు. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారికంగా ఒక సమావేశం ఏర్పాటు చేసి తమకోసం ప్రత్యేక సదుపాయాలు ఏం కల్పిస్తారో పత్రికాముఖంగా వివరిస్తేనే తాము బోనం తీసుకువస్తామని వారు స్పష్టం చేశారు. బంగారుబోనం ఎత్తుకునే హక్కు కేవలం జోగిని, శివసత్తులకే ఉంటుందని, ఆ బోనం ఇతరులు ఎత్తుకుంటే అరిష్టమని ఎత్తుకున్న వారికి మంచిది కాదని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.